ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక



4 అణాలు

3-10-51

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



భారతప్రభుత్వంలో ఆర్థికప్రణాళిక శాఖామంత్రిగా నియమితులైన శ్రీ గుల్జారీలాల్‌నందాగారు రిపబ్లిక్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌గారి సమక్షంలో సెప్టెంబరు 24 వ తేదీని ప్రమాణస్వీకారం చేశారు.

మద్రాసు ప్రభుత్వ ప్రజారోగ్యశాఖా మంత్రిగా నియమితులైన శ్రీ కళా వెంకట్రావుగారు, గవర్నరు భావనగర్ మహారాజాగారి సమక్షంలో సెప్టెంబరు 21 వ తేదీని ప్రమాణస్వీకారం చేశారు.





చీఫ్ ఎగ్జిక్యూటివ్ : జె. ఎమ్. శర్మ

సీడెడ్ అండ్ చిత్తూరు : మహాత్మా పిక్చర్సు - కర్నూలు. * ఆంధ్రా : గోకులకృష్ణ పిక్చర్సు - విజయవాడ.

మైసూరు : నారాయణన్ & కంపెనీ - మద్రాసు. * నైజాం & బొంబాయి : చమేరియాటాకీ డిస్ట్రిబ్యూటర్సు.

సిటీ : అవర్ ఇండియా ఫిలిమ్స్, 19-ఇ, ఏకాంబరేశ్వర అగ్రహారం, మద్రాసు.

ఇతర ప్రాంతాలకు :

ప్రకాష్ శంకర్ పిక్చర్సు, 8-ఏ, లక్ష్మణచెట్టియార్ వీధి, మద్రాసు-17.

విషయానుక్రమణిక

అక్టోబరు 3 1951

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు


ప్రతి బుధవారము

ప్రకటింపబడును

Founder : K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 55
3-10-51

ఖర సంవత్సర ఆశ్వయుజ శుద్ధ తదియ బుధవారము



హింసకు బలి అయిన మహాత్ముడు

మహాత్ముని బలి ★ శ్రీ సత్యనారాయణ సాహా

ప్రపంచ విద్వేషాలతో రాజకీయ వాతావరణం కలుషితమై, యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకొనివస్తున్న ఈనాడు మహాత్ముని జీవితాదర్శాలనూ, సత్యాహింసల యందలి విశ్వాసాన్నీ అనుసరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అణుశక్తీ, తాత్విక సంఘర్షణా ప్రకోపించిన ఈ యుగానికి మహాత్ముడు మానవుని ఉన్నతాదర్శాలకు అనుగుణమైన తత్వాన్ని ప్రబోధించి, రాజకీయాలకూ నైతిక వర్తనకూ పారస్పర్యం ఉండాలనీ, మానవులు దృఢశీలురై ఉండాలనీ బోధించి మానవ వర్తన యొక్క ప్రాథమిక నియమాలు నిర్వచించాడు.

1948 జనవరి 30 శుక్రవారం సాయంకాలం ఎవరికీ మరుపురానిది. అప్పుడే ఆయన ఒక ఉన్మాదియొక్క ఆగ్రహానికి బలి అయినాడు. మహాపురుషు లెన్నటికీ చావరనీ, వారి శక్తి చిరంజీవిగా నిలిచి ఉంటుందనీ మనం సంతృప్తిపడాలి. శాంతి అహింసల సందేశాన్ని గాంధీ మహాత్ముడు మన కందించాడు ఇదే అనాథ మానవ కోటికి నిశ్చలమైన ఆశాజ్యోతి మహాత్ముడు గొప్ప తిరుగుబాటుదారుగా జీవించాడు, చనిపోయి మానవజాతికి ధ్రువతార అయినాడు.

అనాథ ప్రజాకోటికి అంకితమైపోయిన మహాత్ముని జీవితం హంతకుడి బారి పడటం చూస్తే, 19 శతాబ్దాలక్రితం శిలువ వేయబడిన యేసుక్రీస్తు స్మరణకు వస్తాడు. క్రీస్తు ఎవరికొరకైతే తన జీవితాన్ని అంకితం చేశాడో వాళ్ళే ఆయనను వధించారు. ఏసుక్రీస్తులాగే మహాత్ముడుకూడా తనను అంతం చేసినవారిని జయించాడు; ఆయనసిద్ధాంతం నెగ్గింది.

19 శతాబ్దం తాలూకు 7,8 దశాబ్దులలో ప్రాక్పశ్చిమాలు రెంటిలోనూ చైతన్యం హెచ్చింది. ఈ కాలంలో జపానులో జాగృతి కలిగింది. భరతఖండంలో జాతీయ ప్రజాస్వామ్య శక్తులు తల ఎత్తాయి. దాదాభాయి నౌరోజ్, సర్ ఎస్. ఎన్. బెనర్జీ, సర్ ఫిరోజ్ షా మెహతా, డబ్ల్యు సి. బెనర్జీ మొదలైన పురోగాములు జాతీయ ఆత్మగౌరవాన్ని పెంపొందించటానికి పాటుపడ్డారు. పరి పక్వమైన రాజకీయ వాతావరణంలో భారత జాతీయ కాంగ్రెసు ఉద్భవించింది. రాజకీయాంధకారాన్ని అరుణోదయం పారదోలుతున్న ఈ సమయంలో 1869 అక్టోబరు 2న అవతరించిన గాంధీమహాత్ముడు భారతజాతీయోద్యమ మహా ప్రవక్త కావటమే గాక, ఆధునిక ప్రపంచంలో సత్యాహింసలకు అద్వితీయ ప్రచారకుడుకూడా అయినాడు.



గాంధీమహాత్ముని జన్మదినోత్సవసందర్భంలో భారతప్రభుత్వ తపాలాశాఖవారు ప్రచురించిన పోస్టుకార్డులలో ఇదొకటి. ఈ కార్డులు అక్టోబరు 2 వ తేదీనుంచి విక్రయించబడతాయి.

ఆయన తలిదండ్రు లిద్దరిలోనూ గల ఉత్తమ లక్షణాలు మహాత్మునిలో పరాకాష్ఠ అందుకున్నాయి. మహాత్ముడు తన జీవితంలోనూ, రాజకీయాలలోనూ ప్రకటించిన అమలినత్వమూ, చిత్తశుద్ధీ ఆయనకు ఉగ్గుబాలతో వచ్చినవిగా కనిపిస్తాయి. సత్యం ముందుపుట్టి ఆయన పుట్టాడనవచ్చు. చంపరాన్, ఖైరాలలో కిసాన్ తిరుగుబాటు సాగించటంలో నేమి, సహాయ నిరాకరణ శాసనోల్లంఘనోద్యమాలు నడపటంలో నేమి, దండీ సత్యాగ్రహంలో నేమి, ఇర్విన్ ఒడంబడిక విషయంలో నేమి, రాజకోటలోనూ బొంబాయిలోనూ నిరశన సాగించటంలో నేమి, కాబినెట్ మిషన్


వ్యవహారంలో నేమి, నవఖలీ సంచారంలో నేమి, తన ఆఖరు నిరాహారదీక్షలో నేమి మహాత్ముడు సత్యాన్నీ, నైతికాదర్శాన్నీ ఎదట ఉంచుకున్నాడు. ఈ ఆదర్శమే ఆయన కృషికంతకూ మూలకారణమయింది. ద్రష్టగా, రాజకీయవాదిగా, తపస్విగా, సంస్కర్తగా, తిరుగుబాటుదారుగా ఏ సత్యాన్ని అవలంబించాడో ఆ సత్యమే మానవజీవితానికీ, చరిత్రకూ కూడా చరితార్థత చేకూర్చగలదు.

ఒక కేసువిచారణకు గాను దక్షిణాఫ్రికాకు వెళ్ళవలసిరావటంతో గాంధీజీ జీవితంలో పెద్ద పరివర్తన కలిగి, అంతదాకా విజయం ఎరగని ప్లీడరుగా ఉంటున్నవాడు కాస్తా, రాజకీయ నాయకుడుగానూ, మానవజాతికి మార్గదర్శిగానూ అఖండ విజయం సంపాదించాడు. టాల్‌స్టాయి కూడా యుద్ధంలో పాల్గొని యుద్ధంలోని మారణఘోరాన్ని చూసి పెద్ద పరివర్తనకలిగి సైనికాధికారి పదవి వదలి ప్రవక్తగా మారి ప్రేమాహింసల ప్రచారం చేశాడు. గాంధీజీ, తాను డర్బాన్‌లో ఉన్న కొద్దికాలంలోనే అక్కడి భారతీయుల దుస్థితినీ, అక్కడి తెల్లవారు భారతీయులపట్ల చూపుతున్న అక్రమాన్నీ స్వయంగా చూశాడు. నేటాల్‌లో కూలీలుగా పనిచెయ్యటానికి వెళ్ళి అయిదేళ్ల కంట్రాక్టులు వ్రాసిన భారతీయులు జాతి విద్వేషాలకు గురికావటం ఆయనకు కనిపించింది. అక్కడి తెల్లవారు గాంధీని కూడా "కూలీ బారిష్టరు" అని నామకరణం చేశారు. జాతీయాహంకారమూ, నిర్దాక్షిణ్యమైన ప్రజాపీడనా చూసి గాంధీజీ విప్లవోద్వేగానికి గురిఅయి పీడిత మానవజాతిని ఉద్ధరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

మహాత్మగాంధి 1915 లో తిరిగివచ్చేనాటికి ఆయనకు బాధలు భరించటంలోనూ, త్యాగాలు చెయ్యటంలోనూ, సత్యాన్వేషణలోనూ చాలా అనుభవం కలిగింది. ప్రపంచంలో పెచ్చుపెరిగిన అవినీతినీ, అన్యాయాన్నీ, ద్వేషాన్నీ, హింసనూ ఎదుర్కొనటంలో ప్రపంచనాయకత్వం వహించే అనుభూతి ఆయనకు దక్షిణాఫ్రికా సంఘర్షణలో లభించింది. ఆదారుణాగ్నిలో ఆయన కాకలు తేరాడు. ఆయన తిరిగి వచ్చేనాటికి భారతీయులు నిరాశా నిస్పృహలకు గురిఅయి ఉన్నారు. అట్టి భారతీయులను చైతన్యవంతులనుచేసి ఆయన సహా అహింసాయుత సహాయనిరాకరణ, శాసనోల్లంఘనోద్యమాలకు ఉద్యుక్తులను చేశాడు. దేశానికి ఆయన చేసిన హెచ్చరిక ఏమంటే, "ఆజ్ఞలను పాలించడం అన్యాయానికి తల ఒగ్గటమైనప్పుడు ఆజ్ఞలను ధిక్కరించండి", అని. ఇది ఎలా ఆచరించాలో చంపరాన్ సత్యాగ్రహంద్వారా ఆయన స్వయంగా చూపించాడు. ధైర్యంగా సత్యాన్ని అవలంబించటంలోనూ, అనతిక్రమణీయములైన మానవహక్కుల కొరకు అహింసాయుతంగా పోరాడటంలోనూ ఈ సత్యాగ్రహం భావిసత్యాగ్రహాలకు నమూనా అయింది. దేశానికి ఒక్కసారిగా చైతన్యం వచ్చింది. ఈయనే తమ ఏకైక నాయకుడని ప్రజాకోటి గుర్తించింది. ఘోరదాస్యంలో ఉండి, ఆయుధబలంగాని, ఆత్మజ్ఞానంగానీ లేక ఉన్న దేశంలో ఒక నూతనోత్సాహం ప్రబలి, ఆత్మజ్ఞానం మొలకెత్తి, నూతన జీవం కలిగింది. ప్రజలు తమ స్వాతంత్ర్యాన్ని అడిగే శక్తిని తెచ్చుకుని, రాజకీయ విప్లవానికి ముందు రావలసిన భావవిప్లవానికి గురిఅయి, అజేయమైన బ్రిటిషు మిలిటరీ శక్తులను అహింసాయుత సహాయనిరాకరణోద్యమంతో ప్రతిఘటించారు. ప్రజలలో భావవిప్లవం కలిగితే వారు అపజయాలను లక్ష్యపెట్టరనీ, రాటుతేలుతారనీ గాంధీజీ అభిప్రాయం.

అహింస గొప్ప రాజకీయాస్త్రమని గాంధీజీ ప్రబోధించాడు. ప్రపంచంలో కల్లా గొపదైన బ్రిటిషు సామ్రాజ్యవాదంపైన జాతీయాస్త్రంగా దానిని ఆయన ప్రయోగించాడు. ఆయన యుద్ధవ్యతిరేకులలో చైతన్యవాది. యుద్ధానికి సత్యాగ్రహం సరిఅయిన ప్రత్యామ్నాయమని ఆయన కనిపెట్టాడు. భారతదేశాన్ని కుంగదీస్తున్న సామ్రాజ్యవాదాన్ని పడగొట్టటానికాయన సాగించిన ఉద్యమంలో ద్వేషానికిగాని, వైషమ్యానికిగాని, హింసకుగాని తావు లేదు. ప్రతిపక్షులలో హృదయపరివర్తన తీసుకురాగలందులకై స్వాతంత్ర్య యోధులు అహింసాయుత సహాయనిరాకరణం సాగించి, ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనాలని ఆయన ప్రబోధించాడు. ఇతరులపై ఒత్తిడి తీసుకురావటంలో ఆయనకు విశ్వాసం లేదు. మానవులంతా ఒకటేనన్నవాదమూ, ప్రేమతో జయించటమే సరి అయిన మార్గం కనక అది సత్ఫలితాలిస్తుందన్న సిద్ధాంతమూ ఆయన సత్యాగ్రహ తంత్రంలో అంతర్గర్భితమైఉన్నాయి. ఆయన నాయకత్వంకింద భారతీయులు ఘనవిజయాలు సాధించి ప్రపంచం దృష్టిలో పేరుగాంచటానికి సందేహం లేదు. ఆయన నాయకత్వంకింద భారత స్వాతంత్ర్య యోధులు రక్తపాతం లేకుండా పనిచేయగలిగారు. ఆయన భారత స్వాతంత్ర్యాన్ని రక్తరహిత విప్లవంద్వారా సాధించాడు. ఆయన తన 70 వ ఏట, భారతీయుల ప్రగాఢ స్వాతంత్ర్యవాంఛను ప్రతిబింబించే "క్విట్ ఇండియా" నినాదంతో హృదయాలను సంచలింపజేయటం పాశ్చాత్యులను దిగ్భ్రమగొల్పింది. ఆయన నిజమైన విప్లవవాది. సర్వమానవ సౌభ్రాతృత్వమూ, సర్వమానవ శ్రేయస్సూ ఆకాంక్షించినవాడు కనక సత్యప్రేమల మార్గాన్ని ప్రబోధించాడు.

సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించటానికి స్వాతంత్ర్యోద్యమాలు నడుపుతూనే ఆయన ప్రజలకు స్వపరిపాలనాశక్తి కలిగేటందుకు నిర్మాణ కార్యక్రమాలుకూడా నడిపాడు. నిర్మూలనంకంటె నిర్మాణం ఎక్కువైనది. విప్లవానికి అది ప్రాణంవంటిది. దేశపునర్నిర్మాణ కార్యక్రమమే ఆయన నిర్మాణ కార్యక్రమం. అందులోని చరఖా, ఖాదీ, జాతిసామరస్యమూ, ప్రాథమికవిద్యా, అస్పృశ్యతానిర్మూలన, వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థా, రాజకీయాధికారాలు మొదలైనవి స్వాతంత్ర్యయోధులకు ప్రజాస్వామ్య సూత్రాలు బోధించటానికీ, సంస్కృతి కలిగించటానికీ ఉద్దేశించినవి. నిర్మాణ కార్యక్రమంద్వారా స్వాతంత్ర్య



ఇది మరొకరకం పోస్టుకార్డు

సమరాన్ని మారుమూల పల్లెటూళ్లకు తీసుకుపోవాలని గాంధీజీ ఉద్దేశం. స్వాతంత్ర్య సమరం ముగియగానే కాంగ్రెసుయుద్ధం నుంచి నిర్మాణానికి మారాలి. స్వాతంత్ర్య యోధులు చేతులుకట్టుకు కూర్చోరాదు. స్వాతంత్ర్యాన్ని యోగ్యమైనదిగా చేసే కృషి సాగించటానికి, ప్రజలలో ఉత్తేజం కలిగినవారుకూడా కార్యరంగంలోకి దిగటానికి గాంధీజీ నిర్మాణకార్యక్రమం రాజకీయంగా నిర్దేశించబడింది. ఆర్థికంగా, సాంఘికంగా చూసినట్టయితే, బూజుపట్టి ఉన్న గ్రామాలకు తిరిగి ప్రాణంపోసి, గ్రామీణ ఆర్థికవ్యవస్థనూ, చిన్న పరిశ్రమలనూ, పునరుద్ధరించి, ప్రజలమధ్య స్నేహసౌభ్రాత్రతలు పెంపొందించటానికి అది నిర్దేశించబడింది.

మార్క్సిస్టుల్లాగా గాంధీజీచరిత్ర వైరుధ్యాలతోనూ, సంఘర్షణలతోనూ, ముందుకుపోతుందని విశ్వసించలేదు. ఉదారమైన ఆదర్శాలున్నట్టయితే సంఘర్షణలకు అవకాశం లేదు. సహకారమూ, ప్రేమా, సమాధానమూ, ఇవే పురోభివృద్ధికి తోడ్పడతాయని ఆయన దృఢవిశ్వాసం. పురోభివృద్ధి నిలిచిపోకుండా ఉండగలందులకు ఎప్పుడైనా సంఘర్షణ అవసరమే గాని, అధికారకాముకులు స్వలాభాపేక్షతో సాగించి, ప్రపంచాన్ని రక్తపాతంలో ముంచే సంఘర్షణలను ఆయన ఆమోదించలేదు. హింసాయుతమైన అపవిత్ర సాధనల ద్వారా పవిత్రమైన సాధ్యాలు కలగవని ఆయన నమ్మకం. మార్క్సిస్టుల వలె గాక ఆయన సాధ్యాలతోబాటు సాధనాలకూ సమాన ప్రాముఖ్యం ఇచ్చాడు. గొప్ప ఆశయాలు సాధించటానికి తుచ్ఛమైన సాధనాలు ఉపయోగించటం నైతికంగా సమర్థనీయమని ఆయన ఎన్నడూ ఒప్పుకోలేదు. "ఎటువంటి సాధనాలు ఉపయోగిస్తామో అటువంటి ఫలితాలే క్రియకు లభిస్తాయి. వస్తుతహా మన ఆశయాలు మంచివేఅయినా మనకు తీరా లభించే ఫలితాలు మన సాధనాలను బట్టే ఉంటాయి. "ప్రేమ, సహకార, సమాధానాలపైఆధారపడిన గాంధీజం, ఉత్పత్తిసాధనాల మార్పుతో సాంఘిక వ్యవస్థ మార్పుచెంది స్వర్ణయుగం ప్రారంభమవుతుందనే మార్క్సిస్టు భౌతికవాదాన్ని సవాలు చేస్తుంది. మానవులు మంత్రబద్ధులైన యంత్రాలవలె పని చేయలేరు. వారు జీవశక్తులను గురించి అజ్ఞానులుగా ఉన్నంతవరకూ దోపిడి అంతం కాదు, అవసర వస్తువుల కొరత తీరదు. వ్యక్తిస్వాతంత్ర్యమూ, వ్యక్తికృషీ సాధ్యమైనంత అధికంగా ఉండాలనీ, ప్రతివ్యక్తీ సమాజంలో సంపూర్ణ సభ్యుడై ఉండాలనీ, భారమైన పరిపాలనా యంత్రం ఉండరాదనీ, రాజకీయాధికారాలు కేంద్రీకృతమైతే కొద్దిమందిపరంగా ఉంటవి గనక, వికేంద్రీకృతంగా ఉండాలనీ గాంధీవాదం. ఇట్లా చెయ్యటంవల్ల అధికారం అదుపులో ఉండి, మానవులు పురోవృద్ధి చెంది, నిస్వార్థంగా సాటివారికి సేవ చేయగలుగుతారు. పునర్నిర్మాణం ఉపయుక్తంగా ఉండాలంటే వికేంద్రీకరణవిధానం తప్పనిసరి. అహింసాయుత ప్రతిఘటనద్వారా విలువలలో సూక్ష్మమైన మార్పులు కలుగుతాయి. దాని ప్రభావంచేత పెట్టుబడిదారీవాద అమలులో ఉండే విలువలు నశించి కింటి స్థానే కొత్త దృక్పథమూ, విలువలూ ఏర్పడతాయి. పెట్టుబడిదారీచిహ్నమైన డబ్బు కూడా సంస్కారం పొందుతుంది. దీనినే గాంధీజీ హృదయపరివర్తన అంటాడు, అని గ్రెగ్ తన "అహింసయొక్క శక్తి"లో వ్రాశాడు.

నేడు నాగరికత ప్రమాదస్థితిలో ఉన్నది. ప్రపంచం ద్వేషమూ, హింసా, భయమూ, సంకోచమూ కలిసిన అంధకారంలో మునిగి ఉన్నది. ఈ అంధకారంలో మిలమిలలాడే ఆశాకిరణాలేవంటే, మానవునిలోని దేవత్వం గురించి, ఆత్మయొక్క పరిణతిని గురించి, అపజయం ద్వారానే విజయం లభిస్తుందనీ, జీవశక్తి మృత్యువును జయిస్తుందనీ మహానీయులు చెప్పిన వాక్యాలే. మనం ఈనాడు అనుభవించే కష్టాలు పునర్జన్మకు ముందు తప్పనిసరిగా ఉండేవే. బ్రూనో, సోక్రటీస్, యేసు మొదలైనవారు తాము ఉద్ధరించదలచినవారి చేతులలోనే తమ ప్రాణాలు కోల్పోయినారు. కాని వారి ప్రవచనాలు కాలక్రమాన మరింత బలం చేకూర్చుకున్నాయి. వారి సంతతికే చెందిన మహాత్మాగాంధీ హింసకు బలి అయినాడు. ఈ త్యాగంద్వారా ఆయన ఉపదేశాలకు సార్థకత చేకూరుతుందనీ, ఆయన ఆశయాలు ఫలించి మానవజాతి అనాచారంనుండి,

ద్వేషభయాలనుండి రక్షింపబడుగాక అని ప్రార్థింతాం.

గాంధిజీ విముక్తమానవుడు, మానవవిమోచనం కోరాడు. మానవులకు సంప్రాప్తం కానున్న ఘోరవిపత్తును నివారించటానికి గాంధీజమును అమలుజరపాలి. దానిద్వారా వ్యక్తి విధ్వంసమూ, మనోవ్యాధులూ నివారణ అయి, నూతన సాంఘిక వ్యవస్థ నిర్మించటం సాధ్యమవుతుంది; మానవ ప్రాథమిక హక్కుల ఆధారంతో నవప్రపంచ నిర్మాణమూ, ప్రపంచ రాజ్యాల విమోచనమూ, దేశాల మధ్య సహకారమూ సాధ్యమవుతుంది. గాంధీజీ ఉపదేశాల ముందు ప్రపంచంలోని సంకుచితత్వమూ, అవినీతీ పటాపంచలైపోయి, మానవుల ఆత్మలు క్షాళితములై, వారు శమదమనాదులతో యేసులూ, బుద్ధులూ అవుతారు.

"మానవుల సమష్టిశక్తి మానవులను పైకి తీసుకుపోతుంది గాని కిందకు దించదని నా విశ్వాసం. ప్రేమయొక్క తత్వం అట్లా పని చేస్తుంది. విధ్వంసకశక్తులకన్న సంకర్షణశక్తులు ప్రబలమైనవి కనుకనే మానవజాతి దక్కింది. జీవితసూత్రం ప్రేమ కాని పక్షంలో మృత్యువు జయించి ఉండేది. ఈ సూత్రాన్ని గుర్తించి జీవితానికి అన్వయించటంలోనే మానవుడికీ పశువుకూ తేడా ఉన్నది," అని మహాత్ముడన్నమాటలు మనం మరవరాదు. (N.P.S.)

అనుభవమంటే మనకు జరిగేదికాదు, దానితో మనం చేసేది. —అల్డస్ హక్స్లీ.

*   *   *   *

ఏ గుర్రంకూడా, మనం దానిమీద పెట్టే డబ్బులాగా పోలేదు. —నేట్ కోలియర్.

*   *   *   *

దుకాణంవాళ్లు నష్టాని కమ్ముతున్న సరుకని తోచినదేదైనా ఆడవాళ్లుకొంటారు.

ఒకరికన్న ఇద్దరుపొదుపుగా జీవించవచ్చు. కాని కొందరు స్త్రీలు అంతపొదుపుగా జీవించటానికి ఇష్టపడరు.

ఉన్నడబ్బును రెట్టింపు చేసుకోవటానికి క్షేమమైన మార్గమేమిటంటే మడిచి జేబులో ఉంచుకోవటం.

భర్తల విషయంలో తప్పిస్తే ఆడవాళ్లు మంచి బేరగాళ్లే.
—ఏబ్ మార్టిన్.

ఒకటిగంటి

శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

టిఫిన్‌కి టైమయింది. షావుకారు నీలగిరి అప్పుడే నిద్రలేచి ఆవలించాడు. కళ్లు నుసుముకుంటూ గది నలువైపులా కలియజూశాడు. గడియారం మూడుకొట్టింది. కడుపులో పేగులు కళవళంగా కూతలు పెట్టినయ్. అవును మరి, పదిగంటలకు తిన్న కూడారయె, ఎంతసేపని కడుపులో కాపరం జేస్తుంది? అందులోనూ యీ వేసవికాలంలో అన్నంతిని. ఇట్టే నడుం వాల్చి లేచేసరికే నకనక లాడిపోతుంది ప్రాణం. ఎందుకనో యివ్వాళ మెలకువ రావడం ఆలస్యమయింది. బహుశా రాత్రి నిద్రలేకపోవడంవల్ల కలిగిన బడలికచేతనే కావొచ్చు.

పంకజాక్షి మువ్వలచిందు మహిమ అటువంటిది - మానవుడైనవాడెవడికీ అక్కణ్ణించి కదిలిరా బుద్ధి పుట్టదు.

ఒక్క రాత్రేమిటి?- ఎన్నియుగాలైనా ఊపిరి తీసుకోకుండా అలా నిశ్చేష్టుడై కూర్చుని పోవలసిందే. వెర్రి వెంగళాయిలు చెప్పే వేదాంతాలకీ, ఆనందరసానుభూతికీ యేమిటి సంబంధం?

నిజానికి షావుకారు పరమేశ్వరయ్య ఆనందం అనుభవించగల సమర్థుడు, 'నిబ్బరమైన గుండెకలవాడు 'రసికచక్రవర్తి.' అన్నా అతనియెడల అది వ్యర్థపదం కానేరదు.

అతడు చేసిన విందులకేమిగాని వీనుల విందులైన ఇలాటి సత్కాలక్షేపాలవల్లనే వచ్చిన వాళ్లంతా ఆనంద సాగరంలో తేలి తెప్పకట్టలై కొట్టుకుపోయారు. అతడు లక్షరూపాయలు ఖర్చుపెట్టి చేసిన పెళ్లంతా వొకయెత్తు, రాత్రి ఏర్పాటు గావించిన పంకజాక్షి నృత్యం వొకయెత్తూను- ఇప్పటికీ కళ్లల్లో మెదులుతున్నట్టున్నది.

తస్సాదియ్యా, అదెంత పుండాకోరను కున్నావ్! మరొక్క రోజైనా యీవూళ్లో, వుండమంటె, తెల్లారకట్ట రైలుకే టలాయించేసింది. కానీలే, సమయం దొరక్కపోతుందిటా. ఇల్లు తయారైం తరువాత గృహప్రవేశానికి పిలిపించి, దానిసంగ తేమిటో కనుక్కోలేక పోతేకదా!

కిటికీలోనించి బయటకు చూశాడు నీలగిరి. కూలీలంతా పనిపాటల్లో నిమగ్నులై వున్నారు. సున్నంబొచ్చె నెత్తినెట్టుకుని, నిచ్చెనమీంచి పైకెగబ్రాకుతోంది ఒక వడ్డెస్త్రీ. ఇప్పుడు నీలగిరికి మనసు మనసులో లేదు. ఎవర్ని చూడబోయినా పంకజాక్షిలాగే ప్రాణాలు తొరికేస్తున్నారు. శ్రమశక్తివల్ల బలిష్ఠమై కండలు తిరిగిన, ఆమె శరీరపు వంపుల్లోనించి అవ్యాజమైన లావణ్యరేఖలు లలిత లలితంగా, నీసల్లా తారట్లాడుతున్నట్టున్నయి. నీలగిరి నిశ్చేష్టుడై పోయాడు. ఇప్పుడు అతని మెదడులో చిందులు త్రొక్కుతున్నది పంకజాక్షి. బాహ్యప్రకృతిని మరొకలా లక్షించలేకపోతున్నాడు.

"ఈమేడ ఎప్పుడు తయారౌతుందా?" అనే తహతహవల్ల గుండెలు కొట్టుకున్నయ్. పని అంతా మందకొడిగా జరుగుతున్నట్టు తోచిందతనికి. కూలీలసంఖ్య ఎక్కువ చేయించాలనీ, పగలనక, రాత్రనక నిర్విరామంగా పనిచేయించి వచ్చే వారంనాటికి గృహప్రవేశమై పంకజాక్షి నృత్యం యేర్పాటు చేయించాలని- ఇలాటివన్నీ ఒక్కక్షణంలో నిశ్చయం చేసుకున్నాడు నీలగిరి. కాఫీ అయిం తరువాత ఎవరిపని వారికి పురమాయించాలనుకున్నాడు. చివాల్న లేచివచ్చి సావిట్లో వున్న కుర్చీలో మేను వాల్చాడు.

ఫలహారం పూర్తయింది. కాఫీ నాలుగు గుక్కలు చప్పరించాడు. వేడివేడి వార్తలతో అప్పుడే పోస్టులో వచ్చిన పత్రిక తెరిచాడు చూదామని. అందులో అతడికొక పిడుగులాటి వార్త కనబడింది. అదిరిపడ్డాడు.

కాఫీ గ్లాసుబల్లమీద పెట్టి మరొకమారు చదువుకున్నాడు. తాను మొదట చదివింది యధార్థమే అయింది.

ఎంత విపరీతం! ఆరి పిళ్ళయిళ్లు వల్లకాళ్లుగానూ! ఈ గవర్నమెంటోళ్లకి ఏం పోయేకాల మొచ్చిందంట? అద్దమైన వాళ్లనీ దగ్గిర చేర్చడం, వాళ్లకో కితాబు తగిలించడమూను. లేకపోతే యేముంది చెప్పు?

"ఇదుగో చూడు, పద్దిగాడుటా, సి. ఐ. డి. ఇన్‌స్పెక్టరయాట్ట. ఎక్కడో ఎవరో దొంగతనంగా బియ్యండాచేస్తే పట్టుకున్నాట్ట! నడమంత్రం ముండావాళ్లూ నడమంత్రం వుద్యోగాలూను" అన్నాడు ఆయన అర్ధాంగి మనోరమతో-

ఆమె తలుపున చేరగిలబడి తదేక దీక్షతో యేదో ఆలోచిస్తున్నట్టున్నది. తన మాట వినిపించుకున్నదో, లేదో- నీలగిరి తిరిగి ఇలా అన్నాడు. "ఎందుకూ కొఅగాని వెధవ-నలుగురూ పోగై యిక్కణ్ణించి వెళ్లగొడితే దేశాంతరం లేచిపోయిన చచ్చుపినుగ సన్నాసికి గవర్నమెంటులో సి. ఐ. డి. ఉద్యోగంట! ఏముంది? నడిచేవాడూ నడిపించేవాడూ యిద్దరూ గుడ్డివాళ్లయినప్పుడు?" 'ఏమంటావ్' అన్నట్టు ఆమెవంక మరింత తీక్ష్ణంగా పరకాయించి చూశాడు.

ఆవిడ మౌనవ్రతానికి భంగమూ కలుగలేదు, ఈవార్త విన్నప్పుడు నీలగిరిలో కలిగిన సంచలనంలాటి దేదీ ఉదయించనూ లేదు ఆమెలో. ఈ విషయమై నీలగిరికే యెక్కువగా సంబంధం వుండడంవల్ల అతడు ఉలిక్కిపడ్డాడన్నా అర్థం వుంది కానీ, మధ్య ఆమె కెందుకూ లేనిపోని రభస?- అందుకే తన ఆలోచనలనించి మనసు మళ్లించుకో ప్రయత్నించలేదు మనోరమ. పూర్వంకంటె మరింత ఘాఢైన పదజాలంకోసం వెతుక్కుంటున్నట్లున్నది.

కాఫీ తాగడం పూర్తయింది గ్లాసు బల్లమీద పెట్టి పాగోలు పుగాకు పాయలు తీసి బుజాన వేసుకుంటూ పేపరు చదవడంలోనే నిమగ్నుడైనాడు నీలగిరి. కాఫీతో వగరెక్కిన అతని జిహ్వకు, ఘాఢైన చుట్టపొగ పుక్కిట పట్టేవరకూ శాంతి లభించే అవకాశం దొరికేట్టు కనబడ్డంలేదు. ఒకవంక ఈ వార్తలన్నీ చదువుతున్నకొద్దీ మరింత చిరాకు పుట్టుకొస్తోంది. వీటన్నిటి మధ్యా గజిబిజిఐ నలిగిపోతున్నాడు నీలగిరి-

మనోరమ-ఎంత సున్నితమైన పేరు? నాగరికత ఉట్టిపడుతోంది. అందుకు తగిన సౌశీల్యాది గుణాలు, వానికి సరిపడ్డ

అందం, అభిమానం-అన్నీ ఆమెలో గూడు కట్టుకు వున్నయ్యనుకుంటారు అంతాను. 'ఆమెది విచిత్రమైన ప్రకృతి' అని కూడా అంటూ వుంటారు. ఆమెకళ్లు ఎప్పుడూ యేదో అన్వేషిస్తూ ఆదుర్దాగా యెదురు తెన్నులు చూస్తున్నట్టుంటయ్. అట్టే హఠాత్తుగా చూసినవాళ్లు విభ్రాంతులై పోవలసిందే. అది ఆమె సహజగుణాల్లో వొకటని సమయం సందర్భం తెలిసినవాళ్ళనుకుంటారు. ఈవిషయమై ఒక్కొక్కప్పుడు నీలగిరికూడా పప్పులోకాలు వెయ్యడం కద్దు. ఆమెను సాకల్యంగా సైకలాజికల్‌గా, అర్థం జేసుకున్నానని ఏమేమో యిష్టం వచ్చినట్టు వాగేస్తూ వుంటాడు.

ఇంతకీ ఆమె తిరిగి సమాధానం చెప్పలేదు. కనుక లంక పొగాకు లబ్బు ఎంత వరకున్నదో కనుక్కొగలుగుతున్నాడు, తద్వారాయింద్రియతృప్తి లభిస్తున్నదతనికి. కాని పేపర్ వంక చూస్తేమటుకు వెర్రిచిరాకెత్తుకొస్తోంది.

ఇలాటి తరుణంలో వినోద కాలక్షేపం లాటిదేదైనా దానంతటది ఏర్పాటైపోతే అతడు ఇవ్వన్నీ చిటికెలో మర్చిపోగలడు. అమితానందం అనుభవించగలడు. అందుకోసమే అతని అంతస్సు అతి పిపాసతో దిక్కులు వెతుక్కునే లేడిపిల్లలాగ లక్ష్యం తెలియకుండా యిటూ - అటూ పరుగెత్తుతోంది.

మనోరమ అక్కణ్ణించి కదిలి ఖాళీ అయిన కాఫీ గ్లాసు తీసుకుని చరాల్న లోపలకు వెళిపోయింది.

అయినా నీలగిరి మనసుకు నిబ్బరం లేదు. జుంజారకట్టలా కొలవలసిన చుట్ట కొడికడుతోంది ఎందుకనో...

మరోకసారి అగ్గిపుల్లగీసి వెలిగించాడు. మొహం ఊర్ధ్వంగా తిప్పి పొగపీల్చి వదులుతున్నాడు.

ఆ విడ తాచు పాములా మరెప్పుడు బుస్సున బయటకు వస్తుందోనని అనుకున్నప్పుడల్లా గుండెలవేగం హెచ్చుతూంది. ఆ ముభావంలోనే అనంతమైన హాలాహలం కరుడుగట్టి కరగడానికి సిద్ధంగా వున్నదని నీలగిరికి తెలిసినంతగా తదితరులకు ఏం తెలుస్తుంది మరి?

ఎందుకనో పొద్దుణ్ణించీ యిదే వరస- అన్ని పనులూ అదను కనిపెట్టి చేసుకుపోతుందిగానీ, పెదవి విప్పి మాటాడదు. తనకుతానై పలకరిస్తే అభిమానమెంత-మళ్లీ?

అసలు రాత్రి పంకజాక్షి నృత్యానికి ఆమెనుకూడా తీసుకుపోవడంతోనే కొంప మీదికి తిప్పలు వచ్చిపడింది. తన మానాన తనువెళ్లి కిక్కురుమనకుండా తిరిగివస్తేయీ మాటి బిగింపులూ మెటికల చిటపటలూ వుండేవి కావేమో...

అయినా అది తనకు మర్యాదా? షావుకారు పరమేశ్వరయ్య స్వయంగా వచ్చి ఆహ్వానించినప్పుడు ఒంటిమల్లే తనొక్కడూ వెడితేమటుకు అదేమంత బాగుంటుంది? "రేపు తన గృహ ప్రవేశానికి వాళ్లందరూ రావద్దూ? పంకజాక్షి నృత్యం చూసి తమ ఆనందంలో పాలుపంచుకోవద్దూ" అనుకున్నాడేగాని, మరి యీ గుగ్గిలం యిలా పొగరాజుతుందని తనకేం తెలుసు?

తను ముందు వరసలో కూర్చోవడమే తప్పైందట. ఆనందంతో అందరితో పాటు నవ్వుతూ వేలుతో యిష్టం వచ్చినట్టు కేరింతాలు కొట్టడం అంతకంటే మహాపరాధం! అంతా అయింతరవాత సంతోషం పట్టలేక పంకజాక్షికి పది వరహాలిచ్చి రావడం- ఇదంతా క్షమార్హం కాని నేరం-

వట్టి బలహీనత, కుర్రతనం కాకపోతే మరేమిటి? ఎవరి ఖర్మం వాళ్లది - దానికి తనేం జేస్తాడు?

ఈ గందరగోళంలో అసలు తను అనుకున్న సంగతి మర్చిపోతున్నాడు. 'అందరికీ అన్ని పనులూ బదలాయించి దానిసంగతేదో త్వరగా ఆలోచించటం అన్నిటికన్నా ముఖ్యం.

అందుకనే-తొందరగా అవతలకు పడిపోయే తలంపుతోనే-నీలగిరి నిమిషాలు లెక్కపెట్టుకుంటూ పేపరు పేజీలు తిప్పేస్తున్నాడు.

అంతరంగంలో యెంత ఆదుర్దావున్నా అంతకంటే పెనవేసుకు పోయిన కొన్ని బలహీనతలవలన అనుకున్నది అనుకున్నట్టు నెరవేర్చుకోలేరు. అలాటి అవాంతరమే నీలగిరికీ వచ్చి పడిందిప్పుడు-

"హరిహరీ నారాయో... దేవ నారాయో

కరుణించి మమ్మేలు...కమలా లోచనుడా!...వీధిగుమ్మంలో నిల్చుని అదే పనిగా బొబ్బలు పెడుతున్నాడెవడో ముష్టివాడు. కళ్లు సరిగా కనుపించవు కాబోలున్న లేకపోతే అపస్మారంతెల్ల కుర్రవాడి ఆసరా అతడికెందుకూ? వాడు కర్రపుచ్చుకు తీసుకువస్తుంటే అడుగడుక్కూ తడుముకుంటూ అగాధంలోకి దించుకుపోతున్నట్టుగా ముందుకు నడిచి వస్తున్నాడు. ఎవడో పాపం! గుడ్డితనం పూర్తిగా



అతడి నేత్రాలను ఆక్రమించక పోయినా కనుపాపలు తెల్లగా వుండడంవల్ల పొరలు కమ్మినా వుండవచ్చు. కారణం ఏదైతే నేం—అతడీ ప్రపంచం చూడలేదు.

గుండెలుదాటిన ఆ పొడుగాటిగెడ్డంలో బొరుసెక్కని వెంట్రుకేలేదు. ఎన్నడైనా సంస్కారమంటూ వుంటేగా? చీపురు పుడకల్లాగా నిక్కపొడిచుకుని నేల చూస్తున్నయ్.

గచ్చుపొదలాగా అత లేమిటి? దారే పోతూంటే చీదరించుకుని చీకాకు పడని వాళ్లేలేరు. ఎక్కణ్ణించో మాట వినబడుతోందన్న మాటేగానీ మొహమంతా మరుగు పడిపోయింది జీబులతో కప్పెట్టినట్టు.

అతడీ ప్రపంచంలో యెవర్ని ఉద్ధరిద్దామనో...ముష్టెత్తుకుని ఇంకా బ్రతికి బట్ట కట్టాలనుకోవడం...

"హారిహారీ నారాయో..." అరి పీడిల్లు వల్లకాడుగానూ, ఈ వోపికంతా యెక్కణ్ణించి వచ్చిందో...

ఈ కేకలతో నీలగిరికి నసాళం అంటుకుంది.

అసమర్థతా, ఆవేశం రెండూ యేకమైనప్పుడు మనిషిలో బలహీనత తారస్థాయి అందుకుంటుంది. తత్ఫలితంగా కోపంలో కాలయముణ్ణి తలదన్నినా తన్నవచ్చు. ఇక్కడ అసంభావ్యమనేదే లేదు. ●

తలెత్తి చూసేసరికి మనోరమ యథాపూర్వంగా అక్కడే నిల్చునివుంది. వన్నుఝుల్లు మన్నట్టయింది నీలగిరికి. ఆ ఆవేశమంతా వెళ్లగక్కితే ఏమౌతుందో పూర్వాపరాలు తరచి తెలుసుకున్నవాడు కనుక కొంతవరకూ తమాయించుకున్నాడు. అయినా బింకం వదలగూడదనుకుని మనోరమతో యిలా అన్నాడు.

"ఏమిటీ పొడుసోదంతా! వాణ్ణి అవతలికి తగలబడమని చెప్పు" అని మధ్య ఒకరు చెప్పే అవసరం లేకుండానే ఆ మాట బిచ్చగాడికి వినబడింది. వాడూ గొంతు హెచ్చించాడు. ఇక్కడ నిలబడితే లాభం లేదనుకుని తడుముకుంటూ గడపలు ఎక్కి గుమ్మంలోపల అడుగు పెట్టాడు.

ఇంక మనోరమ మాటాడేందుకే ప్రయత్నిస్తున్నదని కదులుతున్న ఆమె పెదవుల సాక్షిగా గ్రహించాడు నీలగిరి.

ఎందుకైనా మంచిది, ముష్టివాడిమీదనే విరుచుకు పడడం మేలనిపించిందతడికి. ఈ దాడిలో యెదటివ్యక్తిని కూడకట్టుకుని ఏకముఖంగా విజృంభించే హంగామాచేసి చూస్తే ఆమెకూ కొంత శాంతి లభించవచ్చు ననిపించింది—

"గడపదాటి ఇంట్లోకి పడొస్తున్నాడు పందివెధవ. బయటికి తగిలెయ్యి," అన్నాడు. "పోరా! ఫో!!" అని అరుస్తూ కొడారి పోయిన చుట్టపీక వాడివైపుకే విసిరి కొట్టాడు. అది వెళ్లి వాడికాళ్ళముందర పడి నుసి రాలిపోయింది.

వాడింత మాత్రాన వెనక్కి తగ్గేఘటం కాదల్లేవుంది. చూసీ చూడనట్టు దానొక్క కాలితో నేలరాచేస్తూ కర్రకుంకని ఆసరా జేసుకుని ముందుకు అడుగులు వేస్తున్నాడు.

తన మాట, చేష్ట—రెండూ కూడా వృథా అయిపోయేసరికి నీలగిరికి గంగ వెర్రులెత్తుకొచ్చింది. మొదటిమాటనే పునశ్చరణజేస్తూ మరింత బిగ్గరగా గర్జించాడు యీసారి. డాబా ప్రతిధ్వనించింది. ముష్టివాడు మెల్లమెల్లగా ముందుకు సాగుతూనే వున్నాడు. ఈ తడవ అతడి రోషవీక్షణం మనోరమవైపు మళ్లింది. "వాణ్ణి అవతలకు తగిలెయ్యి!" అన్నాడు. మొదటంత ఊతంగానూ అతనినోట వెలువడిందీమాట. మనోరమ మానానికి భంగం కలుగబోతూవుంది. అతడి వంక చూసింది. ఆమె అంతస్సు తనవైపుకే మళ్లిందనుకున్నాడు నీలగిరి. ఉన్న శక్తినంతా వినియోగించి ఆ మాటనే గర్జించాడు.

"పంకజాక్షిని తల్చుకుని పది కాయితాలు వాడి మొహాన పారెయ్యరాదూ? ముందు వరసలో కూర్చున్న మొనగాళ్లుగా!"

"ఏమిటి వాగుడం తాను వాణ్ణి బయటికొట్టెయ్యమంటేను?"

"నేనూ ఆ సంగతే ఆలోచిస్తున్నా. మీరలా హతలాకుతల మైపోతారెందుకా" అని. ఏమిటీమొండి సమాధానాలు? ఇవన్నీ వింటుంటే ఆమె చదువుకున్న వ్యక్తికాదని ఎవరనుకుంటారు?—

"నే చెప్పేది వినబడుతోందా అసలు?" పురుషకారం ప్రయోగించిచూశాడు నీలగిరి.

"ఏమో...ఆ సంగతి నాకేం తెలుస్తుంది ఆ ముష్టివాణ్ణే అడగండి?" నీలగిరి అంతటివాడు కూడా మూడోవ్యక్తి యెదటనే ఇలాటి సమాధానాలు వినవలసివచ్చింది!

"ముష్టివెధవని కాదు నేనడిగేది. నిన్నే"

"నన్నా?...అడుగుతున్నారా?... మరోసారి చిత్తగించండి?"

"నే చెప్పేది వినబడుతుందా, లేదా? అని?"

"నాకూ సందేహంగానే వుందండీ. మీకు కనబడేది పంకజాక్షా, నేనా? అని." ఎగిరెయెగిరే బంతికి ఈతముల్లు దిగినట్టయింది నీలగిరి పని.

అలాగే తడుముకుంటూ అరుగుదాకా వచ్చేశాడు ముష్టివాడు. వీళ్ల వాగ్వాదం యింతటితో వోకొలిక్కి వచ్చే సూచనయేదీ కనబట్టం లేదు. ఇటువంటి క్లిష్టపరిస్థితిలోనే తన స్థానమేమిటో నిర్ణయం చేసుకోవాలనుకున్నాడు. అందుకు సాధనాంతరం ఆలోచించుకునే వున్నాడు కనుక చేత్తో తడుముకుంటూ అరుగుమీద వో మొత్తని కూచుని తన సహజధోరణిలోనే యిలా వుపక్రమించాడు.

"షావుకారుగారు ధర్మప్రభువు లండి. మీది చల్లనిచెయ్యి. కొల్లలుగా దానాలు చేస్తుందండి. మీ మనసు మల్లెపందిరండి!" పద్మాసనం వేసి తాపీగా నిశ్చింతగా కూర్చుండిపోయాడు.

నీలగిరికి ఇంతవరకూ ముష్టివాడిమీద వున్న కావేషమంతా మరొక వ్యక్తిమీదకు మళ్లింది. ఆమె ఎదట నిలబడివున్న మనోరమ.

పగ తీర్చుకునే పాములా బుసలు విడుస్తున్నాడు నీలగిరి. వాడవలసిన పదజాలమంతా సెమరుకొచ్చేవుంది. ఈ రేడు తరాల మధ్య యెవ్వర్నీ క్షమించి వదలివెయ్యవలసిన అవసరం అతడి కేమీ లేదు. ముందుగా అతగాడి వాగ్బాణాలకు గురి అయింది, మనోరమ తండ్రి, షావుకారు కొండయ్యగారు.

ఆయనది ఆ వూరే. అందులో పెద్ద మోతుబరు. ఇద్దరు కూతుళ్లు తప్ప ఆయనకు వేరే సంతానమూ లేదు. ఉన్న పొలం చెరి సగమూ వ్రాసియిచ్చేదేనని నీలగిరికి తెలుసు, ఆ సంగతి లోకానికీ తెలుసు. పైగా నీలగిరికి ఒక వేలు విడిచిన మేనమామ వరసకూడా అవుతాడు కొండయ్యగారు. ఏమైనా మామగారు కనుకఆయనవిషయంలో ఒంటికాలిమీద లేవడానికి ఎలాటి జంకూ గొంకూ అవసరం లేదు.

మనోరమ గొప్పింటి కోడలైనా వొక్కనాడు కూడా భర్తమీద ఆధారపడి వుండలేదు. ఎప్పుడు ఏది కావాలన్నా, కుంకం భరిణా కాటుకాయి దగ్గర్నుంచీ, పుట్టింటివారి నడిగే తెచ్చుకుంటుంది. ఆమె మటుకు ఆమె స్వతంత్రురాలనే చెప్పాలి.

ఒకళ్లను చూసి (భర్తను సైతం) ఒదిగి వొదిగి ఉండాల్సిన అవసరం ఆమెకు లేదు.

పెద్దక్కలాగే తనూ పుట్టింటిదగ్గర ఉండి పోవాలని ఎన్నో యెత్తులు వేసింది. కాని నీలగిరే అందుకు అభ్యంతరం చెప్పాడు. ఇంచుమించుగా ఆయనతో దీటైన వ్యక్తి ఇల్లరికంవున్నాడంటే మొన్నాడు తలెత్తుకు తిరిగే అవకాశం వుంటుందా? ఇష్టంవచ్చిన క్షణంలో ఆవిడ పుట్టినింటదగ్గరకు వెళ్లి వాలే పరతుమీదనే తీసుకొచ్చుకున్నాడు. ఇదంతా గత చరిత్ర- ఈ మధ్యనించే, అంటే ఆరునెల్లనించి మామగారి మాటంటే మండిపడిపోతున్నాడు నీలగిరి. దానికి కారణం యిది- కొండయ్యగారి ఆస్తిలో సగంవంతు తన భార్యపేర వ్రాయమని నీలగిరి పట్టుదల. తను పూర్తిగా అల్లుగడి గేసుకోలేదనీ, తనకు పుత్రోత్సవం జరిగే ఘడియ ఏనాటికైనా దాపురించవచ్చువనీ, ఈ ఆస్తి విభాగం తన అనంతరం జరగవల సిన కార్యమేనని ఖండితంగా చెప్పివేశాడు కొండయ్యగారు. అప్పణ్ణించీ యీ కావేషం యిలా పెరిగి పెద్దదౌతూనే వున్నది. సమ యము వచ్చినప్పుడు ఝాడించెయ్యాలని పొంచి కూర్చున్న వాళ్లల్లో వొకడు నీలగిరి. అయినా అంతటి సాహసానికి అదను దొరక లేదు. అదెలా పరిణమిస్తుందోనని తటపటా యిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఆ తెంపు ఎలా కలిగిందో యెవ్వరికీ చెప్ప తరంకాదు.

ముష్టివాడు వల్లించే స్తుతిపాఠాలు ఎక్కు వయినయ్. నీలగిరిలో వున్న బలహీనత వా డెరగనిది కాదు. అతణ్ణి వశం చేసుకోగల ఆయుధం బయటపెట్టేశాడు.

ఏదైనా కాలక్షేపంలాటిది యేర్పాటు కావాలని యీవరకే అనుకునివున్న నీలగిరికి వాడి మాటలమీద గురి ఏర్పడింది. వాడి దీనావస్థను చూసేసరికీ వాడిమీద అనుకంప కూడా కలిగింది.

"సరేలే, వూరికే కేక పెట్టకు. అక్కడ పడి వుండు." అన్నాడు.

అదే తడవుగా ముష్టివాడు మరింత తార స్థాయి అందుకున్నాడు.

"చిత్తం. చిత్తం. దయ చేయించండి! పావుకారి భవిష్యత్తు అరచేతిగీతల్లో చూపిం చేస్తాను...అరే డింభకా! మంత్రదండం తియ్యరా! జమీందార్ల జాతకాలెన్నో జమాయించి చెప్పిందిరా యిది. పలక మనరా! పాటిదిబ్బల కాడ పోలేరమ్మని-" అతడి వాగ్ధోరణి ఇలా సాగిపోతూనే వున్నది. నీలగిరి యెంతవరకూ మాట్లాడి వది లాడే అక్కడే లంకించుకున్నాడు.

"ఏమంత కొంపమునిగిపోయిందా, మాట వినబడ కుండా?"

"అబ్బా...అవన్నీ మాకెందుకు లెండి? ఏవో నాలుగు మెతుకులు తిని ఈ పలాన బతకనియ్యండి!" మనోరమ నిండుకుండలా నిలబడి వున్నది.

"నాయనొకడు దొంగసారా బట్టీ పెట్టించి కైపెక్కి ఒళ్లు తెలియకుండా పడి వున్నాడు. నీకూ అదే పట్టుకున్నట్టుంది. కళ్లల్లో నిషాదిగుతుంది జాగ్రత్త." కుర్చీలో నించి ఉప్పెనగాలేచి ముష్టివాడి ముందుకు నడిచి వెడుతున్నాడు నీలగిరి. మనోరమ అతని వెంటనే వస్తోంది.

"ఎందుకు అనవసరంగా నోరు చేసుకుం టారు? మా నాయన్ను వేలెట్టి చూపగలి గిన పెద్దమనుషులు తగారం చేస్తున్నారో ఆలోచించుకోరేం? ధాన్యం కొట్లల్లో కంఠంలోతున గాదెలు తవ్వించి వడ్లు నింపి సిమెంటు చేయించారే! గవర్నమెంటు వాళ్లకి మీరిచ్చిన లెక్కలన్నీ యెంత నిజా యితీగా వున్నయ్? అవును మరి. కుక్క దాలిగుంటలో పడుకున్నంతసేపూ..."

"ఛీ నోరుముయ్యి! అసలు నీ జాతే అంత తిన్నయింటి వాసాలు లెక్క పెట్టు తుంది. నా సొంతవిషయాన్ని గురించి మాట్లా డొద్దని లక్షా తొంభైసార్లు చెప్పాను. ఈ సారి నోరెత్తావంటే..."

"తగ్గండి కాస్తా. ముష్టివెధవముందర ఎందుకింత ప్రతాపం? నాకు తెలియకుండా మీ సొంతవిషయాలేమున్నయ్యంట!"

"మళ్లీ నోరెత్తితే మర్యాద దక్కించుకో లేవు. ఏమనుకున్నావో..."

"నా మర్యాద సంగతి మీకే పట్టింది. అవును మరి మీరు సామాన్యులా? పద్మనాభం పోకిరీవెధవని ప్రచారం చేసి ఊళ్లోనించి వెళ్లగొట్టించేశారు. మా నాయన్ను వేలెట్టి చూపించొచ్చారు. మీరుచేసిన ఘనకా ర్యాలు ఒకటా, రెండా? వియ్యన్న ఇప్పటికీ అలో లక్షణాఅని అఘోరిస్తు న్నాడు గదా. ఇంకా యెందరో... దేనికి చెప్పతానివన్నీ? అమ్మ పుట్టిల్లు మేన మామ దగ్గరా దాచేది? మన లో మాట పద్మనాభం సంగతి నేపసా చనవగానే ఎందుకంత గాభర పడ్డారు? వాడెక్కడో యెవర్నో పెట్టుకుంటే మీ కెందుకింత ఖంగారు? గుమ్మడికాయ

(20-వ పేజీ చూడండి)

ఇది విన్నావా, తమ్ముడూ!

“తూలికాభూషణ్”

తమ్ముడూ! ఈ వేళ నా గుండెలో ముల్లు గుచ్చుకుందోయ్. ఇది తీసివేయడానికి వీలు లేదుకదా! “నీ కష్టాలవల్ల నీకు ఎక్కువ బాధ కలుగకుండా చేసుకోవాలంటే వాటిని గురించి ఎవరికీ చెప్పవ”ద్దని ఒకరన్నారు. నాలో అంతటి బలం లేదని నీకు తెలుసుకదా. ఎవరితోనైనా చెప్పుకుంటే ఈ కష్టం కొంత తీరుతుంది. ఈ బాధ కొంత శమిస్తుందని నా ఆశ. దీన్ని భ్రమకింద కట్టి నువ్వు నవ్వవని నాకు అనుభవంవల్ల తెలుసు. జీవితమంతా కష్టభూయిష్ఠమే అయిన నీకు నా బాధ అర్థం చేసుకునే శక్తి ఉంది. నిజానికి నీకొక్కడికే ఆశక్తి ఉంది. ఎంత కష్టమైనా సహించి ఇతరుల కష్టాలకు కూడా సానుభూతి చూపగలిగిన నీకు ఒక్కటి మాత్రం తెలియదు. నా బాధని నీ మీదతోసెయ్యడం నా కెంత కష్టం కలిగించగలదో నీకు అర్థం కాదు. నీవు అలాంటి పని నీ జీవితంలో చేయలేదు. అదే నాకు శరణ్యం. లేకపోతే ఇదంతా నీతో ఎలా చెప్పగలనోయ్ తమ్ముడూ!

ఇంతకీ నాకేం కష్టం కలిగిందో చెప్పకుండా ఈ సోది అంతా వెళ్ళబుచ్చుకుంటున్నానని నీకు విసుగు కలగడం లేదుకదా? దానికి నా తప్పేముంది చెప్పు. నేనెప్పుడు మాత్రం ఏ విషయం నీతో సూటిగా చెప్పాను? నిన్ను ఎన్నెన్ని చుట్టుదారుల వెంట త్రిప్పి నీకు దారి తెలియకుండా చేయడానికి ప్రయత్నించలేదు? ఆమాటకి ఎన్నెన్ని మాయలు చేయలేదు? నిజమే చెప్పుతున్నట్లు కూడా నటించి ఎన్ని అబద్ధాలు చెప్పలేదు? నిన్నెన్ని అన్యాయాలు చేయలేదు? వాటన్నిటికి నా మీద విసుక్కున్నావా? లేదు కదూ. పైగా నా కష్టాల్ను వినడానికి ఎప్పుడూ అలాగే నడుం కట్టుకుని సిద్ధంగా ఉన్నావు. సుఖమంటే ఏమిటో ఏనాడూ తెలియకపోయినా, నా సుఖాలు గురించి కూడా విని నాతోపాటు ఆనందించావు. నా నవ్వులు పంచుకుని నాతోపాటు నవ్వుకున్నావు. నేను పెట్టిన బాధలు ఎప్పటివప్పుడే మరిచిపోయి, నాతో స్నేహంగా ఉంటూవచ్చావు. కోపం కాని, విసుగుకాని, ద్వేషంగాని, అసూయకాని లేకుండా ఇంత విపరీతమైన సహనంతో ఎలా ఉండగలుగుతున్నావు తమ్ముడూ? నువ్వు ఎంత కాలమై పుట్టావోయ్? అది నీకు తెలియదుకదూ? ఒక వేళ నాకు తెలిసినా నీకు చెప్పనని నన్ను అడగవు. అంతేకదూ? అయినా అంతటి స్వల్ప విషయం కూడా నీకు తెలియకుండా ఉందంటే ఆశ్చర్యం ఏముందిలే? నీకు తెలియడానికి అవకాశం మాత్రం ఏముంది? తెలుసుకోవాలనే కోరికకూడా నీకు లేకపోయింది. నీవు ప్రతివిషయంలోనూ అంటే నిర్లిప్తంగా, ఉన్నదానిని సహించి, దానితో సరిపెట్టుకొని, కాలంగడపడానికే ప్రయత్నిస్తూ వచ్చావు కాని దీని కోసం మరికొంత శ్రమపడాలని అనుకోలేదు. శ్రమపడాలని అనుకున్నా నీకు తీరిక మాత్రం ఎక్కడ?

పుట్టిన నిమిషంనుంచే జీవితంతో కుస్తీ పట్టడం ప్రారంభించావు. ఎలా ప్రాణం నిలబెట్టుకున్నావో, ఎలా పెరిగావో, ఎలా పెద్ద అయ్యావో, ఎలా తిన్నావో, ఎలా బట్టకట్టావో నేను ఊహించలేను కదుటోయ్! అందుకే కాబోలు నీ జబ్బల్లో అంతబలం, నీ హృదయంలో అంత కారుణ్యం కరడు కట్టి ఉన్నాయి. అందుకనే నువ్వు ఇన్నాళ్ళూ బ్రతుకుతూ వచ్చావు. అందుకే ఏ కష్టం వచ్చినా, సుఖం వచ్చినా పనితగిలినా, అవసరం వచ్చినా మేము నీ దగ్గరికే పరుగెత్తుకుని వస్తున్నాం.

ఇంతకీ ఓయి తమ్ముడూ! ఈ వేళ నా హృదయానికి ఎంత దెబ్బ తగిలిందనుకున్నావ్? అలా అంటే ఈ రోజు నేను లేచిన వేళ మంచిది కాదేమో అంటావు. నీకు తెలియదూ, నాకిలాంటివాట్లల్లో నమ్మకం లేదని? అయినా అది నీ కర్థం కాదులే. పోనీ, ఒకటి చెప్పు. అలాంటి నమ్మకాలవల్ల నీకెప్పుడు ఏం లాభం కలిగింది? రా అలారా, అసలు విషయం మాట్లాడుకుని దీని నిగ్గు తేల్చుకుందాం. అప్పుడు నీ పిల్లాడికి జబ్బు చేసింది. చుట్టుపక్కల ఎక్కడా వైద్యుడే లేడు. వైద్యుడంటే జ్ఞాపకం వచ్చింది. ఆసుపత్రుల్లో చేరినవాళ్ళు ఇంక మళ్ళీ ఇళ్ళకి రావడం లేదనే అంతా చెప్పుకునేవారు. ఆసుపత్రుల్లో మంచి మందులు ఉంటాయనీ, వైద్య సహాయం లభిస్తుందనీ అక్కడ చేరిన వాళ్ళు బాగుపడతారనీ నీకు చెప్పినవారెవరూ లేరు. ఇంక ఏం చేస్తావ్? ఊళ్ళో అమ్మవారికి కోడిపెట్ట ఇస్తానని మొక్కుకున్నావు. ఊళ్ళో తెలిసిన ఓ అయ్య దగ్గర ఇన్ని మాత్రలు తెచ్చి పిల్లాడిచేత తినిపించావ్. అదేం మాయరోగమో కాని, వచ్చిన మూడోరోజునే పిల్లాణ్ణి ఎత్తుకుపోయింది. అదేం రోగమో నీ కిప్పటికీ తెలియదుకదూ? అయినా నీ తప్పేముంది? ఆ తరువాత నీ పెళ్ళానికి కూడా జబ్బు చేస్తే, ఈ సారి చుట్టుపక్కల వాళ్ళు చెప్పారని సరాసరి అన్నవరం సత్యనారాయణస్వామివారికే మొక్కుకున్నావ్. దగ్గర్లో ఆస్పత్రులూ లేవు. డబ్బిచ్చి వైద్యుణ్ణి తెచ్చుకునే శక్తి లేదు. ఏం చేయాలో చెప్పే వాళ్ళూ లేరు. రోగాలు రాకుండా చేసుకునే సాధన సంపదా లేదు. ఇక ఏ దేవుడికైనా మొక్కుకోక చేసేదేముందని అడుగుతావా? అలా అంటే కాదు. ఇవన్నీ విడిచిపెట్టేయాలి. మారాలంటాను. నన్నెందుకిలా బాధపెడతారంటావా? ఓయ్ తమ్ముడూ, మేము నీ మానాన నిన్ను విడిచిపెట్టిం దెప్పుడోయ్?

అప్పటి సంగతి నీకు జ్ఞాపకం ఉందో లేదో గుర్తుకు తెస్తాను ఉండు. అప్పుడూ అంటే, అప్పుడు దేశానికి స్వతంత్రం లేదనీ మనమంతా ఒట్టి బానిసల్లా, పురుగుల్లా, జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నామనీ, మనమంతా కట్టకట్టుకుని, స్వతంత్రం కోసం పోరాడాలనీ, ఒక వేళ మనం చచ్చిపోయినా మన తరువాతివాళ్ళకేనా స్వతంత్రం ఉంటుందనీ, వాళ్ళ జీవితాలయినా భాగ్యభోగాలతో నిండిపోతాయని నీతో చెప్పే వాళ్ళం కదూ? మా మాటలు నీకు అర్థం అయిఉండకపోవచ్చు. ఒకటిమాత్రం వెంటనే తెలిసిఉంటుందిలే. స్వతంత్రం కోసమో, మరిదేనికోసమో యుద్ధం చేయా

లంటే నీకు వెంటనే అర్థం అయి ఉంటుంది కాలగమనం తెలుసుకోడానికి, ఆఖరికి ఎవరి వయస్సయినా తెలుసుకోడానికి కూడా యుద్ధాల్ని బట్టేకదూ నువ్వు లెక్కలు కట్టుకునే వాడివి? నీకు జ్ఞానం వచ్చిన తరువాత ఒక యుద్ధం చూశావ్. మీ అయ్య రెండు యుద్ధాలు చూశాడు. అంతకుముందు మీ తాత చూచిన యుద్ధాలు లెక్కకు కూడా మించిపోతాయేమో? ఈ వేళ నువ్వు దెబ్బలాడినా, దెబ్బలాడకపోయినా యుద్ధం ఎలానూ వచ్చేస్తుంది, దాన్నెవరూ తప్పించలేరనుకున్నావ్. ఎన్ని మోసాలు, అన్యాయాలు చేసినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా మా మీద ఇంకా విశ్వాసం చచ్చిపోలేదు కనుక, నలుగురితో చావు పెళ్ళితో సమానమనుకుని, మాతో కలసి పనిచేశావు.

అంతట్లో మరో యుద్ధం రానేవచ్చింది. ఆ తరువాత స్వతంత్రం కూడా దానంతట అదే చక్కా వచ్చింది. స్వతంత్రం వచ్చిందంటే అందరితో పాటు నువ్వు కూడా పొంగిపోయి ఉత్సవాలు చేశావ్. ఆ తరువాత మళ్ళీ ఎప్పటి అదే ప్రారంభమయింది. ఎటొచ్చీ ఒక్కటే మార్పు కనపడింది నీకు. నీ బాధలు, నీ ఇబ్బందులు, తగాదాలు, గొడవలు, అన్యాయాలు మునుపటి కన్నా ఎక్కువయ్యాయి. చివరికి తిండి బట్ట కూడా కరువై చావడానికి సిద్ధమయ్యావు. అప్పుడు నీకేం తోచి ఉంటుంది? స్వతంత్రం రాకముందే బాగా ఉండేదనికదూ? అలా అని నువ్వు బయటికి అనలేదు. అనలేకపోయావు. ఆ విధంగా తోచినదంతా బయటికి అని ఇతరులకు, అందులోనూ ఎంత దుర్మార్గులైనా నీతోటివారికి ఏ కొంచెమైనా బాధ కలిగించడం నీకు అలవాటు అయిన పని కాదు. అది కూడా సహించావు. ఏమైతేనేం, మా మీద నమ్మకం అప్పుడే నశించిపోయిందా యేం?

నీ కోసమే ఈ స్వతంత్రం తీసుకువచ్చామనీ, నువ్వు అడక్కుండానే నీకు కడుపునిండా తిండి, కట్టడానికి బట్ట ఇస్తామంటే నీకు నవ్వు వచ్చిందా? కాని, అది నిజమే సుమా, తమ్ముడూ! ఈ మాట నమ్ము. కొద్ది కాలంపాటు ఇలా కష్టంగా ఉన్నా, ఇకముందు చాలా బాగా ఉంటుందని నేను కూడా నీతో చెబుతున్నానోయ్! అయినా ఇలా ప్రత్యేకంగా నీతో చెప్పవలసిన అవసరం మాత్రం ఏముందిలే? ఎంత కాలం నుంచో ఇలా బాధలు పడుతూ, హృదయవిదారకమైన సంఘటనలు చూస్తూ, విషాదంతో కూడిన అదే చిరునవ్వు నవ్వుకుంటూ నువ్వు ఇంకా అలాగే అంతటి సహనంతోనూ బ్రతికిఉన్నావంటే ఆ ఆశే కాదూ కారణం? ఇది నిజమే కాదూ?

నీలో ఈ ఆశాభావం చచ్చిపోకుండా ఉండేటట్లు చేయడానికి, నీ జీవితం ఎప్పటికైనా సుఖమయం అవుతుందని నచ్చ చెప్పడానికి, అందుకోసం మేమంతా ప్రాణత్యాగమైనా చెయ్యడానికి సంసిద్ధంగా ఉన్నామని నమ్మించడానికి ఎందరో ఎన్ని కథలో కావ్యాలో వ్రాశారు. చాలామంది ఆ విధంగా నిజంగానే ప్రాణత్యాగం కూడా చేశారని నేను ఎన్ని పర్యాయాలు నీతో చెప్పలేదు? నమ్మావో లేదో కాని నవ్వి ఊరుకుంటూవచ్చావు. ఎందుకని? సత్యనారాయణస్వామి మహత్యంవల్లనో, ఆయుర్దాయం గట్టిగా ఉండడం చేతనో నీ భార్య బ్రతికింది. మొక్కుకున్న తరువాత మొక్కు తీర్చుకోక తప్పుతుందా? నీ ఆలోచనలకి, నీ చేతలకి భేదం ఏ నాడూ లేదు. నీ వెంత అమాయకుడివోయ్, తమ్ముడూ! కాలినడకనే అన్నవరం వెళ్లడానికి నిశ్చయించుకున్నావ్. అదే నీకున్న ఏకైక వాహనం. కాని, బత్తె ఖర్చులికి, దేవుడికివ్వడానికి కావాలని తల తాకట్టు పెట్టినా (తాకట్టు పెట్టడానికి నీ దగ్గర మరే ముంది కనుక?) పది రూపాయలు పుట్టించలేకపోయావ్. చివరికి ఏమయింది? ఏడాదయినా తిరక్కుండా నీ భార్య కూడా పోయింది. ఆఖరికి చేసుకున్న పెళ్ళానికి మందిప్పించే సామర్థ్యం కూడా నీకు లేకపోయింది. అందుచేత నా తమ్ముడూ, నవ్వి ఊరుకున్నావ్! నువ్వు నిజంగానే ఆ కథల్ని, కావ్యాల్ని, ప్రాణత్యాగాల్ని నమ్మలేక పోయావుటోయ్!

ఈ మాటలకేంగాని తమ్ముడూ, ఇంతకీ నా హృదయానికి కలిగిన బాధగురించి చెబుతా విను. నిన్ను గురించి కథ వ్రాద్దామంటే నా కేమీ తట్టింది కాదు. పిచ్చివాడా, కథ వ్రాయడానికి తగినంత విశిష్టత కాని, ప్రత్యేకతగాని, అసాధారణత్వం కాని నీ జీవితంలో ఎక్కడా గోచరించ లేదోయ్! పైగా నీలాంటివాళ్ళు ఈ ప్రపంచంలో ఎంతమంది ఉన్నారో తెలుసా? కోటానకోట్లు. సర్వ సామాన్యమైన సామాన్య మానవుడివి నువ్వు. నిన్ను గురించి వ్రాస్తే ఈ చదువుకునేవాళ్ళంతా ఏమనుకుంటారో తెలుసా? నాకేమీ తెలియదేమో, నేనాటే చదువుకున్న వాణ్ణికాదేమో అనుకుంటారు. నవ్వుతారు తమ్ముడూ. మరింకెలాగ? కథ వ్రాయకపోతే నాకు భుక్తి కూడా ఉండదు. కదా నాయనా? దానికితోడు నేను బాగా కథలు వ్రాయగలనని పదిమందిలోనూ ప్రతీతికూడా ఉందికదా? నా పరువు ఏమైనా నిలుస్తుందా చెప్పు? నా హృదయానికి కలిగిన బాధ ఇదే తమ్ముడూ!

అదృష్టవశాత్తూ ఇదేదీ నీకు అర్థంకాదు. లేకపోతే ఇలా చెప్పగలిగేవాణ్ణా? అయితే ఏం? అంతమాత్రంచేత పోయేదేమీ లేదు. కేవలం నా హృదయానికి బాధకలిగిందన్న విషయం మాత్రం నువ్వు ఎంతో సులభంగా అర్థంచేసుకోగలవు. నీ హృదయం ప్రేమమయం నాకు సానుభూతి చూపిస్తావుకదూ? ★

డొక్కా సీతమ్మ

శ్రీ బందా కనకలింగేశ్వరరావు

(బైరాగులు దోవవెంట పోతూ)

ఎన్ని దానాలైన అన్నదానంబోన
ఇన్ని నిష్ఠలు, జపాలెందుకోగురుడా!
పట్టెడన్నము పెట్టి బ్రతికించు సీతమ్మ
అట్టి తల్లికి సాటియగువారెగురుడా!
రాజులంతా పోతరాజులా తింటారు
రోజంత సాధులూ-రోదింతుగురుడో.

బంట్రోతు: పేర్రాజు గారూ! రాణో డాగుగారూ! దొరగారి కేలవైంది.

పేర్రా: కేలవైందో! ఇదిగో ఇప్పుడే వస్తున్నానని మనవిచెయ్యి.

జమీందారు: పేర్రాజుగారూ! ఏవి టండీ ఆ గోసాయిలు పాడుతారు. ఎవ రండీ, ఆ సీతమ్మగారు. మా గొప్పగా పాడేస్తున్నారు. సత్రాలు, సావిళ్లు కట్టించిన వాళ్లం దొరలం, మేమంతా ఊరికే నే పోయినాంగాని ఈ సీతమ్మగారొకతె వచ్చింది. గొప్ప అన్నదానం చేసేదని పొగడడానికి?

పేర్రా: చిత్తం అదేవిటి? అదుగో, అదుగో ఆ వీధిలో భట్రాజు ఒకడు వస్తు న్నాడు. కేలవైతే పిలుస్తాను. డొక్కా సీతమ్మగారిమీద పద్యంపాడూ అనండి.

జమీ: పిలు, పిలు, విందాం.

పేర్రా: అదుగో వస్తున్నాడండి.

భట్రా: చిత్తం ప్రభువులు, మహారాజులు, అర్థిజన కుముద బాంధవా! ఆశ్రిత విద్వజ్జనాధారా! రాజనమంత్రిభాస్కరా.

జమీ: ఆగవోయ్, ఆగు.

పేర్రా: ఆగవోయ్! ఊరికే ఒకటే!

జమీ: ఆ డొక్కా సీతమ్మగారిమీద ఏదో పద్యముందిట-ఏది చదువూ నువ్వే వ్రాశావా!

భట్రా: చిత్తం మహాప్రభో-(రాగంవలె మూలిగి)

క. డొక్కా సీతమయంటె
నిక్కముగా అన్నపూర్ణ నిజమరయంగా
ఎక్కడిదది, ఘృతి, సూపము
లెక్కడి భక్ష్యాలు చెప్ప నెవ్వరితరమా.

జమీ: ఇతని కేదన్నా యిచ్చిపంపించమని కచ్చేరిలో చెప్పు.

భట్రా: మా ప్రభో! యివే యీ తల్లి కథలు చాల ఉన్నయండి, ఒకొనొకనాడు.

జమీ: పేర్రాజూ వెళ్లమని చెప్పు.

పేర్రా: (నెమ్మదిగా) వెళ్లు వెళ్లు దొరగారి కేలవైంది.

జమీ: ఏమిటో వేలంవెర్రి.

పేర్రా: చిత్తం. తమరు అలా శెలవిస్తే ఏం చెపుతాను. నేనూ చాలామందిని చూస్తున్నాను. డొక్కా సీతమ్మగారున్నారేండి, ఆ మహాతల్లి అన్నపూర్ణాదేవే అంటాను. ఓరాత్రి లేదు! పగల్లేదు. అతిథి, అభ్యాగతీ ఎవరు వెళ్లినాసరే, ఆప్తబంధువుల్లాగు చూసుకొని, షడ్రసోపేతంగా, మృష్టాన్నం పెడుతుందండి!

జమీ: అసలు, నీవు కొత్తవుంటె గంపంత చేస్తావు.

పేర్రా: కాదు ప్రభూ. తాము నిజం చిత్తగిస్తే—

జమీ: పోవయ్యా. ఎప్పుడన్నా, ఎవరన్నా వస్తే, పట్టెడన్నం పెడుతుందేమో! అసలు బ్రాహ్మణులూ, చూశావూ! తినటానికి పారెయ్యటానికి సరిపొయ్యేట్టు వండుకుంటారుటలే. ఆ వేళకు ఎవరన్నా వస్తే పారెయ్యకుండా, వచ్చినవాళ్లకు పెట్టిందేమో......అంతమాత్రం చేత......

పేర్రా: స్వయంగా నేను చూశాను చిత్తం......

జమీ: నీవు వెళ్ళిననాడు ఏదో పండుగైయుంటుంది. బాగా మేపిందేమో. ఓః, నీవు ఆమెను తీసుకువెళ్ళి నక్షత్రాల్లో నడిపిస్తున్నావు.

పేర్రా: తమదాకా ఆ ప్రశంస రాలేదుగాని, ఎప్పుడూ డొక్కా సీతమ్మగారంటే చాలా ప్రకాస్తి చిత్తం. మొదట వాళ్లది మంచి సంసారమె. ముప్ఫై ఎకరాలు గోదావరి కాలవక్రింద సుక్షేత్రమైన మాగాణీ, రెండు కొబ్బరితోటలు, మన ఎస్టేటులోవూరే అది. తమరు ఎప్పుడూ దయచేయలేదు ఆవూరు.

జమీ: ఒక్క బ్రాహ్మలకేనా— పేర్రాజూ?

పేర్రా: అలాకాదండి. ఎవరైనాసరే. ఈకులం, ఆకులం అని విచక్షణేలేదు ఆ తల్లికి. క్షుధార్తుడై వచ్చాడంటెసరి, అన్నం పెట్టేదాకా ఆమె ప్రాణం నిలవదంటే నమ్మండి—చిత్తం, అదేవిటో—కేవలం! ఇందుకే వాళ్ల ఆస్తి, ఆ కొబ్బరితోటా, అన్నీ అప్పులకింద అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా బాధపడిపోతున్నారు పాపం. అయితేమాత్రం, నా స్తివున్నదా, హరిహరీ మాంగల్యాన్ని కుదవపెట్టయినా సరే ఆ వచ్చినవారి ఆకలిమంట చల్లారుస్తుందిగాని ఆతల్లి...జగన్మాత - చిత్తం—చిత్తం.

జమీ: నువ్వింతగా చెపుతూంటే నిజమేమో, అనిపిస్తూంది. ఐనా పరీక్షించి చూస్తేగాని నేను నమ్మను. వాళ్లకేం దొరతనాలున్నా యంటావా?

పేర్రా: చిత్తం, చిత్తం, ఏదో పరువు కోసం నలుగురు, ఓహో అని పొగడటం కోసం చేసేమనిషైతే పరీక్షిస్తే పడిపోతుంది. ఆమెకేం. ఆమెది మాతృహృదయం 'ఆకలి అమ్మా' అని వింటే ఆమె ప్రాణం, కోసుకుపోదూ!

జమీ: సరేగాని, యిలా యిల్లంతా గుల్ల చేస్తుంటే ఆమె భర్త చూస్తూ ఊరుకుంటున్నాడూ?

పేర్రా: జోగన్నగారు అంతవాడు కాదు లెండి. తెలివికలవాడే. ఏంచేస్తాడు. భార్య చేసేది సత్కార్యం.

జమీ: ఏం భార్య - ఏం సత్కార్యం- కొంప కొలుపోలా—ఇప్పుడేంచేస్తారూ?

పేర్రా: ఆమె కొదిగు లే లేదండి, 'అంతా పరమేశ్వరుడే యిస్తాడు. ఇదేం నా ఇంట్లోపనా—,' అని ఆమె ఎప్పుడూ మహారాజు పత్నికున్నంత సంతృప్తితో ఉంటుంది. చిత్తం చిత్తం.

జమీ: ఇదెంతవరకు నిజమో, నేను బాగా విచారించుకొనిగాని చెప్పను. నిజమే ఐతే మాత్రం పాపం సర్వం కోలుపోయిన వాళ్ళకు ఒక వూరు వ్రాసియిచ్చి నిరతాన్నదానం చేసే ఏర్పాటు చేస్తాను.

పేర్రా: చిత్తం. ప్రభువు తలుచుకుంటే ఏం కొదవ.

[సీతమ్మగారు. ఆమె భర్త—రాత్రి 9 గంటలు. వంటిల్లు సర్దుకుంటున్నట్లు చెంబులు పీటలు చప్పుడు. తలుపు వేసింది.]

భర్త: ఇదిగో—

సీత: ——

భర్త: అమ్మో—!

సీత: ఏమిటి?

భర్త: అన్నం తినకుండానే వచ్చావా, చివరకి...ఎందుకు తింటావు — మొదటి నుంచి ఇదేగా మనకు, నే నొనంటే నీవు కొదంటూ వుండడం.

సీత: పోనీలెద్దురూ - ఒక్క నాటికేం ప్రాణాలు పోతాయా—

భర్త: అదికాదు, ఉండిగా తినకపోవట మెందుకూ అని.

సీత: ఎవరన్నా, అపరాత్రివేళ వస్తారనుకోండి, వస్తే, అప్పుడేం చేస్తారు. ఈ జోరున ముసురూ-మీరు పెద్దమనుషులు ఎక్కడికి వళతారు, ఎవరిస్తారు చెప్పండి.

భర్త: ఈరాత్రి ఎవడొస్తాడే తలకు మాసినవాడు మనం మహాసత్రం పెట్టామని.

సీత: అలాకాదు పరీక్షగా తటస్థపడుతారు ఇలాంటప్పుడే. మనమేం లోకాన్నుద్ధరిస్తున్నామా? పట్టెడు మెతుకులు, అంతేగా—

భర్త: అల్లాగే ఉంటుంది మొదట్లో. ఒక్క సెంటు భూమికూడా లేకుండా అంతా అప్పులవాళ్లు కట్టుకొనిపోయినారా? చూస్తూండగా. మనమేం చేశామని పెళ్లిళ్లా ప్రస్తావాలా? అంతా ఈ భోజనాలకిందేగా అంతరించి పోయింది. తోటలు, దొడ్లు, సర్వమూ.

ఇహ కొంప ఒకటి మిగిలివుంది, సూర్య చంద్రాదులూ, మనం కలిసి కాపరం చేయటానికి.

సీత: మనం యివ్వన్నీ వచ్చేటప్పుడూ మూటగట్టి తెచ్చాముటండీ? పోయేనాడూ అంతే, ఒక్కటీ వెంటరాదు. ఏదో ఆ భగవంతుడే ఇస్తూంటాడు ఆవేళకి.

భర్త: మనింటికి వచ్చేవాళ్లకుమాత్రం ఆ భగవంతుడు లేడూ-ఆడవాళ్ళకి పట్టిందా ఒక్కటే వేదాంతం — లేదా, అరిచి చచ్చినా చేయి జరుగుతుందా? సరిగానీ, లోపలికివెళ్ళి నాలుగు మెతుకులు తిందూ మరేం పొద్దుపోలేదు.

సీత: వద్దులెండి. స్వస్థంగా పడుకోండి. నాకు కాస్త, కాళ్లు లాక్కుపోతున్నయి. మీరు అలా గుమ్మంపట్టుకుని నిలుచుంటె యెల్లా, మంచంమీద కూలబడటానికైనా?

భర్త: అంటె, తినవన్నమాట. తెల్లవారితే, ఏదో అఘోరించి, ఎవరికాళ్లైనా పట్టుకుని—చివరికీ కొంప ఒకటేగా మిగిలిందీ. దీన్నికూడా తాకట్టుపెట్టి కావలసిన దధిఘృత పాయసాలు, బండ్లకెత్తించుకొని వస్తాను. సరేనా? నీవు స్వర్గానికి పోతావంటే నేనేనా అంత పాపిష్ఠి పరమయ్యాని.

సీత: నామాట వినండి. నన్ను క్షమించండి. ఏదో ఎవరిపిచ్చి వారికానందం.

మీరువెళ్ళి పడుకోండి నాకేంపరవాలేదు.

భర్త: నీ ఖర్మం—అనుభవించు.

సీత: ఈయన పడుకున్నారు. ఆ పరమేశ్వరుడే యిస్తాడనె నమ్మకం కుదరక, ఊరికే ఆందోళనపడతారు ఈయన. చేసేదేముంది. ఔను, తెచ్చేమగవాళ్ల బాధ అంతేనేమో ... రామచంద్ర ప్రభూ. రక్షకా, నీదయ—మాదీ అనేదంతా సమర్పించుకున్నాం. అతిథిని పంపించేవాడివి, ఆహార మందించేవాడివి అంతా నీవేకదా? ...—ఆవలించి 'రామనామతారకం భక్తిముక్తిదాయకం' (అని పాడుకుంటూ నిద్రిస్తుంది.)

[రాత్రి వానకు గోదావరి ప్రవాహపు నీటి కరుళ్లు ఒడ్డునకు తగిలే శబ్దం. 'ఘుంయి' మనే ఈదరగాలి, శీతమ్మగారి యింటి తలుపులు ఊపుతూంది.]

సీత: (మెలకువతో) నిద్రపట్టలా పాపం? ఏమండోయ్? నిద్రపోతున్నారా

భర్త: అబ్బా—ఏమిటే?

సీత: చూడండి—ఏమిటీచప్పుడు.

భర్త: గాలికేమో, తలుపులు కొట్టుకుని వుంటయి.

(హోరుగాలి వినపడుతుంది)

[అబ్బా కిటికీ మూసేయి. వానజల్లు లోపలికి కొట్టుతూంది. అమ్మయొ్య ఏం వురుములు. ఏం మెరుపులు.]

సీత: రామనామ తారకం
భక్తిముక్తి దాయకం..

భర్త: పడుకోవే, నీభక్తి బంగారం గాను. రెండు ఘంటలైంది, కూచున్నావు శివశక్తిలాగు.

సీత: ఏమిటీపడక, హోరుగాలిలో నిద్దరేం పడుతుంది.

(దూరాన్నుంచి, సీతమ్మగారూ, ఆకలేస్తూంది. అన్నంపెట్టండి సీతమ్మగారోయ్.]

సీత: ఏమండోయ్ లెండి. ఎవరికో ఆకలేస్తున్నదిట పాపం.

భర్త: చాల్చాల్లే! ఊరుకో. ఏ మాలవాడో, మాదిగవాడో. అర్ధరాత్రీ-ఆకలేస్తే రోకలి మింగమన్నారు.

సీత: అల్లాకాదండీ-ఎంత ఆకలేసిందో అర్ధరాత్రివేళ-నేను చెప్పలా యిలాగే ఎవరైనా తటస్థపడతారని. నేను తినేస్తే మోసమయ్యేది సుమండీ.

[గోదావరి అవతల ఒడ్డునున్నానమ్మా తల్లి] (అని కేక దూరాన్నుంచి)

సీత: ఆగండి-అదుగో గోదావరి అవతల ఒడ్డునున్నాట్టండీ! ఆ పట్టెడు మెతుకులు పెట్టివస్తానండీ.

భర్త: నీకేం మతిగితి పోయిందా. అర్ధరాత్రి-గాలి హోరుమంటోంది— ఇప్పుడు గోదావరిదాటి వాడికి అన్నంపెట్టివస్తావు? మహాబాగావుంది.

(కేక) [ప్రాణాలు పోతున్నయితల్లీ— సీతమ్మతల్లీ—ఆకలేస్తోందమ్మా.]

(19-వ పేజీ చూడండి)

కుక్కకాటుకి చెప్పుదెబ్బ

ను చూశాను. అయిదున్నరయింది.

తిరుగుముఖం పట్టటం శ్రేయస్కర మని తోచింది. అదీగాక చాలదూరం వచ్చేశాను. పెందలకడనే రూముకి చేరుకుందామనే ఉద్దేశ్యంతో వెనుకకు తిరిగాను.

చల్లగాలి ప్రారంభించింది. ఎన్నాళ్ళయిందో సుఖంగా చల్లగాలి పీల్చి అన్నట్లున్నది నడుస్తూఉంటే. దినం గడవటం కష్టంగా ఉన్నది ఊళ్లో. గాలి ఉన్న కొద్దికీ ఎక్కువైపోతోంది. ఎందుకైనా మంచిదని నడక వేగం హెచ్చించాను.

అంతవరకు చెత్త రేగేస్తున్న ఎండ కాస్తా మాయమయిపోయింది. ఎక్కడనుంచో మేఘాలు వచ్చి పడుతున్నయ్. ఒక్క నిముషంలో అంతా చీకట్లు కమ్ముకున్నయ్. గాలి ఆ చెవిలోనుంచి ఈ చెవిలోకి కొట్టేస్తున్నది. పైగా మెరుపులు, ఉరుములుకూడ ప్రారంభమైనయ్.

అదే పనిగా నడుస్తున్నాను, వాన కురవకముందే, తడవకుండా ఇంటికి చేరుకుందామని. ఇంకా ఊరు మూడుమైళ్ళుంటుంది సుమారు. అప్రయత్నంగా అనుకోకుండానే ఇంత దూరం షికారు వచ్చినందుకు అప్పుడు విచారించటం ప్రారంభించాను. నడుస్తూనే ఇదంతా. ఆపని చేయకముందు నాకే చీకూ చింతా ఉండదు. ఏదో ఒకపనిచేయటం చేసిన తరువాత విచారించటం నాకు పరిపాటయిపోయింది.

మూలిగే నక్కమీద తాటికాయ పడ్డది. అసలే ఏడుస్తో నడుస్తున్నాను. వాన ప్రారంభం కానేఅయింది. గాలీ తగ్గటం లేదు, హెచ్చటమే గాని. ఒక్కొక్క ఉరుము ఉరుముతూంటే, ఒక్కొక్క మెరుపు మెరుస్తుంటే మతిపోయినంత పనవుతోంది.

ధైర్యంచేసి ముందుకుసాగిపోతున్నాను. నేను ముందుకి ఒక అడుగు వేసినకొద్దికే వానకూడ ఒక అడుగు ముందుకు వేయటం సాగించింది. అంతకంతకూ ఎక్కువైంది వర్షం.

ఇంతలో ఒక మర్రిచెట్టు దగ్గరకు వచ్చాను; కాస్సేపు చూసి వర్షం వెలిశాక పోదామని. ఇంకా బట్టలు తడవలేదు. తడిస్తే అవిధంగానే పోదును. తడిసేవరకే ఈ బాధంతానూ.

అదొక మహావృక్షం దాని వయస్సెంతో నిర్ణయించటం నా చేతకాదు. పైకి చూశాను. అంతా చీకటి. చిన్నప్పుడు చెప్పుకొనే దయ్యాలకథలు జ్ఞాపకం వచ్చినయ్. మరి కాస్సేపు అలాగే చూస్తే ఆ కథలన్నీ చిత్రాలు కావచ్చునని భయంతో తల దించేసుకున్నాను.

ఇంతలో ఓ కారు పోయింది తుర్రుమని. దాంట్లో డ్రైవరుతప్ప ఎవ్వడూ ఉన్నట్లు కనుపించలేదు. ఒక్కడే ఏడవకపోతే, దారిప్రక్కన, మర్రి క్రింద అవస్థపడే నాలాటివాడిని ఎక్కించుకోగూడదూ? ఆ మాత్రం జ్ఞానం వాళ్ళకుండాలిగాని మనం చెపితే వస్తుందా? అనుకున్నాను.

అలా అనుకొని ఊరుకొంటే బాగానే ఉండేది. ఈసారి వచ్చేకారుని ఆపి మరీ ఎక్కుదామనే ఉద్దేశ్యపడ్డాను. ఇంతలో ఓ కారు రానేవచ్చింది. ఆపటానికి ధైర్యం చాలలేదు. ఆపుదామా? వద్దా? అని తికమకపడుతూనే ఉన్నాను. అది పోనే పోయింది. ఈసారి మనస్సు దిట్టపరచుకొని కారుకోసం ఎదురుచూడటం ప్రారంభించాను.

నేనుమాత్రం సరదాకిగాని, వాళ్ళను గోలచేయటానికిగాని ఆపటం లేదుగా? అవస్థపడుతున్నాను గాబట్టి సహాయం అర్థిస్తున్నాను. అదీగాక ఎదుటివాళ్లు నాకు కావలసిన సహాయం చేయగలరు కాబట్టి అడుగుతున్నాను. అవసరంలో ఉన్నాను గాబట్టి అడగటం నా విధి. అవసరం తీర్చ గలవారువారే కాబట్టి సహాయంచేయటం వాళ్ల విధి. ఇందులో తప్పుకీ, ఒప్పుకీ ఆస్కారం లేదని నన్ను నేనే సమాధాన పరచుకొన్నాను.

ఈసారి ధైర్యంగా నిలబడ్డాను. వచ్చిన కారుని తప్పక ఆపాలని పట్టుదల. ఇంతలో కారుమోత వినిపించింది. చెవులు నిక్కబొడుచుకున్నయ్. ఆ వైపు చూశాను. ఏమీ కారు వస్తున్న జాడలు కనుపించటం లేదు. అటు చూస్తూనే ఉన్నాను. ఇటునుంచి తుర్రున ఓకారు వచ్చిపోయింది. అయినా, ఇటుపోయే కారుతో తనకేం పని?

టైము చూసుకున్నాను. సరిగ్గా అయిదు నిముషాల తక్కువ ఆరయింది. హారన్ వినిపించింది. ఆదుర్దాగా చూశాను ఆవైపు. ఓ చిన్న 'చెవ్రులెట్' కారువస్తోంది. ధైర్యంచేసి చేతిమీద చొక్కా పైకితీసి, చెయ్యిచాచి గాలిలో ఆడించాను.

నడుపుతూన్న పెద్దమనిషి నా వంక చూశాడు. కాని కారు ఆగలేదు. అదీ నా బాధ. కారు ఆగకపోతే పోయింది. అతను చూడకుండా ఉన్నందువలన ఆగకపోతే సంతోషించేవాడినే. చూసిగూడ ఆగకుండా నిర్లక్ష్యంగా చూస్తూ వెళ్లిపోయాడు. పోనీ అతను చూస్తే చూశాడు. ప్రక్కనున్న లలనాంగికూడ చూసింది. ఏమిటో వాళ్ల ఎక్కువదనం. చూపుల నిండా అదే. ఒక కారులో కూర్చోగానే అంతా తీరిపోయినట్లు భావించటం.

అయినా నాపిచ్చిగాకపోతే మరేమిటి? ఎవరో మొగుడూ పెళ్లాం కారు వేసుకుని, జోరువానలో, చలిగాలిలో, చక్కగా, ఒంటరిగా పోతుంటే మధ్యలో,పానకంలో పుడకలా అడ్డుపడటమేమిటి? నా తెలివి తక్కువతనానికి నేనే ఆశ్చర్యపడ్డ క్షణాలలో అదొకటి. నేను గనుక అలా కారులో పెళ్లాంతోపోతూ ఉంటే ఆపేవాడినా? లేదు. లేనపుడు ఆ, ఆ పనివాడిని తిట్టటం దండుగ. ఏమిటో చర్చ సాగిపోతున్నది.

టైము సాగిపోతున్నది. చీకటికూడ సాగుతున్నది. ఉరుములు, మెరుపులుకూడ సాగుతున్నయ్. అన్నిటితోపాటు నా భయంకూడ సాగుతోంది.

అసలు బస్సు వచ్చే సూచనలు కన్పించటం లేదు. బస్సు రాకపోతే ఆపూట నా పని సున్న. ఎంత చూసినా కారు రావటం లేదు. వాన వెలవటం లేదు. భయం పోవటం లేదు. ఏంచేయాలో తోచటంలేదు. మరి కాస్సేపు అలాగే ఉండిపోవటం సంభవించినా కారు ఆగకుండా వెళ్ళిపోవటం సంభవించినా, ఆ రాత్రికి నా పాట్లు కుక్కలన్నా పడవు.

చీకటి, బయటా లోపలా కూడ ఎక్కువై పోతోంది. ఈసారి మంచి ఉపాయం తోచింది. ఈసారి ఇటువైపు వచ్చిన కారు ఆగకుండా పోవటానికి వీలు లేదు. అసలు ఇటువైపు వస్తేగా? అదొక పెద్ద ఆశాభంగం. ఇంతవరకూ వచ్చిన కార్లను ఆపలేకపోయాను. ఇకముందు వచ్చే కార్లను ఆపగలను. ఆపగలను గాబట్టి అవి రావు. జరగబోయేది అంతే ననుకొని ఆ మెరుపుల్లో నేను కూడ ఒక మెరుపు తీగలా నిలబడ్డాను.

కారుమోత వినిపించనే వినిపించింది. మధ్యలో నాకో అనుమానం తట్టింది. వాడు అంతా చూసి భయంపుట్టి ఆపకుండా పోనూ వచ్చు, ఇక్కడెవరూ మనుషులు లేరు గాబట్టి ఏమైతే అదవుతుందని నడక ప్రారంభించాను, అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని. అసలు దాదాపు ప్రాణాలమీద చాలవరకు ఆశ వదులుకొనే రోడ్డు పట్టాను.

కారు హారన్ వినిపించింది. తొణకకుండా నడుస్తున్నాను. మళ్లా వినిపించింది. ఎటూ గాకుండా నడుస్తూ ఒక ప్రక్కకి తొలిగాను. కారు నా ప్రక్కకి వచ్చింది. ఎగిరి ఒక్క గంతేసి, అరుస్తూ రోడ్డు ప్రక్కనే పడిపోయాను, కారు నంబరు కేసి చూస్తున్నట్లు నటిస్తూ. కారు ఆగిపోయింది. ఆ నడిపే పెద్దమనిషి నాకు దగ్గరగా వచ్చాడు.

నా వళ్ళంతా మట్టి కానే అయింది. పోనీలే నడవటం తప్పిందిగదా అనుకుంటూ 'అబ్బ, ఉష్' అనుకుంటున్నాను.

"సారీసార్, కారులోకి రండి. పట్టుకుంటాను నేను." అన్నాడాయన. అంటూ ఉండగానే నేను లేచి కారులోకి పోయి కూర్చుందా మనుకున్నాను గాని, నాకు దెబ్బలు తగలలేదని అనుమానం వేస్తే ప్రమాదం. నా కప్పుడు అసలు తగలవలసిన దెబ్బలు తగులగల అవకాశా లున్నయ్.

రెండు చేతులతో నన్ను పట్టుకొని లేపబోయాడు. ఆయన లేపబోయిన కొందికే నేను జేరగిలబడ్డాను. ఆయన తన కారు మూలంగానే నాకు దెబ్బలు తగిలాయనుకున్నాడు.

"కాళ్లు నొప్పి పట్టాయాండీ?" అన్నాడాయన.

"నొప్పిపట్టట మేమిటి? ఈ తొంటె విరిగిపోయినట్లుంటేను." అన్నా, ఏడుపు ముఖం పెట్టి.


ఆయనే నన్ను పూర్తిగా లేవదీశాడు. నేనుమాత్రం మునిగాళ్లమీద నడుస్తున్నట్లు నటించాను. అమాంతం నన్ను మోసుకుపోయినట్లు తీసుకుపోయి కారులో కూర్చోబెట్టుకొన్నాడు.

వెచ్చగా, హాయిగా ఉన్నది. అబ్బ, అమ్మ అంటూనే ఉన్నాను మధ్య మధ్య, నమ్మకం పోకుండా ఉండటంకోసం. టైము చూసుకున్నాను. ఆరున్నరయింది. ప్రొద్దుకూకుతోంది. మునిసిపల్ దీపాలు వెలుగుతున్నయ్. అప్పటికే దాదాపు ఊళ్లోకి వచ్చామన్నమాట.

రెడీగా కూర్చున్నాను బయటకు చూస్తూ. మా రూము రానేవచ్చింది.

"ఇక్కడ ఆపండిసార్. మా రూమ్ వచ్చేసింది." అన్నాను.

కారు ఆపాడు ఒక్కసారి.



"హాస్పిటల్‌కు పోయివద్దాం. మళ్ళా తీసుకువచ్చి దిగవిడుస్తాలెండి." అంటున్నాడాయన.

నేను ఒక్క గంతులో బయటకు దూకాను. ఆయన ఆశ్చర్యపోతూ చూస్తున్నాడు.

"వస్తాను. *Thank you Sir.* నాకు దెబ్బలు తగిలితేగా హాస్పిటల్‌కి రావటానికి" అన్నాను.

కారు స్టార్టు చేస్తున్నాడు. పోతూ పోతూ ఊరుకుండలేకపోయాను. "*Thank you for your Coneyenence*" అంటూ పోబోయాను. నవ్వు ఆగింది కాదు.

కారు బయల్దేరింది. నా *Thanks*, నవ్వులూ ఆ మోతలో ఆయనకు వినపడ్డాయో, లేదో? బహుశః వినిపించే ఉండాలి.

* * * *

ఆ రోజు సాయంకాలం వద్దనుకుంటూనే సీ కారుకి బయల్దేరాను. బయల్దేరినందుకు అంతా బాగానే ఉన్నట్లు తోచింది. ఓ సిగరెట్ వెలిగించుకొని రోడ్డునే పోతున్నాను. ఎత్తు ఎక్కాను ఎలాగైతేనేం. మళ్ళా దిగాలి. దిగుతూ ఉన్నాను సిగరెట్ పొగ పీలుస్తూ, ఆలోచిస్తూ.

కారుమోత వినిపించింది. వెనక్కు తిరిగి చూశాను. మరుక్షణంలో కారు ఆగిపోయింది. అటు తిరిగి నిలబడ్డాను. కారుని ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం. ఎప్పుడో ఎక్కినట్లు కూడ జ్ఞాపకం.

ఇంతలో కారులోనుంచి ఒకాయన దిగాడు. ఎక్కడో చూసిన ముఖం.

"హాల్లో సార్" అన్నాడాయన.

"ఏమండీ," అన్నాను.

"కొంచెం ఇటు వచ్చి ఒక చిన్న సాయం చేస్తారా?" అన్నాడు.

నేను మాట్లాడకుండా కారుదగ్గరకు పోయాను.

"కారు నడపటం చేతనవునా మీకు?" అని అడిగాడాయన.

"ఎందుకు?" అన్నాను.

"కాదండీ! 'డౌన్' కదా అని ఇంజను ఆపేసి వస్తున్నాను. రాయి తగిలి ఆగిపోయింది. స్టార్టు కావటంలేదు. నేను వెనక నిలబడి తోస్తాను. మీరు స్టార్టు చెయ్యండి." అన్నాడాయన.

"నాకు కారునడపటం చేతకాదండీ." అన్నాను, ముఖం చిన్నదిచేసుకుంటూ.

"ఫరవాలేదులెండి. ఇటువంటి కార్లలో ఒంటరిగా రావటం ప్రమాదం" అంటున్నాడాయన.

"పోనీ ఒకపని చేదాం. నేను వెనుక నిలబడి తోస్తాను. మీరే స్టార్టు చెయ్యండి" అన్నాను.

"మీ కెందుకంత శ్రమ..." అంటున్నాడాయన.

"ఫరవాలేదు. ఫరవాలేదు. కానివ్వండి" అంటూ కారు వెనుకవైపుకి పోయాను.

"మొత్తంమీద మీకు శ్రమ కలిగిస్తున్నాను." అంటూ ఆయన 'స్టిరింగ్' ముందర కూలబడ్డాడు.

బలంకొద్దీ తోయటం సాగించాను. మొత్తం మీద కదిలింది కొంతసేపటికి నెట్టాను. మెల్లగా పోతోంది. ఆయన ప్రయత్నిస్తున్నట్టున్నాడు గాని అది మాత్రం స్టార్టు కావటంలేదు. దాదాపు అర ఫర్లాంగు [illegible]శాను. "ఇంతవరకూ డౌన్ గాబట్టి సరిపోయింది. ఇకమీదట మీరుకూడ తొయ్యలేరు. ఫరవాలేదు. మరెవరైనా ఇద్దరు ముగ్గురు వచ్చినపుడు బ్రతిమలాడతాలెండి." అన్నాడాయన.

జేబు రుమాలుపెట్టి చెమట తుడుచుకొన్నాను.

"ఫరవాలేదులే, కానివ్వండి. ఎందుకు కదలదో చూద్దాం." అంటూనే మళ్లా నెట్టటం ప్రారంభించాను. మరో అరవై గజాలు నెట్టుకుపోయాను. వళ్ళంతా చెమటలు కారిపోతున్నయ్. కారుమాత్రం కదలటం లేదు.

ఉన్నట్లుండి ఒక్కసారి కదిలింది కారు. బలమంతా దానిమీద మోపి ఉన్నానో ఏమో ముందుకు పడ్డాను. బ్రురుమని కారు అర ఫర్లాంగు ముందుకు పోయింది. నా వళ్ళంతా మట్టయి, దోక్కుపోయింది

అక్కడ ఆగింది కారు. లోపలనుంచి ఆయన తల బయటకు పెట్టాడు.

"సారీ సార్. ఇందాకటినుంచీ మిమ్మల్ని అనవసరంగా కష్టపెట్టాను. *Accelerator* నొక్కబోయి మరోటి నొక్కాను. అందుచేత ఇందాకటినుంచి 'స్టార్ట్' కాలేదు. ఒక్కసారి నొక్కగానే మీరు ముందుకు పడ్డారు. సారీసార్. దెబ్బలు తగిలాయా? పడదోయాలని పడదొయ్యలేదు." అనుకుంటూ స్టార్టు చేసుకొని వెళ్ళిపోయాడు.

Thanks కూడ చెప్పనందుకు నాకు కోపం వచ్చినమాట నిజం. కారు నంబరు వంక చూశాను. *M S P* 143291. ఆ రోజు కారే.

గాలివాననాటి మర్రిచెట్టుక్రింద దృశ్యం కళ్ళకు కట్టినట్లు కనుపించింది. దుమ్ముదులుపుకుంటూ హాస్పిటల్‌వైపు నడిచాను. ★

డొక్కా సీతమ్మ

(15-వ పేజీ తరువాయి)

సీత: (కళ్లనీళ్లతో) అయ్యయ్యయ్యో నా ప్రాణం పూరుకోలేదండీ. ఎంత ఆకలేస్తోందో. అదుగో వర్షం వెలిసింది. నేను వెళ్లి పెట్టివస్తాను.

భర్త: వెళ్ళబోకే నీ అఘాయిత్యం, పాడుబడ. తెల్లవారేలోపల చచ్చిపోతావే.

సీత: అట్లా కాదండి. ఆ కేకలో, ఎంత దీనత్వం, ఎంత బాధ వినిపిస్తోందండి. వెళ్లకపోతే నా చేతిమీదుగా ప్రాణం తీసినదాన్నౌతాను.

భర్త: ఏం పోతే, పోతాడు-భూమికి వెలితా.

సీత: అబ్బా! ఎంతమాటన్నారు. ఊరుకోండి. అవాచ్యం.

భర్త: (తనలో) అదెంగుకూరుకుంటుంది. మాట్లాడుతూనేవుంది అప్పుడే మూటగట్టింది అన్నం. (పైకి) అర్ధరాత్రి పురుగుపుట్ర వుంటాయే!

సీత: నన్నిహ మాట్లాడించబోకండి. ఆ మనిషికి అన్నం పెట్టేవరకూ నామతి మతిలో వుండదు.

భర్త: వెడుతున్నావూ! అమ్మయ్యో అమ్మయ్యో మళ్లీ వాన మూసుకువస్తున్నది. గొడుగైనా తెస్తానుండవే. నిన్నే నేవ్—లాంతరట్టుకొస్తున్నానుండూ. ఏమేవ్—వస్తున్నా వినిపించుకోదేం—అయ్యయ్యో సందు మలుపు తిరిగింది. ఇదుగో నే, లాంతరూ గొడుగూనూ. అయ్యయ్యో. ఎంత చీకటి-కన్ను పొడుచుకున్నా కనపట్టంలేదు. గోదావరి గట్టునిండా త్రాచుపాములు. ఎవరయ్యా మీరూ! ఇలా కొంచెం రండి. తాణేదారుగారా బాబు కాస్త తోడురండి. మాయింటావిడ అల్లా వెళ్ళిపోతూందండి.

పేరా: కర్ర చేతులోవుందా. పాములుంటయి.

భర్త: అదుగదుగదుగో ఆ గోదావరి ఒడ్డు. ఆ తుమ్మచెట్లల్లో కదుల్తూవుంది. చూడండి! వెళ్దాం. తొందరగా వెళ్దాం పేరాజు బాబూ! ఆ మనిషి చెపితే వినదు. ఎవడికో ఆకలేసిందట. ఆమట్టున లేచి పరుగెత్తుతూంది.

పేరా: అదేమిటండీ! గోదావరిలో దిగబోతున్నారు కూడాను. ఎంత మహాతల్లండీ సీతమ్మగారు.

భర్త: (భయంతో) పేరాజుబాబూ, అది మొసళ్లగుండంకూడానూ, మాయింటిది ఇహ నాకు దక్కదు. ఈ అర్ధరాత్రి గోదావరి ఈదుకువెళ్లి ఆ మాలవాడికి అన్నం పెట్టకపోతే యేం మునిగిపోయిందిబాబూ! నా ఖర్మం—ఈ వయస్సులో భార్యావియోగం కాబోలు!

పేరా: ఉండవయ్యా పిచ్చిబ్రాహ్మడా, ఆ సీతమ్మతల్లి కడుపు చల్లగాను, ఎంతమంది ప్రాణాలు రక్షించిందో.

భర్త: (కేక) ఏమేవ్! బాబోయ్—బాబోయి. ఆ గుండంవేపే వెళ్తూందండి. ఆ సుడిగుండం అక్కడ తాడిలోతుబాబూ గోదావరి!

పేరా: ఓ సీతమ్మగారూ!

భర్త: ఏమేవ్! ఆ పక్కకు వెళ్లబోకు. మొసళ్లు, మొసళ్లుంటయి.

(చప్పట్లు చరుస్తాడు)

పేరాజుబాబూ, అదుగో మునుగుతోందండీ. నా కొంప కూలిపోయిండి పేరాజు బాబూ!

పేరా: పరోపకారంకోసం ప్రాణాలర్పిస్తోంది మహాతల్లి.

భర్త: పరోపకార మేమిటయ్యా, నా కాపరం బంకలైపోయింది. అయ్యయ్యయ్యో.

పేరా: అదుగోనయ్యా తేలింది. పోయినకొద్దీ గోదావరి నడుములోతే వుంటూంది ఆమెకు. ఆహా!

భర్త: బాబు! తేలిందా బాబూ! నా సంసారం తేల్చిందన్నమాటే. అదుగో మెఱుపు! చూడు బాబూ!

పేరా: ఆహాహా ఆ శ్రీకృష్ణపరమాత్మ వారిని, వసుదేవులవారు తీసుకు పోతూంటే యమునాదేవి ఇలాగే యిచ్చిందట దారి. చూడవయ్యా వెర్రిబ్రాహ్మడా! మహా పతివ్రత. పరమ భక్తురాలు.

భర్త: అదుగో బాబు. ఒడ్డెక్కినట్టుందే. ఆ, అది గట్టెక్కితే, మాకష్టాలు గట్టెక్కినట్టే.

[గోదావరి ఒడ్డున చింతచెట్టుకింద ఒక మనిషి మూలుగుతూ ఉంటాడు.]

సీత: ఎక్కడనాయనా! నా ఖర్మం గాలి కంటికి కొంచెం మసకలుకూడాను యిక్కడేనా నా తండ్రీ

వ్యక్తి: (మూలుగుతూ) అమ్మా—సీతమ్మ—తల్లీ! ఇంకా రాలేదా తల్లీ! ఆకలితో చివరకు చావాలనివచ్చింది! అమ్మా. (మూలుగు)

సీత: ఇదుగో వచ్చా నాయనా! నా తండ్రీ వచ్చా! పులుసైపోయింది. కొంచెం గోంగూరపచ్చడి, అన్నమూ, పెరుగు చుక్క పట్టుకొచ్చా.

వ్యక్తి: ఊఁ... ఊఁ... ఏదైనా సరే. తల్లీ ప్రాణాలు దక్కితే...

సీత: దిక్కుమాలిన గొల్లముండ నెయ్యి పట్టుకురమ్మంటే పట్టుకొచ్చిందికాదు. నెయ్యిలేదుబాబు. ఎలాతింటావో ఏమో. ఇంటిదగ్గరైతే కాసిని పాలచుక్కలిద్దును.

వ్యక్తి: దగ్గరకు రాకు తల్లీ! ఆ మాట అక్కడ బెట్టమ్మా, నేను మాలవాడిని.

సీత: ఆకలికి కులమేమిటి నాయనా! యింటికివెళ్ళి ఎలాగూ స్నానంచేస్తానుగా! ఇదిగో ముద్దలు కలిపాను. తిను నాయనా, గొంతిక పడుతుందేమో, అరిచి, అరిచి వున్నావు. తిను నెమ్మదిగా.

నాఖర్మం కాలిపోను. చెంబు మరచి వచ్చా. ఎట్లా—దోసిలితో తెచ్చిపోస్తాలే నాయనా...యిక్కడేగా నీళ్లు.

వ్యక్తి: హమ్మయ్యా, యిప్పటికి ప్రాణాలు నిలిచాయితల్లీ! ఎంత రుచిగా ఉన్నాయి పదార్థాలు తల్లీ!

సీత: నాయనా! ఇదుగో ఆఖరుముద్ద! చేయి కడుక్కుంటాను. తూర్పురేఖ లాగుతున్నాయే. కొంచెము యీ చెట్టుకింద కూర్చుని మరీవెళ్లు. ఆ బట్ట లేపి యిటు తే! పిడిచి ఆరవేసిపోతాను. నేను వెళ్ళి వంటచేయాలె పెందరాడే. ఏనాతండ్రి ఆకలంటూ వస్తాడో బాబూ! 'ఆకలీ' అంటే నా పేగులు తరుక్కుపోతయిబాబు. అదేవిటో కడుపులో చెప్పరానంత బాధగా వుంటుంది. పిడికెడు మెతుకులు పెట్టానా, ఆ బాధ చేత్తో తీసివేసినట్టే పోతుంది.

వ్యక్తి: (సీతమ్మగారి రెండుకాళ్లు పట్టుకుంటాడు) అమ్మా! సీతమ్మతల్లీ.

సీత: ఇదేమిటి నాయనా! పాదాలు పట్టుకుంటావు. ఏమంత పెద్దవుపకారం చేశాననీ! ఆకలైతే అన్నం పెట్టాను. ఆకలేసేవారికే అన్నంగాని కడుపునిండినవారి కెందుకూ! ఇంతేనా. నా పిల్లల కాకలైతే పెట్టుకోనూ. విడిచిపెట్టు పాదాలు విడిచిపెట్టు నాయనా.

వ్యక్తి: అమ్మా యీ పరగణాకు నేను జమీందారుని.

సీత: అయ్యో! అయ్యో! రెడ్డిప్రభువులా తండ్రీ!

వ్యక్తి: తల్లీ! అపచారం చేశాను. నీ అన్నప్రదానాన్ని గురించి లోకమంతా చెప్పుకుంటున్నా, అనుమానించి పరీక్షింతామని వచ్చాను. క్షమించు. చాలా శ్రమ పెట్టాను. మీరు మీ తరతరాలవరకు ఇలాగే అన్నప్రదానం చేసేందుకు డొక్కా సీతమ్మగారి అగ్రహారం అనే పేరుతో యీ వూరు ఇచ్చేస్తున్నాను. నీవు సాక్షాత్తు అన్నపూర్ణాదేవివి. నీవంటి జగన్మాతలు నా పరగణాలో వుండబట్టే పరగణాఅంతా సుభిక్షంగా వుంది.

సీత: నాయనా! మా కెందుకూ అగ్రహారాలు. వాడిచ్చింది, వాడికే పెడుతున్నాం. దీన్నికూడా ఆ ఏలినవాడికే అర్పిస్తాను.

వ్యక్తి: మహారాజులని బిరుదులు పెట్టుకున్న వారెందుకు తల్లీ—నీవంటి లోకమాత ఒక్కతుంటే చాలదూ! ఆకలిమంట చల్లార్చటానికి. అదిగో ఆ భైరాగులు మఠంలో ఏంపాడుకుంటున్నారో వినమ్మ విను.

[దూరాన భైరాగుల మఠంలోనుంచి గేయం.]

ఎన్ని దానాలైన—అన్నదానంబోన
ఇన్ని నిష్ఠలు జపాలెందుకోగురుడ
పట్టెడన్నము పెట్టి బ్రతికించు సీతమ్మ
అట్టితల్లికి సాటి యగువారెగురుడా
రాజులంతా పోతరాజులాతింటారు
రోజంత సాధులూ రోదింత్రుగురుడా
డొక్కవారిలోవన్నె కెక్కినా సీతమ్మ
ఒక్కతే మనకెల్ల దిక్కు రాగురుడ. ★

ఒక్క గంట

(11-వ పేజీ తరువాయి)

దొంగ ఎవరంటే బుజాలు తడుముకున్నాట్ట!"

"ఇదుగో నువు ఏమిటో అనుకుంటున్నట్టున్నావ్ వీడితల్లో జేజెమ్మలు దిగిరావాలి వా సంగతి ఆమాకీ తియ్యడానికి."

"ఏమైనా మీరు చేసిన పనికి వాడి కడుపులో మండుతూనే వుంటుంది కదూ?"

"మండిమారణం గావాల్సిందే గానీ, వాణ్ణి పుతమేసినా యీగెడ్డమీద అడుగెట్టలేడు."

ముష్టివాడి ముందుకువచ్చి గజం దూరంలో కూర్చున్నాడు నీలగిరి. వాడి ధోరణి యథాపూర్వంగా సాగిపోతూనే వుంది. నీలగిరి చెయిచాచాడు. మంత్రదండంతో అరచేతి రేఖలు నిర్దేశిస్తూ, భవిష్యత్తుకు గాలం వేసి వెనక్కు-వర్తమానంలోకి, పడలాగుతున్నాడు ముష్టివాడు. తలవని తలంపుగా యీ కాలక్షేపం యేర్పాటయినందుకు సంగతి సందర్భాలన్నీ స్థిమితంగా కూచుని అడిగి తెలుసుకోవాలనుకున్నాడు నీలగిరి. ఎన్నిమార్లు కసిరికొట్టినా ఆమె వెనక్కు తగ్గలేదు. మాట తోచుకోనివ్వదు ప్రతి మాటకూ యతి అంటే ప్రతి, అంటూ కూర్చుంది.

"ఒక్క దెబ్బకి రెండు పిట్టలు పడ్డయ్. సాధనజేశారు షావుకార్లు, భవిష్యత్తు అరచేతులో వుంది. ఇప్పుడే చిటికెలో తేలిపోతుంది. ఒక్క దెబ్బకి రెండు పిట్టలు పడ్డయ్" అంటూ ముష్టివాడి ధోరణి అనర్గళంగా సాగిపోతున్నది.

"అబ్బి, షావుకారు గారికి పెళ్ళాలెందరమ్మా?" మనోరమ అడిగిన మాటతో తల తిరిగిపోయినట్టయింది నీలగిరికి. మొహం వెలవెలబారింది. అతడి నోటివెంట మాట రాకమునుపే ముష్టివాడందుకున్నాడు—

"అనగూడదండి, అనగూడదండి, గొప్పింటికోడళ్లు, కులంగల పడుచులు-అనగూడదండి" అంటూ ముక్కుమీద వేలేసుకుని తప్పు అభినయిస్తూ ఆ ప్రశ్ననుంచి వారింపజూశాడు మనోరమను.

"పోనీ...షావుకారుగారికి యెవరిమీదనైనా మనసున్నదేమో చెప్పగలవా?" అదే ప్రశ్న మరోకతీరుగా అడిగేసరికి పళ్లుపటపట కొరికాడు నీలగిరి.

"అయ్యయ్యయ్యో-నిప్పంటోరండి, నీలగిరిగారండి, ఆడితప్పరండి, ఆదికాలపు ప్రభువులండి" అంటూ గర్వసూచకంగా గడ్డం సవరించుకున్నాడు ముష్టివాడు.

"అవునే నువ్వు నిజమే చెప్పావ్. ఎవర్తెకన్నా మాటయిస్తే అది చెల్లించుకునేదాకా నిద్రపట్టదు కామా?" నువ్వెంతా అని లెక్కజెయ్యని వైఖరిలో నీలగిరి మొహం వంక జూసింది మనోరమ.

"తప్పు తప్పండి. ఒప్పులు జెల్లించాలండి. మంచిమాట లాడాలండి. కంచే చేను మేస్తే కాపరం సాగదండి. మరింత హెచ్చుస్థాయిలో వున్నత భావాలను ప్రకటించడం మొదలెట్టాడు ముష్టివాడు.

"షావుకారు బాసజేశారండి; భాగ్యలక్ష్మి పరుగెత్తుకొస్తోందండి!"

"పొద్దున్నేగా పరుగెత్తింది మళ్ళీ యెప్పుడొస్తుంది నాయనా?" ప్రతిమాటకీ పెడర్థం తీస్తున్నది మనోరమ. ముష్టివాడిలో యెన్నడూలేని ఉత్సాహమూ ధైర్యమూ ఉదయించినట్టున్నయ్. ఇద్దరూ కలిసి తనను మాటాడనీయక పోయేసరికి "చాలండి!!" అని కచ్చగా అరిచేసి అక్కణ్ణించి లేచి పోబోతున్నాడు నీలగిరి. ముష్టివాడు తడుముతున్నట్టు నటిస్తూ దగ్గరసా జరిగి అతగాడి చెయి పట్టుకున్నాడు.

"ఆ గండాగండి షావుకారుగారండి! అమ్మగారు నాటకమాడుతున్నారండి; నిదానించాలండి నిజం నిలకడమీద తేలుతుందండి!" అని చెప్పుకోపోతున్నాడు.

"మీదే వసమూతుంది!" అని చెయి విదిలించి కొట్టాడు నీలగిరి. అయినా వదలలేదు ముష్టివాడు. వదిలించుకోపోవడానికి పెనుగులాడుతున్నాడు నీలగిరి.

"కోపం పనకూడదండి తాపం మంచిది కాదండి! ప్రతాపుణ్ణి తలుచుకోవాలండి, పంతాలు పారిపోవాలండి, నిజం దెప్పాలండి, నాటక మాడకూడదండి, మంత్రదండం మహిమజూపుతుందండి!" ముష్టివాడి మాటకు అడ్డువచ్చి మనోరమ ఇలాఅన్నది—

"అన్నట్టు మరిచేపోయా, తగిలెయ్యమన్నారు కాదూ, చీపురుకట్ట సిద్ధంజేసే వుంచా. తీసుకొస్తానుండండి" అంటూ లోనికి వెళ్లబోతూ వుంది. ముష్టివాడు వికటాట్టహాసం జేశాడు. ఆమె ఉలికిపడింది.

"చాల్లే చెయివొదులు!" అని బిగ్గరగా అరిచాడు నీలగిరి.

"నాటక మాడకూడదండి. నిజం తేలిందండి, పాలల్లో నీళ్లు కలిశాయండి."

"నీ పిండాకూడు కలిశాయ్. చెయి వొదులు!" అని గదమాయించాడు నీలగిరి.

"నిలబడండిసార్!" ముష్టివాడి కంఠస్వరంలో మార్పు వచ్చింది. "జాతకం వినండి! ద్రోహం జరిగింది, మీకు దాహం యెక్కువయింది. దేశం మోహంలో పడిందనుకుంటున్నారు. నాటకమాడి కొటకం తెప్పించారండి. వేషం విప్పేస్తానండి, నిజం తేలుతుందండి!-ఇదివొక నాటకమే సార్!" అంటూ ఒక్క వూపులో గడ్డంతో సహా నెత్తిన ఉన్న జుట్టు ఊడబెరికేశాడు.

"నాటకం సార్...అంటూంటే అతని పెదవులమీద విజయసూచకంగా చిరునవ్వు చిందులాడింది.

"పెద్దిగాడు!!" అంటూ పెద్దపెట్టున ఒండ్రపెట్టాడు నీలగిరి. ఆ ప్రతిధ్వనికి డాబా దద్దరిల్లినట్టయింది.

గదిలోవున్న గడియారం తాపీగా, తొందర తెలియనట్టుగా నాలుగు గంటలు కొట్టింది. నిదానంగా నశించిపోతోంది. ★

దొరలు

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

వీరన్న ఇస్త్రీలాగూ దానిపైన పొడుగాటి కోటూ వేసుకొని, జరీ తలపాగా పెట్టుకొని హడావిడి గా తిరుగుతున్నాడు. పగలు రెండుగంట లయినా భోజనముచేయటానికి అంతవరకూ తీరుబడి కాలేదు. వీరన్న భార్య ఎల్లి వీరన్న రాకకు ఎదురుచూస్తూ వాకిటి గడపమీద చేతిగోళ్లను కొరుక్కుంటూ కూర్చున్నది.

ఆరోజు సాయంత్రము ఆరు గంటలకు వీరన్న నౌకరి చేస్తున్న క్లబ్బు భవనంలో సభ్యుల సమావేశము జరుగనున్నది. ఇటువంటి సమావేశాలు నెలకొకటివంతున జరుగుతూ ఉంటాయి. ఆ క్లబ్బు ఆవరణములోని తోటలో, లానుమీద కుర్చీలనూ బల్లలనూ అమర్చి, అక్కడక్కడ పూలచెట్లతో నిండిన తొట్లను పెట్టి అలంకరిస్తున్నాడు వీరన్న.

అంతలో కాంటీనునుండి పార్టికి కావలసిన సామగ్రితో ఇద్దరు మనుష్యులు వచ్చి వీరన్నను పిలచారు. ముఖముమీది చెమటను తుడుచుకొని, వాళ్లను లోపలికి తీసుకొని వెళ్లి సామానులన్నీ గదిలో పెట్టించాడు వీరన్న. సీసాలను బల్లమీద జాగ్రత్తగా భద్రపరచాడు. అప్పటికి నాలుగు గంటలు కావచ్చింది. ఎల్లి రెండుసార్లు భోజనము మాట వీరన్నకు జ్ఞాపకం చేసింది. పనిసందడిలో ఉన్న వీరన్న సరిగా కూర్చోకుండానే భోజనము ముగించి, ఎంగిలిచేతిని సరిగా కడుగుకోకుండానే తిరిగి తన పనిలో నిమగ్నుడై పోయాడు.

ఆ పట్టణము పేరెన్నికగన్న పట్టణాలలో ఒకటి. ఆ క్లబ్బుభవనము తెల్లదొరల పరిపాలనలో ఒక మండలాధికారియైన శ్వేతవర్ణునిచేత నిర్మింపబడినది. ఊరి బైటగా, ఎత్తయిన గుట్టమీద అందముగా కట్టబడినది. విశాలమైన భవనమూ, భవనములో మేలురకపు ఫర్నిచరూ, భవనము చుట్టూ రమణీయమైన పూదోటా, ఆవరణములో కుడి ప్రక్కగా ఈతకనువైన జలాశయమూ, దానిచుట్టూ పూపొదరిండ్లూ, భవనానికి ఎడమవైపుగా పెద్ద లానూ, దాని చుట్టూ సున్నము పూసిన ఇటుకల వలయమూ కన్నులపండువుగా ఉంటుంది. వివిధ వర్ణములైన పుష్పజాతులతో తోట ఘుమాయిస్తూ ఉంటుంది. ఆ భవనములో పరులకు ప్రవేశములేదు. ఆ భవనాంతర్భాగము ఎల్లా ఉంటుందని ఆ పురవాసులెవరైనా వీరన్నను అడిగితే, మా ఊరి బాపనయ్య కథలో చెప్పిన ఇంద్రభవనములా ఉంటుందని నోరు ఊరేటట్లు ముచ్చటగా చెప్తూ ఉంటాడు వీరన్న. ఆ ఊరివాళ్లు చాలామంది దానికి కోలాహలపర్వతమని పేరు పెట్టారు. ఆవరణములో ఒక ప్రక్కగా చిన్నయిల్లు కట్టించి, ఆ తోటనూ ఆ భవనమునూ భద్రముగా కాపాడటానికై భవనమును నిర్మించిన మండలాధికారి వీరన్నను నియమించాడు. తన కేర్పరచిన జీతముతో వీరన్న తృప్తిగా జీవిస్తూ ఆ భవనమును కనిపెట్టుకొని ఉంటున్నాడు. మొదలు మొదలు దొరలతోనూ దొరసానులతోనూ మాట్లాడటము చేతగాక చేతిసైగలతో కాలక్షేపము చేశాడు. కాని త్వరలోనే వ్యాకరణ ప్రశంస విడచి, స్వతంత్రముగా అంగిరీజు భాషలో సంభాషణ నేర్చుకొని, వ్యవహారము నడపుకొనటము ప్రారంభించాడు. వీరన్న తన ఇరవైరెండవఏట ఈ నౌకరీలో చేరాడు. ఇప్పుడతనికి తలంతా పండిపోయింది. అరవై సంవత్సరాలు సమీపించాయి.

ఆ క్లబ్బుకు మొదలు మొదలు అంతా తెల్లదొరలూ, దొరసానులూ వస్తూఉండేవారు. తరువాత, క్రమక్రమముగా నల్లదొరలు కూడా ప్రవేశించటము మొదలు పెట్టారు. ఆ క్లబ్బులో ఇంతవరకూ సుమారు ముప్పైమంది కార్యదర్శులూ అధ్యక్షులూ మారగా వీరన్న చూశాడు. అధికారవర్గమూ, సభ్యులూ తమకు తెలియనివివరాలు ఏమైనా వీరన్నను అడిగి తెలుసుకుంటూ ఉంటారు.

ఆ క్లబ్బుపేరు "నవ్వు-నవ్వించు".

సుమారు ఆరుగంట లయ్యేసరికి సభ్యులు ఒకొక్కక్కరే రావటము మొదలు పెట్టారు. సమావేశానికి కావలసిన సర్వసన్నాహము చేసి వీరన్న చేతులు కట్టుకొని గేటుదగ్గర నిలబడ్డాడు.

ఎల్లి అవయవసౌష్ఠవముగల ఇరువదేండ్ల పల్లెపడుచు. ఆరు తులాల బంగారమూ, నలభైతులాల వెండీ పెట్టి వీరన్న రెండు నెలల క్రిందట ఎల్లిని పెళ్లి చేసుకున్నాడు. వీరన్న తాళిగట్టిన పడుచులిద్దరూ వీరన్నకు సంతానము చూపెట్టకుండానే కాలము చేశారు. మూడవసారి చేసుకున్న ఎల్లి వీరన్నకళ్లకు మల్లెపువ్వులా కనబడుతున్నది. అక్కడికి రోజూ బంతి ఆడటానికి వచ్చే నల్లదొరసానమ్మలను చూసి, పాదాల దగ్గరికి చీరె కట్టుకోవటమూ, తల వెంట్రుకలు మెడల మీదికి ముడి వేసుకొని దానిమీద పువ్వులను అర్ధచంద్రాకృతిలో అమర్చుకోవటమూ ఎల్లి నేర్చుకొని ఇప్పుడిప్పుడే "పట్టణపు సోకు" నలవర్చుకుంటున్నది.

ఎల్లి వీరన్నదగ్గరికి వచ్చిన తరువాత క్లబ్బులో ఇది మొదటి సమావేశము. సభ్యులందరూ వచ్చిన తరువాత వీరన్న ఒకసారి తన యింటిలోపలికి వెళ్లి, "తలుపులు వేసుకొని లోపలే ఉండమ"ని ఎల్లికి గట్టిగా చెప్పి తిరిగి తన పనిలోకి వెళ్లిపోయాడు వీరన్న. తన కొరకు కూర్చోవద్దనీ, అన్నము తిని పడుకోమనీ మరీమరీ చెప్పి వెళ్లాడు.

ఏడుగంటల తరువాత ఎల్లి అన్నము తిని మంచముమీద పడుకొని దొర్లటము ప్రారంభించింది. ఎల్లికి ఒంటరి భయము. వీరన్న ఎంతసేపటికీ రాడు!

ఉన్నట్లుండి వెయ్యికుక్కలు ఒక్కసారిగా అరచిన శబ్దము ఎల్లికి వినపడగా, అదరిపడి మంచముమీద లేచి కూర్చున్నది. మరి కాసేపటికి వేయిపిల్లులు ఒక్కసారిగా

(44-వ పేజీ చూడండి)

మైలురాయి

శ్రీ బి. బసవారెడ్డి

స్టేషను ముందు రిక్షాలో కాళ్లు ముడుచుకుని పడుకున్న పెంటాలు ఆరోజు తన సంపాదన ఎంతో ఆలోచించుకుంటున్నాడు. పొద్దున ఒక ఆడమనిషిని... టాకీసు గొందిలో విడిచివచ్చాడు. మామూలుగా పావలాకన్నా ఎక్కువ ఇవ్వరు. బేరం చేస్తుందని అర్థరూపాయి చెప్పాడు. మాట్లాడకుండా ఎక్కి అర్థరూపాయి చేతిలో పెట్టింది. "చానామంచి బోణీ" అనుకున్నాడు పెంటాలు. తరవాత ఓకోమిటాయన గీసి గీసి బేరమాడి మూడణాలిచ్చాడు. తరవాత లావాటి ఎదవాబిడ, ఇద్దరు పసిపిల్లలు ముగ్గురూ ఎక్కి,... టాకీసుదగ్గర దిగారు. ససేమిరా పావలాకన్నా ఎక్కువియ్యనంది. సరే ఒప్పుకున్నాడు. ఆళ్లని లాగుతుంటే నరాలు తెగినయ్. "ఈళ్ల దగ్గర అర్థరూపాయి తీసుకున్నా దండగలేదు" ఆ వెధవాబిడ పావలా ఇవ్వటం చాలా అన్యాయమనిపించింది పెంటాలుకు. "పిసినారి ముండ! ఎద్దంత లావుంది. మళ్ళీ దీనికి తోడు ఇద్దరు పిల్లలు" కడుపుమండి తిట్టేసేడు. న్యాయం అన్యాయం ఏంటిలే? తను మాత్రం ఏం న్యాయిస్తుడు? పొద్దున ఆ అమ్మాయి దగ్గర అర్ధరూపాయి తీసుకోలా? "నువ్వియ్యాల్సింది పావలే నమ్మా! బేరమాడేతవని పావలా ఎక్కువ చెప్పాను. తీసుకోండి" అని తను తిరిగి ఇవ్వగలిగాడా?

డబ్బు గుణించుదామనుకున్న పెంటాలు ఇతర ఆలోచనలతో లెక్క మరిచిపోయాడు. ఆలోచనల్లోంచి తెప్పరిల్లి "పొద్దున ఆరణాలు, తరవాత పావలా, పదణాలు; మళ్లా ఒక మూడణాలు, ఒక బేడ, పావలా" ముందు ఎంచిన మొత్తాన్ని మరిచిపోయి తికమక పడ్డాడు పెంటాలు ఇలా రెండు మూడుసార్లు ప్రయత్నించినా విఫలమయింది. ఈ తంటా అంతా లేకుండా బొడ్లో డబ్బుతీసి ఎంచితే సరిగా తేల్తుంది. పొద్దుటినించి తిరిగి తిరిగి అలసటతో నడుంవాల్చిన పెంటాలు, లేచి బొడ్లో కట్టిన డబ్బు లెక్కించుకోటానికి బద్ధకించాడు. ఎదురెండ మోకాళ్లదాకా పడుతూవుంది. చుర చుర లాడుతున్న వి కాళ్లు. రిక్షాతిప్పి పడుకుంటే ఎండతగలదు. కొంచెం ఓపికచేసి లేస్తే డబ్బు ఎంచుకోవచ్చు, రిక్షా ఎండకు అడ్డంగా తిప్పి పడుకోవచ్చు. ఇలా ఆలోచించి, బద్ధకాన్ని విసిరివేసి లేచి నించున్నాడు. బొడ్లో డబ్బులు విప్పి చేతులో పోసుకున్నాడు. అంతా చిల్లర. "అరేయ్‌రిక్షా!" కేక వినిపించింది. "ఒస్తున్నా బాబుగారూ" అంటూ డబ్బులు మళ్లా బొడ్లో మూటకట్టి రిక్షా లాక్కెళ్లాడు దగ్గరికి. పిలిచిన పెద్దమనిషి సన్నటి గ్లాస్కో పంచ జరీఅంచుది కట్టుకున్నాడు. చేతిలో తోలు సంచీ వుంది. నేత్రాలకి కళ్లజోడు చలవదివుంది. ఎర్రగా లావుగా వున్నాడు. మనిషి నడివయసులో "ఎవరో చాలా స్థితివంతుడు" అనుకున్నాడు పెంటాలు.

"ఎక్కండి బాబుగారూ!"

"చౌకు దగ్గరకి వెళ్లాలి ఏమియ్యమంటావురా?"

"మీకు తెలవదా బాబుగారూ! ఎంతోకంత ఇద్దురుగాని ఎక్కండి బాబూ"

"వాగకుండా చెప్పరా ఎంతో" కఠినంగా ఆజ్ఞాపించాడు.

"పావలా దయ సేయించండి బాబూ. నేనేమి ఎక్కువడుగుతానా?" పెంటాలు దీనంగా అర్థించాడు.

"మూడణాలిస్తా" పక్కన సిద్ధంగా నించున్న రిక్షాల వాళ్లు అంతకే ఒప్పుకుని "రాండి బాబూ నేనుకడ్తాను" అంటున్నారు. గత్యంతరం లేక పెంటాలు ఒప్పుకుని, ఆయనని రిక్షా ఎక్కించుకున్నాడు. రెండడుగులు వేసిన తరవాత ఒకకిళ్లీ కొట్టుముందు ఆపమన్నాడు రిక్షాని.

"కేప్స్టెన్ పెట్టె ఒకటి తీసుకురారా" అని రూపాయి చేతికిచ్చాడు. ఈ పేరు పెంటాలు చాలా సార్లు విన్నాడు, ఇలాంటి సందర్భాల్లోనే. "పెద్దమనుషులంతా ఇంతే. తాము రెండడుగులేసి తెచ్చుకోలేరుగా మోసు"

సిగరెట్టుపెట్టె, మిగతా చిల్లర చేతికిచ్చాడు. "పదణాలు తీసుకున్నాడెవడ్రా? తొమ్మిదణాలన్నరేగా ఖరీదు. ఇంకో అర్ధణా రావాలి పట్రారా త్వరగా" అని గుర్రాన్నిలా తరిమేడు మళ్లా.


"వెధవ కాల్చిపారేసే సిగరెట్లకి వృధాగా తొమ్మిదణాలు తగలేసిన మనిషి, అర్థణాకోసం చచ్చిపోతాడుగామోసు! అది అలావుంచు. తనతో బేరమాడి ఒక అణా పిగిల్చకపోతే పావలా ఇస్తే వీడి కొంప ఏమి కూలిపోతుందో. సిగరెట్లరేటు నిజంగా పదణాలయితే చచ్చినట్టుకొనడూ? అప్పుడయితే అర్థణా పోయినందుకు దిగులుండదుగా మోసు" రిక్షాలాగుతో అనుకున్నాడు పెంటాలు. మిట్టమధ్యాహ్నం బజారులో ఎక్కువ జనం లేరు. పెంటాలు ఒంటిమీది చెమట బొట్లు బొట్లుగా జారి బలమైన సిమెంటు రోడ్డు మీద పడుతోంది.

పెంటాలు అజాగ్రతగా రిక్షా పోనిస్తో ఆలోచిస్తున్నాడు.

అణాకోసం, అర్థణాకోసం ఇలాంటి డబ్బున్నవాళ్లు పీక్కటం ఏహ్యంగా తోచింది. తన బోటివాడైతే ఆ విషయం వేరు. వేలకు వేలు ఖర్చుపెట్టే మనుషులు అర్థణాలు, కానులు లెక్కచూసుకోవటం పెంటాలుకు బొత్తిగా నచ్చలేదు. తనకి ఈ రిక్షాలో కూర్చున్న పెద్దమనిషికున్నంత డబ్బుంటే ఇలా చేసేవాడా? రిక్షావాడు ఎంత అడిగితే అంత పారేసేవాడు. కిళ్లీకొట్లో సిగరెట్టుకొని వాడు ఎంత చిల్లరిచ్చాడో లెక్క చూసుకోకుండానే నిర్లక్ష్యంగా జేబులో పడేసుకునే వాడు.

రోజుకు రూపాయిడబ్బులు పిగల్చలేని


(37-వ పేజీ చూడండి)



"మళయాళ మంత్రం"

రచన శ్రీ గణపతి రాధాకృష్ణమూర్తి

ఉజ్జయినీ పుర
రాజ్యము నేలే
సజ్జనపాలుని
ఖజానాలోని
జవాహిరెవరో
కాజేశారు.
ఎంత వెతికినా
అంతే చిక్కక
మంత్రీ, రాజూ
మంతనమాడి
దొంగనుబట్టే
'ప్లానే'శారు.
రాజ్యములోనీ
ప్రజలందరికీ
మూరెడు మూరెడు
కఱ్ఱలు యిచ్చి
గట్టిగ యిట్లా
సాటించారు:
"దొంగెవరైతే
వాడి కఱ్ఱయే
తెల్లవారితే
పెరుగును జానెడు -
తంత్రం, యంత్రం
మలయాళ మంత్రం"
జావైపోయిన
నిజమైన దొంగ
ఆరోజు రాత్రి
కునుకే తియ్యక
తప్పించుకొనే
'ఎత్తే'శాడు.
మూరెడు కఱ్ఱలో
జానెడు నరికితె
తెల్లవారితే
జానెడు పెరిగీ
యథాతథా, ఔ
ననుకొనెను.
కఱ్ఱను నరికీ
గుట్టులు పెట్టీ
వేకువజామున
టీకుటాకుగా
కోటకు నడిచెను.
మొట్టమొదటనే
అట్టహాసముగ
తన పొట్టికఱ్ఱ
నిట్టేయివ్వగ,
దానితోడనే
వాడి దేహమును
చట్నీ చట్నీ చేశాడు.



కాంచనద్వీప పటం: ఈ ద్వీపం ఎక్కడఉందో తెలిపే అక్షాంశ, మధ్యాహ్న రేఖలు నాచే కొట్టివేయబడెను—జిమ్‌హాకిన్స్.

"నిజమే. ఇక్కడే ఎక్కడో దొరుకుతారు. వాళ్ల కొవ్వొత్తి ఇంకా వెలుగుతూనే. ఉంది," అని మేడమీది కిటికీలోనుండి ఒక డన్నాడు.

"ఇల్లంతా వెదకండి. ఆలస్యం చెయ్యకండి," అన్నాడు ప్యూ మళ్ళీ.

వెంటనే దొంగలు ఇల్లంతా మాకోసం వెదక సాగారు. కుర్చీలు, బల్లలు, మంచాలు, గిన్నెలు, ప్లేట్లు అన్నీ తిరగదోశారు; తలుపులు బద్దలుగొట్టారు. ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా ఉన్నందువల్ల వాళ్ల కోలాహలం, వాళ్ల కేకలు, మాటలు అన్నీ నాకు స్పష్టంగా వినిపిస్తున్నాయి. చివరికి లోపలివాళ్లందరూ ఒకరితరవాత ఒకళ్లు రోడ్డుమీద కొచ్చారు. మేమెక్కడా కనిపించలేదని ప్యూతో చెప్పారు. ఇంతలో దూరంనుండి రెండుసార్లు విజిల్ విని

పించింది. మాఅమ్మ కెప్టెన్‌డబ్బులెక్కిస్తున్న సమయంలో వినపడిన శబ్దమే అది. అది గ్రామం దిశనుండి వినవస్తోంది. బహుశా దొంగల ముఠాలోవాడే ఎవడో రాబోయే అపాయాన్నిగూర్చి వాళ్లను హెచ్చరిస్తున్నాడల్లే వుంది. ఎందుకంటే ఆ విజిల్ వినగానే దొంగలంతా హడిలిపోయారు.

“అదుగో, మనవాడు ఈల వేస్తున్నాడు. రెండుసార్లుకూడా వేశాడు. మనం పారిపోవాలి,” అన్నాడొకడు.

“పారిపోతావా? పందివెధవా! పిరికివాణ్ణి తీసికెళ్లి అక్కడ కాపలా పెడితే ఏమౌతుంది? హోటలువాళ్లు ఇక్కడే ఉంటారు. వెదకండి. తొందరగా. నాకే కళ్లుంటేనా—”

ఫ్యూఆజ్ఞ వినగానే మళ్ళీ దొంగలు ధైర్యం తెచ్చుకుని ఇంటిచుట్టూరా వెదకసాగారు. కాని గుడ్డివాడికి జడిసిమాత్రమే వెదుకుతున్నట్లు, అవసరమైతే క్షణంలో ఉడాయించడానికి చూస్తున్నట్లు అనిపించింది.

“తెలివితక్కువ గాడిదల్లారా! ఆ కాగితం దొరికితే కొన్ని లక్షలపౌనులు మన స్వాధీనమవుతాయి. చచ్చేవరకూ మహారాజభోగాలనుభవించగలం. అది ఇక్కడే ఎక్కడో ఉందని మీకు తెలుసు అయినా, వెదకండిరా అంటే తెగనీలుగుతున్నారు. మీకోసం కాకపోతే నాకోసమా ఇదంతా? మీలో ఒక్కడైనా ధైర్యంచేశాడూ బిల్ ఎదట పడటానికి? నేను ధైర్యంచేశాను. నేను వెళ్లాను ఒక్కణ్ణే. రెండు కళ్లూలేని గుడ్డివాణ్ణి నేను ధైర్యంచేశానురా! ఇంతా కష్టపడితే ఏమిటిరా నాకు వచ్చేది! జీవితమంతా బిచ్చమడుక్కుంటూ గడపాల్సిందేగద. మీలో మొగతనం ఏమన్నావుంటే వెదకండి, పట్టుకోండి, ఆ కాగితాన్ని” అని పురికొల్పుతున్నాడు ఫ్యూ.

“కాదురా ఫ్యూ! ఆ ఉన్నడబ్బు కాస్తా పట్టుకుపోతే ఏం?” అని గొణిగాడు ఒకడు.

“వాళ్ళనిప్పుడు ఎక్కడని పట్టుకోగలం? సగం వాటా తీసుకుని నీ దారిన నువ్వు పో,” అని ఇంకోడు గుడ్డివాడికి సలహా ఇచ్చాడు.

“నీ దారిన నువ్వు పో,” అనేమాట వినబడేసరికల్లా గుడ్డివాడి కెక్కడలేని కోపం వచ్చింది. నోటికి వచ్చిన తిట్లల్లా తిడుతూ, కర్రతో చేతికందినవారినల్లా ఇష్టంవచ్చినట్టు బాదాడు. దొంగలు ఫ్యూచేతులోంచి కర్ర లాక్కోవాలని చాలా ప్రయత్నించారు. కాని గుడ్డివాడు పిచ్చిఆవేశంలో స్వైర విహారంచేశాడు. ఈపోట్లాటమూలంగా మాకు ప్రమాదం పూర్తిగా తప్పిపోయింది. కొంతసేపటికి మళ్ళీ ఏదో ధ్వని వినవచ్చింది. ఈసారి విజిల్‌ధ్వని కాదు; గ్రామం దిశనుండి గుర్రాలు వస్తున్న టకటకశబ్దం వినిపించింది. మరునిమిషంలో పిస్టల్ పేలిన మెరుపు, ధ్వని వచ్చాయి. వెంటనే దొంగలు ఎక్కడివాళ్లక్కడ చెల్లాచెదరైపోయారు. ఒకడు సముద్రతీరంకేసి, మరొకడు కొండలకేసి ఇల్లా తలోదిక్కుకూ పారిపోయారు. ఒక్కఫ్యూ తప్ప ఇంకెవ్వరూ మాహోటల్‌సమీపంలో లేరు. వాడిమీద కసికొద్దినో, లేక తమప్రాణం తాము రక్షించుకొనేందుకో మొత్తానికి వాడి అతిగతి కనుక్కోకుండా అంతా పారిపోయారు. వాడు భయావేశంలో తానెక్కడుందీ, ఎటువైపు తిరిగివుందీకూడా అంతుపట్టక కర్రతో నేలతట్టుతూ తన స్నేహితులను పిలిచాడు. చివరికి పొరపాటున గ్రామందిశగా బయల్దేరాడు. వంతెనకూడా దాటాడు.

“జానీ! నల్లకుక్కా! డర్క్! ఏమయ్యార్రా మీరంతా? నన్ను వదిలేసి పోయారా? గుడ్డివాణ్ణి, చిన్నప్పటినుంచీ మీతో తిరిగినవాణ్ణి నన్ను వదిలిపోయారా? జానీ!—” అంటూ ఇంకా కొన్ని అడుగులు ముందుకు నడిచాడు.

గుర్రాల ధ్వనులు ఇంకా సమీపించాయి. నలుగురైదుగురు మనుషులు గుర్రాలను అతివేగంగా పరిగెత్తిస్తూ వెన్నెల్లో కనిపించారు.

ఫ్యూ తనపొరపాటు గ్రహించాడు. ఒక్క వెర్రికేకవేసి వెనక్కి తిరిగాడు. తూలుతూ పరిగెత్తడంలో రోడ్డుపక్కనున్న గోతిలో పడ్డాడు. మళ్ళీలేచి నాలుగు ప్రదక్షిణాలుచేసి చివరికి పరుగెత్తుకొస్తున్న గుర్రాలకు అభిముఖంగా పరిగెత్తసాగాడు.

అన్నిటికంటే ముందున్న గుర్రంమీదమనిషి ఫ్యూను రక్షించడానికి ప్రయత్నించాడు. కాని కళ్లెం ఎంతలాగినా రోడ్డు వాలుగా ఉండటంచేత గుర్రం వేగాన్ని ఆపుకోలేకపోయింది. మొదటిగుర్రం ఫ్యూను ఒక్కతాపుతో నాలుగు గజాల అవతలకు

గెంటివేసింది. తరవాత గుర్రాలు అతన్ని హూనం హూనంగా తొక్కివేస్తూ ముందుకు పోయి ఆగాయి. ఫ్యూ కాస్త కదిలి బోర్లగిలపడ్డాడు. మళ్ళీ కదల్లేదు; మంచినీళ్లడక్కుండా చచ్చిపోయాడు.

నేను గట్టుమీదనుండి రోడ్డుమీదకురికి సంతోషంతో ఎలుగెత్తి కేకవేశాను. అప్పటికివాళ్లు గుర్రాలు దిగి వెనక్కి వస్తున్నారు. వాళ్లలో ఒకణ్ణి నేను గుర్తుపట్టాను. మా కబురు అందజేయడానికి డాక్టర్ లివ్‌సే ఇంటికివెళ్లిన మనిషే. అతడు. మిగతా వాళ్లు రివిన్యూఅధికారులు. వాళ్లను అతడు దోవలో కలుసుకున్నాడు. డాక్టరు ఇంటివరకూ వెళ్లడం అనవసరమని వాళ్లను వెంటపెట్టుకుని తిరిగివచ్చాడు. సూపర్‌వైజరు డాన్సు ఏదో పనిమీద మిగతా అధికారులతో మా గ్రామానికి వస్తున్నారు. వారు సమయానికి రాకపోతే నేను, మాఅమ్మ ఏమైపోయేవాళ్లమో!

ఫ్యూ చనిపోయాడు. మాఅమ్మ వంతెన నీడలో ఇంకా మూర్ఛపోయేవుంది. ఆమెను గ్రామానికి చేర్చాము. కొంతసేపు ఉపచారాలు చెయ్యగా ఆమెకు తెలివివచ్చింది. స్పృహ వచ్చీరాగానే మాకింకా రావలసిన బాకీనిగూర్చే మాట్లాడ మొదలెట్టింది. నేను గట్టిగా మందలించి ఊరుకోబెట్టాను. తరవాత నేను సూపర్‌వైజర్‌తోను, మిగతా అధికారులతోను కలిసి మా "ఎడ్మిరల్ బెన్‌బౌ"కు వెళ్లాను. భూకంపంలో నాశనమైన ఇల్లుకూడా ఆస్థితిలో ఉండదు. దొంగలు మాకోసం వెదుకుతూ నానా బీభత్సంచేశారు. ఆ వెదకడంలో ఆఖరికి గోడ గడియారంకూడా కిందకి లాగేశారు. అయితే మా వస్తువులేమీ పోలేదు. కెప్టెన్ డబ్బుసంచీ, జేబులోని వెండినాణాలు మాత్రమే దొంగిలించబడ్డాయి. ఈగల్లంతంతా ఏమిటో సూపర్‌వైజర్ డాన్సుకు అంతుపట్టలేదు.

"డబ్బు ఎత్తుకుపోయారన్నావుగదా? మరి ఇంత హడావిడిచేశారెందుకూ? ఇంకా ఎక్కువ డబ్బుకోసమా?" అని అడిగాడు డాన్సు.

"కాదండి సార్, డబ్బుకోసం కాదనుకుంటాను, బహుశా నాజేబులోవున్న ఈ పార్సిల్ కోసం అనుకుంటాను ఈ హడావిడంతా," అని సమాధానమిచ్చా నేను, పార్సిల్ చూపిస్తూ.

"కావచ్చు, ఏదీ చూడనీ...నాదగ్గిర ఉంచుతానిది."

"వద్దండి. డాక్టర్ లివ్‌సేగారికి చూపించాలనుకున్నాను."

"రైట్! అవును, ముందాయనకి చూపించడం మంచిది. ఆయన జిల్లా మేజిస్ట్రేటుకూడాను. అసలు నేనుకూడా ఇప్పుడేవెళ్లి జరిగినదంతా డాక్టరుగారికిగాని, జమీందారు గారికిగాని రిపోర్టు చెయ్యడం మంచిదనుకుంటాను. ఫ్యూ మహాశయుడు చచ్చిపోయాడుగదా! వాడు చచ్చిపోయినందుకు నేను విచారిస్తున్నాననికాదు; లోకులు పలువిధాల చెప్పుకోవచ్చు దాన్నిగూర్చి. అతడు చనిపోవడంలో నాతప్పేమీ లేదని ఋజువు చేసుకోవలసివుంది. సరే హాకిన్స్! నీకిష్టమైతే నాతోరా. డాక్టరుగారింటికి తీసుకు వెడతాను."

మిస్టర్ డాన్సుకు కృతజ్ఞత తెలిపాను. మళ్ళీ గ్రామానికి వెళ్లాము. నేను డాక్టరుగారింటికి వెడుతున్నానని, 'ఈ రాత్రికి వస్తే వస్తాను, లేకపోతే రా' ననీ మాఅమ్మతో చెప్పాను. నేను అధికారుల్లో ఒకరి గుర్రాన్నెక్కాను. మిస్టర్ డాన్స్ ఆజ్ఞ ఇవ్వగానే గుర్రాలన్నీ హుటాహుటిగా డాక్టరుగారింటివైపు దౌడు తీశాయి.

6. కెప్టెన్ కాగితాలు

డాక్టర్ లివ్‌సేగారి ఇల్లు చేరుకున్నాం. లోపల అంతా చీకటిగాఉంది. మిస్టర్ డాన్స్ తలుపు తట్టాడు. నౌకరొకడువచ్చి తలుపు తీశాడు.

"డాక్టరుగారున్నారా?" అని అడిగాను.

డాక్టరుగారింట్లో లేరనీ, మధ్యాహ్నమే జమీందారుగారింటికి వెళ్లారనీ, ఇంకా అక్కడే ఉండి ఉంటారనీ నౌకరు సమాధాన మిచ్చాడు.

"అక్కడికే వెడదాం, పదండి," అని మిస్టర్ డాన్స్ అన్నాడు.

జమీందారుగారిల్లు అట్టే దూరంలేదు. అందుచేత నేను మళ్ళీ గుర్రం ఎక్కకుండా వారిపక్కనే నడిచాను. జమీందారుగారి భవనం వెన్నెలలో ఒక పెద్దకొండవలె కనిపించింది. గేటుదాటి విశాలమైన ఆవరణగుండా మెట్లెక్కి కేకవేశాము. మిస్టర్ డాన్స్ జమీందారుగారిని చూడగోరుతున్నామని ఒక నౌకరు

ద్వారా లోపలికి కబురు పంపించాడు. తరవాత ఆ నౌకరే మమ్మల్ని లోపలికి తీసుకుపోయాడు. తివాసీలు పరిచిన నడవగుండా వెళ్లాము. లైబ్రరీగదిలో లైట్లు ధగధగ వెలుగుతున్నవి. ఎత్తైన బీరువాలలో అందంగా బైండుపుస్తకాలు అమర్చబడి వున్నాయి. జమీందారుగారు, డాక్టరుగారు చలిమంటకు దగ్గరగా చెరొక కుర్చీలోను కూర్చున్నారు. ఇద్దరి చేతుల్లోను పొగాకు పైప్‌లున్నాయి.

జమీందారుగారిని అంతదగ్గిర్నించి నేనెప్పుడూ చూడలేదు. దాదాపు ఆరడుగుల ఎత్తు, దానికితగ్గ లావు కలిగి మంచి గంభీరంగా కనిపించారు. కళ్లు తీక్ష్ణంగా ఉన్నాయి. ముఖంలో కొంచెం మొరటుదనం కనిపిస్తుంది.

"మిస్టర్ డాన్స్! లోపలికి రా," అని జమీందారుగారు తీవిగా ఆహ్వానించారు.

"గుడ్ ఈవెనింగ్ డాన్స్! గుడ్ ఈవెనింగ్ జిమ్! ఏమిటి ఇలా వచ్చారు అకస్మాత్తుగా," అని డాక్టరుగారు అడిగారు.

సూపర్‌వైజర్ డాన్సు శాల్యూట్ చేసి మా హోటల్లో జరిగిన వృత్తాంతం యావత్తూ వివరించాడు. వారిద్దరూ అత్యాసక్తితో మాకథ విన్నారు. గుడ్డివాడు గుర్రాలకిందపడి చనిపోయాడన్న సంగతి చెప్పేసరికి జమీందారుగారు "సెబాష్. మంచిపని చేశావు. వాణ్ణి వేరే ఉరితీయవలసిన అవసరం లేకుండా చేశావు," అని మెచ్చుకున్నారు. ఆపదలో చిక్కుకున్న నన్నూ, మా అమ్మను కాపాడినందుకు అతన్ని చాలాసేపు అభినందించారు. డాక్టరుగారు నన్నడిగారు:

"జిమ్! దొంగలు వెతుకుతున్న పార్సిల్ నువ్వు దాచావన్నావు గదూ?"

"అవునండి. ఇదిగో నాజేబులోనే వుంది," అని పార్సిల్ తీసి ఇచ్చాను.

డాక్టరుగారు దాన్ని అన్నివేపులా పరీక్షించారు. ఆయన దాన్ని తెరుద్దామా, వద్దా అని సందేహిస్తున్నట్లు తోచింది. చివరకిలా అన్నారు:

"మిస్టర్ డాన్స్! నీకు చాలా పనివున్నట్లున్నది. నువ్వు ఇక వెళ్లు జిమ్‌హాకిన్స ఈ రాత్రి ఇక్కడే వుంటాడు." జమీందారుగారు మళ్ళీ డాన్స్‌ను అభినందించారు. అతడు శాల్యూట్ చేసి తనతోటి అధికారులతో కలిసి వెళ్లిపోయాడు. జమీందారుగారు నాకు భోజనం తెప్పించారు. ఆసాయంత్రం జరిగినవింత

అనుభవాలతో నాకు అంతవరకు ఆకలి తెలియనే లేదు. భోజనం చూడగానే ఎక్కడలేని ఆకలి వచ్చింది. కడుపునిండా ఆరగించాను. ముగ్గురం స్థిమితంగా కూర్చున్నాం.

"సరే, జమీందార్ ట్రెలానీ!—

"సరే, డాక్టర్ లివ్‌సే!—" ఇద్దరు ఒకే సారిగా ఒకరినొకరు సంబోధించారు.

"ఆ, ఆ, ఒకళ్లతరవాత ఒకళ్లు," అని డాక్టరుగారు నవ్వుతూ అన్నారు. "ట్రెలానీ! ఈఫ్లింట్‌ను గూర్చి నువ్వు విన్నావుగదూ?"

"విన్నానా?—వినడమేమిటోయ్ డాక్టర్? అంత పరమకిరాతకుడు, దుర్మార్గుడు, హంతకుడు ఈ భూప్రపంచంలో ఇంకోడు లేడనుకో. స్పెయిన్ దేశంవాళ్లకి ఫ్లింట్ పేరు చెబితే హార్, హార్. అంత గొప్ప సముద్రపుదొంగ ఇంగ్లీషువాళ్లలో పుట్టినందుకు నేనప్పుడప్పుడు గర్వపడేవాణ్ణి కూడా. ఇంతెందుకూ? ఒకసారి వాణ్ణి ట్రినిడాడ్‌లో చూశాను. ఓరి వీణ్ని సరి కెయ్య! ఎల్లా ఉన్నాడనుకున్నావ్?"

"వాడిపేరు నేనుకూడా చాలాసార్లు విన్నాను. అదికాదు మనకిప్పుడు కావలసింది. ఫ్లింట్ ఏమన్నా డబ్బు గడించాడా?"

"డబ్బా! నీకు తెలియదేమిటి? ఇప్పుడీ దొంగలు దేనికోసం ప్రయత్నిస్తున్నారనుకున్నావ్? డబ్బుకోసం కాకపోతే వాళ్లింత తెగించి దేనికొచ్చారనుకున్నావ్?"

"త్వరలోనే తెలుస్తుంది ఆసంగతి. నువ్వు నన్ను మాట్లాడనివ్వవేం? ప్రతిమాటా అలా ఆశ్చర్యార్థకాలతో మాట్లాడితే నేనేం మాట్లాడేది? నేనడిగేది ఇది—ఈపార్సిల్‌లో ఫ్లింటుగడించిన డబ్బు ఎక్కడుందో తెలిపే కిటుకు ఏదన్నా ఉంటుందనుకో. దానికోసం ప్రయత్నించడం లాభసాటి అవుతుందా, కాదా?"

"లాభమా? ఏమిటి నీ ఉద్దేశ్యం? ఫ్లింట్ ఏమాత్రం సంపాదించాడని నీ అభిప్రాయం? కొన్ని లక్షలుపైగా ఉంటుంది. ఆ కిటుకే గనక నిజంగా దొరికితే ఈ క్షణంలో నేను బ్రిస్టల్ వెళ్ళి ఓడ కొనేసి రెడీగా ఉంచుతాను. రెండు రోజుల్లో నువ్వు, నేను, హాకిన్సు బయలుదేరి ఆ స్థలానికి వెడతాం. ఒక ఏడాదిలో ఫ్లింట్‌డబ్బును పట్టుకోకపోతే నాపేరు ట్రెలానీ కాదు."

"సరే," అన్నారు డాక్టరుగారు. "జిమ్ అనుమతిమీద ఈ పార్సిల్ విప్పుదాం," అంటూ పార్సిల్‌ను బల్లమీద పెట్టారు. దగ్గర దగ్గరగా కుట్టబడినందున పార్సిల్ విప్పడం సాధ్యంకాలేదు; చాకుతో కుట్లు కోసివేయవలసి వచ్చింది. అందులో ఒక పుస్తకం, సీలు వేయబడిన ఒక కాగితం ఉన్నాయి.

"ముందు పుస్తకం చూద్దాం," అన్నారు డాక్టరుగారు.

నేను, జమీందారుగారు డాక్టరుగారి బుజాల మీదుగా వంగి ఆత్రంగా పుస్తకంకేసి చూస్తున్నాము. డాక్టరుగారు వెనక్కితిరిగి మమ్మల్నిచూసి, నవ్వి, కుర్చీలు వేసుకు కూర్చోండన్నారు. బల్లదగ్గిరగా కుర్చీలు లాక్కున్నాము.

మొదటి పేజీమీద పిచ్చిగీతలున్నాయి. చేతిలో పెన్సిలువుంటే ఏమీ తోచనివాడు గీసిన గీతలవలె ఉన్నాయి. రెండో పేజీలో "మిస్టర్ విలియం బోన్స్, తండేలు" అని ఉన్నది. ఇంకో పేజీలో "ఇక రమ్ తాగను," అని రాయబడివుంది. ఇంకా ఏమిటో అక్షరాలున్నాయిగాని స్పష్టంగా తెలియటం లేదు.

"ఉహు. ఇందులో మనకి పనికివచ్చేదేం లేదనుకుంటాను," అని డాక్టరుగారు పేజీ తిప్పారు.

తరవాత పది పన్నెండు పేజీలవరకూ జమాఖర్చుల పద్దు వ్రాయబడివుంది. మనుషుల పేర్లుగాని స్థలాలపేర్లుగాని ఎక్కడా లేవు. మనుషులపేర్లు ఉండవలసినచోట్ల ప్లస్‌గుర్తులు, స్థలాలపేర్లు ఉండవలసినచోట్ల అక్షాంశరేఖలు, మధ్యాహ్నరేఖలు మాత్రమే ఉన్నాయి.

"ఏమిటో యీ గొడవంతా? తలా తోకా లేకుండా ఉంది," అన్నారు డాక్టరుగారు.

"ఇది ఆ తాగుబోతు పద్దు పుస్తకం. ప్లస్ గుర్తులు సముద్రపు దొంగలు దోచుకున్న పట్టణాలనో ఓడలనో తెలియజేస్తాయి. ఈ పైకం అంకెలు వాడి వాటాకు వచ్చినడబ్బు అయివుంటుంది. చూడరాదూ,

ఏళ్లు గడిచినకొద్దీ వా డెంత ధనవంతు డయ్యాడో ఈ అంకెలే తెలుపుతున్నాయి.'' అన్నారు జమీందారు గారు ఒక గొప్ప అపరాధపరిశోధకుడిలా మొహం పెట్టి.

''రైట్! అంతే. నీ దేశసంచారపు అనుభవం ఇప్పుడు పనికివస్తోంది. బోన్స్ మహాశయుడు చాలా పొదుపరిలా గున్నారు. అంతాజమే తప్ప ఖర్చు కని పించడంలేదు.'' అన్నారు డాక్టరుగారు.

ఆపుస్తకంలో ఇంక చూడవలసిందేమీ లేదు. చివర వివిధదేశాల నాణాలకూ ఇంగ్లీషునాణాలకూ విలువల మానం తెలియజేస్తూ ఒకపట్టిక మాత్రం వున్నది.

''సరే. ఈ కాగితం తీసి చూద్దాం ఇహ,'' అని డాక్టరుగారు అతి జాగ్రత్తగా సీళ్లు తీసివేశారు. ఒక ద్వీపపటం కనిపించింది. అక్షాంశ రేఖలు, మధ్యాహ్నరేఖలతో సహా దాని ఉనికిపట్టు, ద్వీపం లోని కొండలు, సింధుశాఖలు, అఖాతాలు, ఇంకా ఇతర వివరాలన్నీ వ్రాయబడివున్నాయి. ద్వీపం తొమ్మిది మైళ్లుపొడుగు, అయిదుమైళ్ల వెడల్పు ఉండ వచ్చును. ఒక లావుపాటి రాక్షసుడు నుంచున్నట్టుగా వుంది దాని ఆకారంచూస్తే. రెండు చక్కని రేవు లున్నాయి. పడమటివేపున ''టెలిస్కోప్ కొండ'' అని ఎత్తైనకొండ ఒకటుంది.

ద్వీపం ఉత్తరభాగంలో ఎర్రసిరాతో రెండు ప్లస్ గుర్తులున్నాయి. నైర్ ృతి భాగంలో ఒకప్లస్‌గుర్తు "గుప్తధనం—1,00,000 పౌ॥"అని ఎర్రసిరాతో రాయ బడివున్నది.

ఈపటం చూడగానే డాక్టరుగారు, జమీం దారుగారు సంతోషాతిరేకంలో మైమరిచి పోయారు.

"లివ్‌సే! నీ వెధవ డాక్టరువృత్తి మానెయ్. రేపు నేను బ్రిస్టల్‌కు పరిగెత్తుతున్నాను. మూడు వారాలు—మూడువారాలు!—రెండు వారాల పది రోజుల్లో ప్రపంచంలోకల్లా గొప్పఓడను, కళాసీలను సంపాదిస్తాను. హాకిన్స 'ఓడనౌకరు'గా వస్తాడు. జిమ్! ఓడనౌకరుగా నువ్వు బలేఅద్భుతంగా ఉంటావు. లివ్‌సే! నువ్వు ఓడ డాక్టరుగా ఉందువుగాని. నేను ఓడకు సర్వాధికారిగా ఉంటాను. మాఇంటి జమాన్లు రెడ్రూత్, జాయిస్, హంటర్‌లను కూడా తీసుకు పోదాము. మన ఓడకి గాలులు అనుకూలంగా ఉం టాయి. కొద్దిరోజుల్లో ద్వీపం చేరుకోగలం; గుప్త ధనాన్నిట్టే కనుక్కుంటాం. ఇంక ఒక్కొక్కళ్లు తినగలిగినంత డబ్బుతినేద్దాం. ఓ—బలే, అద్భుతం, మహాద్భుతం, పరమాద్భుతం—''

జమీందారుగారి ఉపన్యాసాని కడంవచ్చి డాక్టరుగారు, ''ట్రెలానీ! నేను నీతో ప్రపంచం చివ రలవరకూ రమ్మన్నా వస్తాను. జిమ్‌కూడా వస్తాడు. కాని నాకొక మనిషి అంటే భయంగా వుంది,'' అన్నారు.

''ఎవడా దుర్మార్గుడు? ఎవడా కుక్క? చెప్పు ఈక్షణంలో వాణ్ని—''

''నువ్వే. నువ్వంటే నాకు భయంగా వుంది. నీకు నోట్లో నువ్వుగింజ నానదు. ఈ ద్వీపాన్ని గురించి తెలిసినవాళ్ళం మన ముక్కుళ్ళమే కాదు. ఈ రాత్రి హోటలును ముట్టడించిన సముద్రపు దొంగలకుకూడా కాంచనద్వీపం అనేది ఒక టున్నదనీ, దానికో చక్కని పటం తయారుచేయబడివుందనీ తెలుసు. వాళ్ళు ప్రాణాలకు తెగించి అయినా డబ్బు కాజెయ్యాలనే నిశ్చయంతో ఉన్నారు. మనదగ్గిర ఆ పటం ఉందని వాళ్ళకు యీపాటికే అనుమానం కలిగిఉంటుంది. మనం సముద్రంమీద బయలుదేరేక్షణందాకా ఒంటరిగా ఎక్కడా తిరగకూడదు. నేను, జిమ్ యీ నాలుగురోజులు కలిసేఉంటాం. నువ్వు బ్రిస్టల్‌కు వెళ్ళేటప్పుడు జాయిస్, హంటర్‌లను వెంటపెట్టుకుని వెళ్ళు. మన ముగ్గురికీతప్ప మరో కంటివాడికి ఈపటం విషయం, మన గమ్యస్థానం విషయం తెలియగూడదు."

''రైట్, లివ్‌సే! నువ్వన్నమాట అక్షరాలా నిజం. నే నిదిగో చేతిలో చెయ్యేసి చెబుతున్నాను' ఛస్తే ఇంకోడికి చెప్ప నీ విషయం. నామాట నమ్ము.'

(ఇంకావుంది.)

★ సున్నయొక్క విలువ ★

పాఠశాలను తనిఖీ చేయడానికి ఇనస్పెక్టరు వచ్చారు. ఆయనకూ లెక్కల్లో చాలా అభిలాష.

మూడో క్లాసు గదిలోకి ప్రవేశించారు. క్లాసు మాస్టరుగారు లేచి నిలుచుని, నమస్కరించి, పైకి గంభీరంగాను, లోపల బెదురుగాను చూస్తున్నారు.

ఇనస్పెక్టరు గారు కుర్చీలో కూర్చున్నారు. ఆయనకు ఒక కన్ను కొంచెం మెల్ల. ఒక పిల్లవానివైపు చూస్తూ-"అబ్బాయీ నీకు లెక్కల్లో అభిలాష ఉందా?" అన్నారు.

మరొక పిల్లవాడు లేచి నిలబడి, "ఉందండీ," అన్నాడు.

"నిన్ను అడగలేదు. వారిని అడిగితే వారే చెప్పాలి" అన్నారు ఇనస్పెక్టరుగారు.

"నా వేపు చూచి ప్రశ్నిస్తున్నట్లు కనబడితే నన్నే అనుకున్నాను; క్షమించండి," అన్నాడు పిల్లవాడు, భయపడుతూ.

"నీ ప్రక్కనున్న పిల్లవానివైపు చూశాను; నీ వైపు చూడలేదే," అన్నారు ఇనస్పెక్టరుగారు, కొంచెం చిరాకుపడుతూ. ఎడమ ప్రక్కనున్న ఇంకొక పిల్లవాడు లేచి, "ఎటుప్రక్కనున్న పిల్లవానిని అడుగుతున్నారు?" అని భయపడుతూ ప్రశ్నించాడు.

"అబ్బాయీ, నిన్ను కాదు. నీలిచొక్కా పిల్లవానిని," అని, బ్లాకుబోర్డు వైపు చూచి, "ఈ క్లాసులో డిసిప్లిన్ బాగు లేదు," అని ఇనస్పెక్టరుగారు మూతి ముడుచుకున్నారు. మాస్టరుగారు, తనతోనే అన్నారని గ్రహించి చిత్తం, చిత్తం, అని చేతులు జోడించి నిలుచున్నారు.

"నీలి చొక్కా పిల్లవాడా అని పిలిస్తే నేనే ప్రత్యుత్తరం ఇచ్చియుందునే," అన్నాడు ఆ బాలుడు.

రచన:
శ్రీ ఎమ్. వి. సుబ్బారావు

ఇనస్పెక్టరుగారికి కొంత పరాభవం జరిగింది. ఆకోపం మాస్టరుగారిమీద ప్రయోగించదలచి, "ఈ పిల్లవాడు చాలా చురుకైనవానివలె ఉన్నాడు. వీనిని లెక్కల్లో ప్రశ్నించండి," అన్నారు.

మాస్టరుగారు: "అబ్బాయీ, ఒక రేడియో రూ. 350 కి కొని, రూ. 38 కి అమ్మితే..."

ఇనస్పెక్టరుగారు: "ఇలాంటి పాతపద్ధతి ప్రశ్నలా వేయడం? మన దేశానికి స్వతంత్రం వచ్చింది గదా, ఇంకా ఈ పూర్వకాలపు నాయనమ్మ పద్ధతులేనా అనుసరించడం! నూతన విధానాలు అవలంబించ వద్దటండీ! గణితశాస్త్రానికి సంబంధించిన జ్ఞానం పిల్లవానికి ఉందో లేదో కనిపెట్టాలి. ఇదిగో నేను ప్రశ్నిస్తాను, వినండి,"

"అబ్బాయీ, అంకెలు ఎన్ని ఉన్నాయి?"

పిల్ల: "తొమ్మిది; ఒకటి మొదలు తొమ్మిది వరకు."

ఇన: "అంతేనా? మరి లేవూ?"

పిల్ల: "లేవు."

ఇన: "సున్న కూడా లేదటోయ్? ఈమాత్రం తెలియదూ?"

పిల్ల: "ఎందుకు తెలియదూ? లెక్కల్లో నాకు ఎప్పుడూ అదే వస్తూంటుంది."

ఇన: "శబాష్; చిన్నసున్నా, లేక పెద్దసున్నా?"

పిల్ల: "విలువ లేకపోయినప్పుడు ఏదయినా ఒకటేనండి."

ఇన: "ఓహో! ఆ మాత్రం జ్ఞానం ఉంది! మాస్టరుగారూ, ఇదుగో చూడండి. బోధించే ప్రజ్ఞ మనకు ఉంటే, ఇలాంటి పిల్లవాళ్ళకూడా బోధపరచి గణితశాస్త్రంలో ప్రజ్ఞావంతుని చేయవచ్చు. చూడండి, ఈపిల్లవానిని ప్రశ్నించి ఎంత తెలివయిన సమాధానాలు చెప్పించుతానో! అబ్బాయీ, ఒకటి తర్వాత సున్న చుట్టితే ఏమిటవుతుంది?"

(36-వ పేజీ చూడండి)

చెన్నపట్నంలో సింహానికి పెద్దపులికి యుద్ధం

ఈమధ్య చెన్నపట్టణం జంతు ప్రదర్శనశాలలో బలే సంఘటన జరిగింది. "లియో" అనే మగ సింహం, "విక్రమ్" అనే మగ పెద్దపులి భయంకరంగా యుద్ధం చేసుకున్నాయి.



"లియో" 1947 లోను, "విక్రమ్" 1949 లోను ప్రదర్శనశాలకు వచ్చాయి. రెండేళ్లపాటు రెండూ ఒకే ఆవరణలో వేరు వేరు బోనుల్లో ఉండేవి. మొదటి నుండీ ఇవి పరస్పరం విరోధభావంతోనే ఉంటున్నాయి.

ఈ నెల 19 వ తారీకున పొద్దున 8 గంటలకి ఏమెచ్చిందో ఏమిటో రెండూ దెబ్బలాడుకున్నాయి. బోనులకు బయట ఉన్న విహారస్థలంలోకి పెద్దపులి వచ్చింది. అదే సమయంలో సింహంకూడా ఆ ఆవరణలో విహరిస్తోంది. ముందు పెద్దపులే సింహంమీదికి దూకిందో, సింహమే పెద్దపులిమీదకి దూకిందో చూసినవారెవరూ లేరు. పొద్దున్నే మామూలుగా బోనులు కడగటానికి బంట్రోతు వచ్చేసరికి రెండూ భయంకరంగా పోట్లాడుకుంటున్నాయి. సాధారణంగా రెండింటినీ ఒకేసారి విహారస్థలంలోకి వదిలిపెట్టరు. కాని ఆరోజున పొరపాటున రెండూ ఒకేసారి విహారానికి బయల్దేరడం జరిగింది.

సింహం వయస్సు 7 సంవత్సరాలు. పెద్దపులి వయస్సు 18 సంవత్సరాలు. మంచి యౌవనంలో పాగ వేక్కి ఉన్నది సింహం. అసలు "సింహాలతో పెద్దపులులు గెలవలేవు" అని ఒక సిద్ధాంతం ఉంది లెండి. దాన్ని నిరూపించడానికి సమయం దొరికింది గదా అని పెద్దపులికూడా సిద్ధమైంది. ఇంతకంటే ఏం కారణం కావాలి పోట్లాటకి?

కాని పెద్దపులి ముసలిదవడంవల్ల కొన్ని నిమిషాల్లోనే తీవ్రగాయాలు తిని తెరిచివున్న తన బోనులోకి పారిపోయింది. బంట్రోతు వెంటనే ఆబోను తలుపులు మూసివేశాడు. గాయాలు నాకుకుంటూ పెద్దపులి అల్లాగే చాలకాలం ఉన్నది. డాక్టర్లు ఏవో చికిత్సలు చేశారు. ఫరవాలేదు, నయమవుతుందని అనుకున్నారు. కాని 24 వ తేదీ సోమవారం రాత్రికి పాపం పెద్దపులి కీర్తిశేషురాలైంది.

సింహానికి కేమీ దెబ్బలు తగల్లేదు. తన బోనులో కూర్చుని పెద్దపులిబోను కేసి చూస్తూ తన చిరకాలశత్రువు ఏమయ్యిందా అని ఆలోచిస్తోంది. శత్రువు చనిపోయిందని దానికేం తెలుసు!

వేటలో ఆరితేరిన ఒక పెద్దమనిషి చెప్పినదాన్ని బట్టి, సాధారణంగా సింహాలకు, పెద్దపులులకూ దెబ్బలాట వస్తే పెద్దపులులే గెలుస్తాయట. అయితే "విక్రమ్" చాలా ముసలివాడు కావటం, "లియో" పడుచుదనపు శౌర్యంలో ఉండటంవల్ల "విక్రమ్" ఓడిపోయాడు. నిజానికి పెద్దపులికి ఉన్న చురుకుదనం, తెలివితేటలు, రోషం సింహానికి లేవు. ఇంకో విచిత్రమేమిటంటే ఆ పెద్దపులేగనక ఆడదై ఉంటే మగసింహం దెబ్బలాటకు దిగే ఉండేది కాదట.



"విక్రమ్"ను జామ్‌నగర్ సంస్థానంవారు చెన్నపట్టణం జంతుప్రదర్శనశాలకు బహుమానం చేశారు. దాని శవం ప్రదర్శనశాలలోనే పాతిపెట్టబడింది. రెండిటినీ ఒకేసారి అజాగ్రత్తగా ఆవరణలోకి వదిలిపెట్టినందుకు బోనుబంట్రోతును అధికారులు సస్పెండు చేశారు. ★

"బాబు"

బాబుయొక్క అసలు పేరు "ఫణి" బాబు. వాడికి నాలుగు సంవత్సరాల వయస్సే. ఐతేనేం? వాడు చేసే అల్లరి, పదిఏళ్లకుర్రాడు కూడా చేయలేడు. వాడు చేసే అల్లరి చూస్తే, ఎంత కోపంలోవున్నా కూడా, చచ్చేనవ్వు వస్తుంది. అందులో, నడకా, మాటలూ బాగా వచ్చాయేమొ మరీ వేపుకుతింటున్నాడు.

మళ్లీ చూడబోతే, ఉష్, అంటే; ఎగిరేలా వుంటాడు. వాణ్ణి కొట్టాలంటే నాకుమటుక్కు నాకే భయం.

బాబు ఒడుపులు వెయ్యటంలో ఘట్టు. ఇంత చిన్నవయస్సులో అన్ని కిటుకులు ఎల్లా నేర్చుకున్నాడో నాకర్థంగాదు.

వాడు ఒడుపులు ఏ మాదిరిగా వేస్తాడంటే:

ఒకరోజున, కాఫీ త్రాగుతూ, ప్లేట్లు కప్పూ, పగలగొట్టాడు. పాపం వాడి తప్పు మాత్రం ఏముందీ, చెయ్యిజారింది కాబోలు. వాడితల్లి నాలుగు మొట్టికాయలువేసి, క్రింద వుంటే, ఇలాటిదే ఏదో ఒకటి చేస్తూంటాడని, క్రిందికి దిగలేకుండా, ఒక ఎత్తైన బల్లమీద కూర్చోబెట్టింది.

కాస్సేపు ఏడ్చాడు. తరువాత బల్లదిగడానికి ప్రయత్నం చేశాడు. కానీ, దిగలేకపోయాడు. ఇక ఏవిధంగా దిగడానికీ తోచక దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

రచన:

మోదుమూడి సీతాదేవి

వాళ్లబామ్మ చిన్న పాపాయికి జోలపాడుతోంది. ఆమెను పిలిచి దింపమన్నాడు రహస్యంగా. కానీ ఆవిడరాలేదు. దింపలేదు. పైగా "మీ అమ్మ నన్ను దింప వద్దందిరా నాయనా" అంది. మరునిమిషంలో బాబుకి ఒక మెరుపులాంటి గమ్మత్తయిన, ఆలోచన తట్టింది. ఇంకేం "అమ్మా, అమ్మా" అని గట్టిగా పిలిచాడు. వాళ్లమ్మ వంటయింటిలోనించే "ఏమిరా వెధవా అరుస్తున్నావ్" అన్నది. "అదికాదే. అమ్మా, మరే, ఈ బల్లమీదే, చీమలున్నాయే. చచ్చేట్టు కుడుతున్నాయి" అన్నాడు. ఆమె వచ్చి "ఇందాక బల్లమీద చీమల్లేవే. అయినా... ఉండు నాన్నా కాస్త దులుపుతాను. అంటూ బల్లమీద నుండి బాబును క్రిందకు దింపి బల్లను దులుపుతూ "చీమలు లేవ్రా, ఏమీ లేవు. వుట్టి దొంగవెధవ" అంటూ ఇటు తిరిగిచూస్తే, ఇంకేముంది. బాబులేడు. ఏమయ్యాడా అని నలుమూలలా చూసి దొడ్డిలోకి వెళ్లి చూస్తే అంత దూరాన పెరటివాకిలిగుండా వెళ్లిపోతున్నాడు వీధిలోకి.

ఇంకోరోజున వాళ్లబామ్మ వళ్లో పడుకొని, "బామ్మా, ఒక కథ చెప్పవ్"అని మారాం చేస్తున్నాడు బాబు. బామ్మ "ఊఁ...ఎప్పుడూ కథలేనీకు. నాకోపిక లేదు కథ చెప్పడానికి, ఇప్పుడు నన్నడగకు." అని కసిరింది. బాబుకి ఇంకేమి చెయ్యడానికి తోచలేదు. వూరికే ఆటగోడుతనానికి బామ్మ చేతివేలు నోట్లో పెట్టుకున్నాడు. పెట్టుకున్నవాడు వూరుకోవచ్చునా? కసిక్కుమని కొరికేడు. ఆవిడ ఒక్క విదిలింపు విదిలించి, వీపుమీద ఒక్కటంటించి "ఓరి నీకడుపుడకా, నిన్ను నేనేం చేశానురా వెధవా, నావేలు కొరుకుతావు? అన్నీ ఛండాలపు పనులే"అని కోపపడింది.

వాడి వుద్దేశ్యంలో బామ్మ

చాలా మంచిదని. ఎవరైనా తన్ను కొడుతుంటే, కొట్టినవాళ్లని కేకలేసి కొట్టకుండా చేస్తుంది. అందుకే బామ్మంటే తనకు ఇష్టం. బామ్మ ఏంచేసినా వూరుకొంటాడు. కాని ఈసారి మాత్రం బామ్మను క్షమింపలేనంత కోపం వచ్చింది. బాబుకి. అసలే కథ చెప్పమంటే చెప్పలేదు మొన్న బల్లమీదనుంచి దింపమంటే దింపలేదు కూడాను. దానికితోడు ఇప్పుడు కొట్టింది.

అసలు బాబు, ఎవరు కొట్టినా దెబ్బకు దెబ్బ బదులు తీర్చుకోవడం అలవాటు. అంత కొట్టలేని పరిస్థితిలో వుంటే అంత దూరం పరుగెత్తివెళ్లి కొట్టినవాళ్లను ఎక్కిరిస్తూ, కాలుచూపిస్తాడు తంతానని.

కనుక ఇప్పుడు బామ్మనుకొట్టి లాభంలేదు. మళ్లీ ఇప్పుడే పట్టుకుని తంతుంది. ఇంకో విధంగా కశితీర్చుకోవచ్చనే వుద్దేశ్యంతో వూరుకున్నాడు.

మర్నాడు సాయంత్రం ఆరుగంటలవేళ, బాబుకి తలంటి నీళ్లు పోద్దామని వాళ్లఅమ్మ, నీళ్లు కాగబెట్టింది. ఇదే సమయమని బామ్మ దగ్గరకువెళ్లి "బామ్మా, బామ్మా, మరే అమ్మ నీకూ నాకూ, నిన్న చేసిన, చేగోడీలు పెడుతుందిట నన్ను పిల్చుకురమ్మంది" అన్నాడు. కాని ఆవిడ, నా కెందుకురా చేగోడీలు. వెళ్లి నువ్వుతిను"అంది. వాడు వినకుండా "కాదు బామ్మా నువ్వుకూడా రా బామ్మా" అని బ్రతిమలాడసాగాడు. సరేనని ఆమె బయలుదేరింది. బామ్మ చేయిపట్టుకుని, నడిపిస్తున్నాడు బాబు.

ఆవిడకు సరిగా కళ్లుకనపడవు. అందులో మబ్బుపట్టి చీకటిగావుంది గనుక అసలే కనపడ్డం లేదు. వసారాలోకి వచ్చాక "బామ్మా, నీచెయ్యి నాకు చూపించవ్, బలేగా వుందే నీచెయ్యి, ఏదీ" అన్నాడు. బామ్మ నవ్వుతూ "నా చెయ్యేమిటిరా చూడ్డం. వట్టి వెర్రినాయనవైపోతున్నావు." అని చెయ్యి అందించింది. ఆ చెయ్యి చూస్తున్నట్టు నటించి, సలసలకాగుతున్న వేడికాగులో ముంచేశాడు. ఆవిడ లబోదిబోమని మొత్తుకుంటోంది. బాబుతల్లి వచ్చిచూసేసరికి బాబు లేడు.

ఈవిధంగా ప్రతిరోజూ అల్లరి చేస్తూంటాడు. ఇంక వాడు నిత్యం చేసే అల్లరి పనులన్నీ రాస్తే పెద్ద గ్రంథమవుతుంది.

బాబుకి ఐదోఏడు వచ్చింది. పలకా బలపంఇచ్చి బళ్లో వేశారు. వాడికి అయిదోఏడు వచ్చిననెల్లాళ్లకి, వాళ్లఅమ్మ, వాళ్ల నాన్నగారు బాబుని తిరపతి తీసుకువెళ్లి గుండు చేయించారు. బాబు గుండు చేస్తుంటే ఏడ్చాడుట. నా జుట్టంతా తీసేస్తున్నారేఅని. కాని వాడు గుండు చేశాక బోడిబలుపు బలిశాడు.

బాబు తిరపతి నుండి వచ్చేటప్పుడు, "డడడా"పాట, "టక్కుటిక్కు" పాట ఇంకా చాలాపాటలు నేర్చుకొచ్చాడు.

ఇంక పిల్లలందరి ముందూ తన ప్రతాపం చూపించుకోసాగాడు. ఒకరోజున వాళ్ల బుల్లి మామయ్య గోచిపెట్టుకుని నీళ్లు పోసుకోడానికి వెళుతున్నాడు. ఇంతలోకే బాబు "డడడా" పాట పాడుకుంటూ అక్కడికి వచ్చాడు. వాణ్ణి చూడగానే బుల్లి మామయ్య

"ఫణిబాబుగుండు దండగే
నోట్లో వేలూ దండగే
డడడా...డడడా..."

అని పాడుతున్నాడు. అక్కడున్నవాళ్లు నవ్వుతుంటే బాబుకి వుక్రోషం వచ్చి, నేనూ పాడ

తాను మామయ్యమీద.

"మామయ్యకు నీళ్లా దండగే
మామయ్యగోచీ దండగే
డడడా...డడడా..."

అని పాడాడు. బుల్లి మామయ్య నవ్వుతూ వూరుకున్నాడు.

బాబు ఏ మాట మాట్లాడినా పాటలాగానే పాడుతాడు.

(సినిమా పాటలే ననుకోండి. అవైనా సమయానికి తగ్గన జ్ఞాపకం రావద్దూ.) ఆఖరికి వాళ్ల బామ్మ మీదకూడా పాటే.

"లాయలప్ప లాయలప్ప టింగరీ బామ్మ అడిలప్ప ఆడిలప్ప హాను మంతు బామ్మ," అని. (వాళ్ల బామ్మపేరు హానుమాయమ్మగారు లెండి)

వాళ్ల అమ్మ నీళ్లు పోసుకోడానికి తలుపులు వేస్తే

తలుపుతియ్యవే భామా!
దబ్బున తియ్యవె భామా!
తలుపుతియ్యవె భామా!

అని గదిబయట చిందులు దొక్కుతూ పాట పాడటం.

పాపం, బాబుచెల్లెలు "బాల" వాళ్లఅమ్మ కొట్టిందని ఏడుస్తుంటే,

ఏడుపెగాని నవ్వేలేని
బాలమ్మంటే ఒళ్లుమంట. ॥ఏ॥

అని చెల్లెలిదగ్గరకు వెళ్లిపాడటం. అసలే ఏడుస్తున్న బాల, ఈ పాట వినగానే, తారస్థాయికి గొంతెత్తేది.

ఒకరోజున బుల్లి మామయ్య అదే దోహిందీపాట "జిందగీకె ప్యార్ హోగయా" అని పాడు కుంటు న్నాడు. అది విన్నాడు బాబు. ఆపాట పాడటానికి నోరు తిరగక "జిందగోకి పేరగోగియా" అని పాడే వాడు బాబు. మామయ్య నవ్వి అల్లాకాదురా అని మళ్లీ పాడి చూపించాడు. కాని బాబుకిరాలేదు.

'ఇదిగో మామయ్యా నేనూ అచ్చు అల్లాంటిదే ఇంకోపాట చెబుతాను. పాడుతావు?" అన్నాడు. బాబు.

"ఏదీ పాడి చూపెట్టు అన్నాడు. బాబు—ఆవు దగ్గరపేడ తీయరా

మన ఆవు దగ్గరపేడ తీయరా
పెంటమీద పారవేయరా
మనపెంట మీద పారవేయరా

మామయ్య పెద్ద పెట్టున నవ్వాడు. "ఓరిగాడిదా, ఎంతవాడివయ్యావురా వెధవా? చూశేవుటే అక్కయ్యా నీకొడుకు? అన్నాడు.

ఆవేళ ఆదివారం. బుల్లి మామయ్యకు సెలవు దినము. అంచేత కొంతమంది పిల్లల్ని తీసుకువచ్చి నాటకం వేయించాడు. అందులో, బాబుచేత హాస్యగాడి వేషం వేయించారు. అంటే సోగ్గాడి (షోకుగాడు) వేషమన్నమాట. సోగ్గాడి వేషం ఎల్లావుందంటే, వంటినిండా మసిపూశారు. నల్లటి "గోడుగు" గుడ్డనుకట్టారు. నెత్తిమీద చుట్ట కుదురుపెట్టికట్టేసిపైన చిరిగిపోయిన పేడపళ్లిక పెట్టారు. వాడికి పాట ముందే నేర్పారల్లేవుంది (వాడిలో వున్న గుణం ఏమంటే, అందరినీ నవ్విస్తాడుగాని తను నవ్వడు) చేతులు తిప్పుకుంటూ లయతప్పకుండా అడుగువేస్తూ పాడుతూ వచ్చాడు తెరలోంచి.

సోగ్గాడో చిన్నినాయనా
క్రాఫింగు తీసికుని
కాకినాడ వెళ్తుంటే
కాకిపిల్ల తన్నింది సోగ్గాడో
ఎరబట్ట కట్టుకుని
ఏలూరు వెళ్తుంటే
ఎలికపిల్లకొరికింది సోగ్గాడో
పేడపళ్లిక పట్టుకుని
దారంట వెళ్తుంటే
దున్నపోతు పొడిచింది సోగ్గాడో

ఈవిధంగా పాడాడు. వాడు మొదట్లో తెరలోనించి రాగానే కొంతమంది చిన్నపిల్లలు దడుసుకున్నారుగూడా. తరువాత వాళ్ల మామయ్య ఇంత చక్కగా పాడినందుకు ఫౌంటెన్ పెన్ బహుమతి చేశాడు బాబుకి.

తిరపతి వెళ్ళివచ్చిన చాలా రోజులకు బాబుకి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. దేవుడి దయవల్ల జ్వరం తగ్గిపోయింది గాని విపరీతమయిన తిండి వాపిరి పుట్టింది. ఏది కనపడితే అదల్లా తినేద్దామని వుండేది. కాని తను లేవలేడు.

వాళ్లమ్మా వాళ్లేమో ఎప్పుడూ ఏమీ పెట్టకూడదంటారాయెను! ఇప్పుడువాడు ఏమాట మాట్లాడినా తిండినిగురించే. పక్కింటి చిట్టిశారద వస్తూండేది బాబుతో ఆడుకోడానికి.

చిట్టిశారద వచ్చినపుడల్లా ఏదో తింటూనే వచ్చేది. దానిదగ్గర బెల్లించి బెల్లించి లాక్కుని తినేవాడు. ఒకరోజున చిట్టిశారద, పెద్ద కొబ్బరిచిప్ప వాళ్ల మామ్మ వాళ్లకు తెలియకుండా తెచ్చుకుని బాబువాళ్ల గడపమీద కూర్చుని తింటోంది. అది కనిపెట్టాడు బాబు. దూరాన్నించే "శారదా, శారదా, అని పిలిచాడు. ఊ...అంది శారద. "అదేంటీ నీచేతులో తెల్లగావుంది?" అన్నాడు. "అదేదో నీ కెందుకూ" అంది (మళ్లీ కాస్సేపు ఏమనడానికీ తోచక ఆమె చేతితోపాటు తన తలకూడా తిప్పుతూ అది తినే పద్ధతి శ్రద్ధగా చూస్తూ కూర్చున్నాడు. "ఒసేవ్ శారదా, బలేగా వుంది కదు టే, తియ్యగావుందా, పుల్లగా వుందా ఏమే?" అని అడిగాడు. శారద కొబ్బరి తినే ధ్యాసలో తియ్...తియ్యగా వుంది అన్నది. ఇంక బాబు వుండబట్టలేక పోతున్నాడు. అమాంతం కొబ్బరి చిప్ప లాక్కుని తినెయ్యాలని ఆపలేని కోరిక పుట్టింది. కాని తొందరపడి లాభం లేదని తెలుసుగా, నెమ్మదిగానే బెల్లించి లాక్కోవాలి.

"ఒసేవ్ శారదా. మరే, ఇదిగో, మనిద్దరమే, అన్నాలాట ఆడుకుందామా? అడిగాడు. "సరే" నంది శారద. ఇద్దరు కలిసి కొబ్బరిచిప్ప పగలగొట్టారు. అన్నం వుడుకుతున్నట్టుగానూ, కుంపటి విసిరినట్టుగానూ, కాసేపు ఆడారు. తరువాత చెరి కాస్త తిన్నారు. ఇంతలో వాళ్లఅమ్మవచ్చి "హోరి, నీ దుంప దెగ, కొబ్బరికూడా తింటున్నావా? ఎందాక అని నిన్ను కనిపెట్టుకొని వుంటాను? నీచేత ఆ పచ్చం మెతుకులు తినిపించలేక నేను ఛస్తుంటే నువ్వేమో అడ్డమైన గడ్డితింటున్నావా! అని శారదచేతికి చిప్ప ఇచ్చేసి వాళ్లింటికి పంపేసింది.

సున్నయొక్క విలువ

(31-వ పేజీ తరువాయి)

పిల్ల: "పది."

ఇన: "సున్నకి విలువ లేదన్నావే"

పిల్ల: "ఒక అంకెకు సున్న చేరుస్తే ఎందుకు విలువ ఉండదూ? విడిగా సున్నకు విలువలేదని మాత్రమే అన్నాను."

ఇన: "సరే; పదికి కొసను సున్న చేరుస్తే?"

పిల్ల: "నూరు."

ఇన: "పదికి ముందు సున్న చేరుస్తే?"

పిల్ల: "ఏమీ అవదు."

ఇన: "అదిగో, చూడండి, మాస్టరుగారూ! ఎంత తెలివిగా ప్రత్యుత్తరాలు ఇస్తున్నాడో! మనం ప్రశ్నించడంలో ఉంది. ఇలాంటి నూతన విధానాలే మీరు కూడా అవలంబించాలి."

మాస్టరు: "చిత్తం, చిత్తం,"

ఇన: "అబ్బాయీ, ఇదిగో విను. ఒకటితరువాత సున్న చుట్టితే పది గదా? పదికి కొసను సున్న చేరుస్తే నూరు అన్నావు జ్ఞాపకం ఉందా?"

పిల్ల: "ఉందండి."

ఇన: "పదికి ముందు సున్న చేరుస్తే ఏమీ అవదు అన్నావు కాదూ?"

పిల్ల: "అన్నాను."

ఇన: "ఇదుగో చూడండి మాస్టరుగారూ; ఈసారి ఎట్లాంటి ప్రశ్న వేస్తానో. "అబ్బాయీ, పదికి మధ్యను సున్న చేరుస్తే?"

పిల్ల: "పంది అవుతుందండి."

మైలురాయి

(22 వ పేజీ తరువాయి)

తను, ఒక లక్షాధికారిని ఊహించుకుంటూ మురిసిపోవటం గుర్తురాగానే, పెంటాలు తనలో తనే నవ్వుకున్నాడు. అలా ఊహించుకున్నందుకు ఏదో తెలియని ఆనందం పెంటాలును చుట్టేసింది. తన జీవితాంతం ప్రయత్నించినా లక్షాధికారి కాలేననే సత్యం పెంటాలుకు తెలుసు. ఇయినా ఏదో తాత్కాలికోద్రేకం ఆక్షణంలో పెంటాలు మనస్సుని చెళ్లున తన్నింది. లక్షాధికారి ననుకున్నంతలో పెంటాలుకు ఒరిగిందేమిటి? అంత సంతోషం ఎందుకు కలగాలి? అనే ప్రశ్న పుండదు. అవరసనచూస్తే, ఎక్కడో దూరదేశంలో వున్న కుర్రాడు ప్రేయసిని స్మరించి, పాత అనుభూతులు గుర్తు తెచ్చుకుని సంతోషిస్తాడు. ఆపిల్ల తన చేతుల మధ్య వున్నట్టే పొంగిపోతాడు. అతనికేమిటి ఒరుగుతుంది? పెంటాలు ఊహాసముద్రంలో మునకలు వేస్తూ పరుగు పెట్టున్నాడు. ఒళ్ళంతా హుషారు పాకింది. ఎంతకాలంనించో కదలలేకుండా, జీవచ్ఛవంలా పడివుండి, పెంటాలు లాంటివాళ్లు లక్షల సంఖ్యలో రోజూ తనమీదపోతూవుంటే, ఏమీ చెయ్యలేక, ఏమీ అనలేక, తెల్లగా పాలిపోయిన మొహంతో నిర్జీవంగా చూస్తూ వున్న సిమెంటురోడ్డు-దానిమీద పెంటాలు దౌడుతీస్తున్నాడు వ్రేటుతిన్న గుర్రంలా.

* * *

రిక్షా ఓనరు వాటాపోను, తనకి మిగిలిన రూపాయి పావలా చిల్లర లెక్కపెట్టుకుంటూ పెంటాలు రోడ్డు ఎక్కాడు. తన గుడిసె దిక్కుగా రోడ్డుమీదపడి అడుగులు వేసి ఛటుక్కున ఆగిపోయాడు. ఇంటి విషయాలన్నీ గుర్తువచ్చినయ్. జబ్బుతో వున్న మూడు సంవత్సరాల పసిపిల్లకు మందు ఇప్పించాలని రెండురోజులనించి పెళ్లాం పోరుచేస్తుంది. "ఎక్కడన్నా అయిదు రూపాయిలు పట్రా రా" అని అహోరాత్రాలు కూడు నీళ్లు లేకుండా ఏడుస్తూ తనుపల్లి నప్పుడల్లా నానా మాటలు అంటూ వుంది. కూడు పెట్టమని అడిగితే "బిడ్డకిట్లావుంటే నీకొక్కరవ్వయినా దిగులు లేదెరా! నీకడుపు నువ్వు చూసుకుంటూ బొచ్చె పగలకొట్టుకోటానికి ఒచ్చావంట్రా? నువ్వు కటికోడివి. నీగుండె కటికిరాయి. నియ్యాంటి ముదనష్టపాడికి పుట్టాడీ బంగారం" అని బావురుమని ఏడ్చేది. "నీ కాళ్లు పట్టుకుంటారా! ఒక్క అయిదు రూపాయిలు తెచ్చి నా బిడ్డని బతికించరా!" అని బతిమలాడేది కాళ్లపడి. ఒక క్షణం పాటు ఆ నరకాన్ని కళ్లముందు చిత్రించుకుంటూ నిశ్చేతనుడయ్యాడు పెంటాలు. ఒక్క నిట్టూర్పు విడిచి అనిర్ణీతంగా బయలు దేరాడు అడుగులు వేస్తూ, ఎక్కడికో? ఏమో?

ధర్మాసుపత్రికి తీసికెళ్తే, డాక్టరు మందు చీటిరాసిచ్చాడు. నాలుగున్నర అవుతుందట. ఈ సంగతి రెండు రోజులక్రితమే చెప్పింది పెంటాలు పెళ్లాం. రెండు రోజులుగా పెంటాలు ప్రయత్నం చేశాడు. మొదటిరోజు పెంటాలు రూపాయిన్నర సంపాయించాడు. ఉదయంనించీ పశువులా రిక్షాలాగిన పెంటాలుకి సాయంకాలానికి విపరీతమైన ఆకలి వేసింది. పొద్దున తాగిన గంజి మెతుకులే ఇంతవరకు ఆధారం. కడుపు నిండా తినకపోయినా కొద్దిగా అయినా ఏమీ తినకపోతే బతకలేడు. పదణాలు పెట్టి బజారుతిండి కొనుక్కున్నాడు. అణాబీడీలు. పోతే పదమూడణాలు మిగిలినయ్. అయిదు రూపాయిలు తెమ్మంటే ఈ ముష్టి పదమూడణాలు తీసికెళ్తే పెళ్లాం మరీ తిట్టిపోస్తుంది. ఇంకా కోపం వస్తది. పెంటాలుకా అయిదు రూపాయిలు ఎంతో పెద్ద మొత్తంగాను, పదమూడణాలంటే, దానికన్నా ఎన్నో వందలరెట్లు తక్కువగాను కనిపించింది. ఇవాల్టికి ఎలాగయినా పెళ్లాన్ని బతిమలాడుకుని, రేపు తప్పక సంపాయించి తెచ్చిద్దామనుకున్నాడు. పదణాలు ఖర్చు చేసి తిన్నా, కడుపులో ఏమూలకీ రాలేదు. ఇంకా ఆకలి వేస్తూనే వుంది. అయిదునిమిషాలు ఆలోచించాడు పెంటాలు. "ఎటు తిరిగి ఈ పదమూడణాలు ఎందుకు పనికిరావు. ఈ డబ్బుతో కూడా ఏదైనా తింటే కడుపయినా నిండుతుంది. తరవాత చూచుకోవచ్చు. ఒకవేళ నా అదృష్టం బాగుండి రేపు అయిదు రూపాయల బాడిగ దొరుకుతుందేమో" అనుకుని ఆ మిగిలిన డబ్బుకూడా తినేశాడు. రెండో రోజు కూడా ఇలాగే జరిగింది. కాని ఇంకా పెంటాలుకు రేపటిమీద ఆశపోలేదు. ఈ ఆశ లేకపోతే నేడు మృగాలకన్నా హీనంగా రోజులు వెళ్లబుచ్చుతున్న నూటికి ఎనభైమంది, జీవితాలు ఒదిలేసే వాళ్లు. జీవితం మార్పులు లేకుండా ఈ రోజు లాగానే ఎల్లకాలం వుంటుందని ఎవరూ అనుకోరు. అలా అనుకుని జీవించలేరు. అలా జీవిస్తున్న వాళ్లు చాలా మంది వున్నారు గాని, వారంతా రేపు చస్తామనగా ఇవాల్టివరకూ ఉజ్వలమైన భవిష్యత్తుకోసం ఎదురుచూస్తూ మరణించినవాళ్లే; కాని వారి ఆశలు అడియాసలే. వారు ఊహించుకున్న ఆశాపూరితమైన "రేపు" లన్నీకూడా, దుఃఖ భాజనమైన 'నిన్న'లకన్నా ఎక్కువైనవి, ఏవీ కావు.

పెంటాలుని పెద్దసమస్య ఎదుర్కొంది. గుడిసెకి వెళ్లటమా. మానుకోటమా? పిల్లాడి బాధలు మూలుగులు వినలేక, పెళ్లాం తిట్లు పడలేక ఈరెండు రోజుల్లోనే పెంటాలుకు తల వాచింది. ఇంటికి వెళ్ళటమంటే ఏ సముద్రంలోనో దూకటం లావుందతనికి. గుడిసెకి వెళ్లలేడు. గుడిసెకి వెళ్లేదేమిటిలే! అని నిశ్చితంగా ఎక్కడికో ఒక చోటికి వెళ్లనూలేడు. కానీ ఒక విషయం మాత్రం పెంటాలుని బాధించటములేదు. "ఇంటిదగ్గర బిడ్డ ఏమై పోతాడో?" అనే దిగులు అతనికి లేదు. పెంటాలు అయిదు రూపాయిలు సంపాయించాలని ప్రయత్నించాడంటే అది కొడుకుని బ్రతికించుకోవాలని ప్రేమచేత కాదు; పెళ్లాం పోరు సహించలేక, దాని మాటలు పడలేక, ఎలా అయినా ఆ నరకంనించి బయట పడాలని అభిప్రాయంతో మాత్రమే. అసలు మొదటినించీ కూడా అతనికి పుత్ర ప్రేమ ఏ కోశాన

లేదు. "ఎందుకని?" ఈ ప్రశ్న అతను రెండుమూడు సార్లు వేసుకున్నాడు. "చాలామంది తండ్రులు, కొడుకులకోసం పడి చస్తుంటారే. మరి నేను కొడుకంటే ఎందుకు పడి చావను?" సమాధానం దొరకలేదు పెంటాలుకి. పెళ్లి కాకముందు ఒకే ఒక పెద్ద కోరికవుండేది: ఏ నాడైనా సరే ఒక రోజున కడుపునిండా, ఇక ఒద్దు అనే వరకు మంచికూరలతో మంచిభోజనం తినాలి అని. అది ఈరోజువరకు తీరని కోరిక. పెళ్లి అయిన తరవాత ఒక కొత్త రకం ఆనందం దొరికింది' పెంటాలుకి. పొద్దు కూకగానే గబగబ రిక్షా అవతల పారేసి గుడిసెకి చేరేవాడు ఏవో కలలు కంటూ. ఒండినకూడు చెరిసగం పంచుకునేవారు. కడుపునిండేది కాదు. అయినా పెళ్లాందగ్గర కొంత సుఖం దొరుకుతుంది గదా అని ఊరుకునేవాడు. కొన్నాళ్లకి పెళ్లానికి గర్భిణీ వచ్చింది. ఆరోనెల. పెంటాలు పొద్దు కూకినతరవాత మామూలుగా సాంగత్యానికి పెళ్లాం పక్కన చేరేవాడు. ఆమె "ఒళ్ళు నొప్పిగావుంది" అనో, "కాళ్లు తీసుకు పోతున్నయ్" అనో తప్పుకునేది. పెంటాలు పెళ్లాం చాలా బలహీనమైన మనిషి కావటం చేత ఆరోనెలకే చాలావరకు నీరసించి పోయింది. పెంటాలు మరీ బలవంతం చేస్తే "బిడ్డకి ఒత్తిడి తగులిద్దు ఒద్దు" అని కఠినంగా అనేసేది. అతను బాధ పడేవాడు. కాని ఏమి చెయ్యలేక ఆకోరిక బలవంతాన అణచుకునేవాడు. పుట్టబోయే కొడుకంటే అసహ్యం వేసిందతనికి. ఇలా వుండగా అకస్మాత్తుగా ఒక ఆలోచన తట్టిందతనికి. "తన పెళ్లానికి కొడుకు పుడ్తాడు. పాలుతాగి పెద్దోడౌతాడు. అన్నంతినే వయసు ఒస్తుంది' అప్పుడు పెళ్లానికి తనకి ఇద్దరికే చాలని అన్నంలో మూడో వాటాదారుడౌతాడు." ఈ ఆలోచనతో పెంటాలు మరీ నిరుత్సాహపడ్డాడు. కొడుకు పెరగకుండా వుండడు. ఒక్కోఏడు పెరిగే కొలది ఇంకా ఎక్కువ అన్నం తింటాడు.' తను రోజూ రోజూ అన్నం తగ్గించి తినటం అలవాటు చేసుకోవాలని ఊహించిన పెంటాలుకు తన కొడుకు ఒక పెద్ద యమదూతలా కనిపించేవాడు. అందువల్ల కొడుకు చచ్చిపోయినా అతనికి పెద్ద చింత లేదు. చచ్చేవాడిని చావనియ్యకుండా తన పెళ్లాం మందులిప్పించాలని అనుకోవటంవల్ల పెంటాలుకు పెళ్లాంమీద బ్రహ్మాండమైన కోపం వచ్చింది. "అయిదురూపాయలంటే మాటలాఏంటి? వాళ్లు ఎలాగో చస్తారు. నేను మాత్రం ఆ నరకంలోకి వెళ్లను." అని నిశ్చయించుకున్నాడు పెంటాలు.

పెంటాలు పరధ్యాసతో ఆలోచనలతో నడుస్తున్నాడు. చాలా మంది జనంగుంపులుగా ఎదురయ్యారు. అతను ఊహించాడు. "సినిమాహాలు దగ్గరలోనేవుంది. మొదటి ఆటకి వెళ్ళి జనం బయటికి ఒస్తున్నారు." అని. రకరకాల మనుషులు- ఆడవాళ్లని, మగవాళ్లని నిర్నిమిత్తంగా చూస్తో హాలు వద్దకి చేరాడు. తనుకూడా సినిమాకు వెళ్లాలనుకున్నాడు. అనుకోవటం, టిక్కెట్టు కొనటం సినిమాలో కూర్చోవటం ఒకదాని వెంట ఒకటి జరిగి పోయినయ్. విశ్రాంతి సమయంవరకుకథలోనిమగ్నమై చూచాడు సినిమా. లైట్లు వెలిగినయ్. బల్ల మీద ఒక పక్క ఒడ్డిగిల్లి ఏదో ఆలోచిస్తూ, బీడీ వెలిగించాడు.

పెంటాలు సినిమాలు చూడటం సాగించి చాలా కాలమైంది. మొదట ఊరికే బొమ్మలు చూచేవాడు. తరవాత కథని గురించి ఆలోచించటం మొదలెట్టాడు. అతనికి కొన్నాళ్ళగా ఒక కోరిక కలిగింది. సినిమాలో మనుషులకి ఎవరికైనా తన పోలికలున్నాఏమోనని వెతికేవాడు. సినిమాలోలాగు, తను ఏమైనా చెయ్యటానికి వీలుందా? అని ఆలోచించేవాడు. సినిమాలో అనేక రకాలుగా అదృష్టం కలిసిఒస్తుంది; అలాగే దురదృష్టం.

సినిమాలో నాయకుడు అనేక కష్టాలు పడతాడు. చివరికి అన్నీ గాలికి మబ్బులు విడిపోయినట్టు విడిపోతవి. ఎన్నాళ్ళనించో వెతుకుతున్న ప్రియురాలు హఠాత్తుగా ఏరోడ్డుమీదనో కనిపిస్తుంది. అతడు బీదవాడైనా పరవాలేదు. ఏ ధనవంతుడి కూతురో ప్రేమించేస్తుంది. ఏ స్నేహితుడో చచ్చిపోతూ తన ఆస్తిఅంతా రాసిచ్చిపోతాడు. ఒకవేళ కథానాయకుడు ధనవంతుడైతే, బీదపిల్లను పెళ్లిచేసుకోటానికి తండ్రి అంగీకరించకపోతే ఇంట్లోంచి లేచిపోయి మెద్రాసు, బొంబాయి, కలకత్తా ఇలాటి పెద్దపట్టణం చేరతాడు. అక్కడ వీడి పాతస్నేహితుడు ఒక ఫ్యాక్టరి పెట్టుకు కూర్చుంటాడు. ఇతను తెలవకుండానే సరిగా అదే ఫ్యాక్టరీలోకి ఉద్యోగంకోసం పోతాడు. పాతస్నేహితుడు కౌగిలించుకుని ఇతన్ని ఆ ఫ్యాక్టరీకి మేనేజరుగా చేస్తాడు. ఇంటి దగ్గర ప్రేయసి ప్రియావియోగాన్ని భరించలేక ఆత్మహత్యకు నదిలో దూకుతుంది. దారిలో ఎవడో వలవేసి చేపలుపడ్తుంటాడు సరిగా ఆవలలోనే చిక్కుతుంది. హాస్పిటలులో చేరుస్తారు. స్పృహవచ్చి కళ్లు తెరిచేసరికి ప్రియుడు ఎదురుగా నించుని వుంటాడు. ఇద్దరూ కౌగిలించుకుంటారు. సుఖాంతమౌతుంది. ఇలాంటివి నమ్మదగ్గ విషయాలేనా? అని పెంటాలుకు అనుమానం వేసేది.

ఒక్కో సినిమాలో యువతీ యువకులు ప్రేమించుకుంటారు. ఇద్దరిలో ఎవరో ఒకరి తండ్రి ఈ పెళ్లిని అంగీకరించడు. ఇక్కడ పిల్ల తండ్రి ఒప్పుకోడనుకుందాం. ఇంకోడికిచ్చి పెళ్లి చేస్తాడు. పెళ్లి కానిచ్చి తరవాత పాయిజన్ తాగి చచ్చిపోతుంది యువతి. ఈ వార్త తెలిసి యువకుడు కూడా కొండ మీది నుంచి దూకుతాడు. చచ్చిపోతాడు. ఇలా ప్రేమించిన ఒకరికోసం ఒకరు ఎందుకు చచ్చి పోతారో? దానివల్ల వారికి సంక్రమించే లాభం ఏమిటో పెంటాలు బుర్రకి అందేది కాదు. వాళ్లు చచ్చిపోయే ఘట్టాల్లో పెంటాలు ఒళ్లు గరపొడిచేది. మనసునిండా విచారం అలముకునేది.

సినిమా జరుగుతోంది. హాలుమీదసన్నగా చినుకులు పడుతున్న శబ్దం, పెంటాలుకు సినిమా మీద విసుగెత్తింది. సాంతం అవకముందే హాలు బయటికి ఒచ్చాడు. "ఎక్కడికి వెళ్లాలి?" అని ప్రశ్న వచ్చింది. ఒక క్షణం ఆలోచించాడు. ఒకసారి గుడిసెకి వెళ్లి పెళ్ళాం ఎట్టావుందో, కొడుకు చచ్చిపోయాడో ఇంకా బతికి వున్నాడో చూసిరావాలనిపించింది. బయలుదేరాడు. వర్షంతో తడిసిన రోడ్డు మీద కాళ్లు జారుతున్నయ్. ఇంకా చినుకులు పడుతూనే వున్నయ్. అంతా చీకటి మయంగా వుంది. గుడిసె పది గజాలు వుందనగా ఆగి నిలుచున్నాడు పెంటాలు. గుడిసెలోకి వెళ్లాలంటే భయం వేసింది. పెళ్లాంకంట పడాలంటే గుండెని ఎవరో అదిమిపట్టినట్టుగా భయమేసింది. ఎంత ప్రయత్నించినా వెళ్లలేకపోయాడు. అలాగే నిర్జీవంగా నిలిచిపోయాడు. "పోనీ తిరిగి వెళ్లనా?" అని ఆలోచించాడు. పెళ్లానికి కనపడకుండా గుడిసె వెనకనించి చాటుగా, కొడుకు ఎలా వున్నది చూసిపోవాలని, నిశ్చయానికి వచ్చాడు.

ఆరిపోటానికి సిద్ధంగా వున్న గుడ్డిదీపం వెలుతురు గుడిసెవెనక సందులలోంచి కనిపించింది. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ, కంతద్వారా తొంగిచూచాడు గుడిసెలోకి. మున్ముందుగా పెళ్లాం మొహంలోకి చూశాడు, మసకగా ప్రసరిస్తున్న కాంతిలో జుట్టు విరజోసుకుని వుంది. కళ్లు ఎర్రగా జ్యోతుల్లా మండుతున్నయ్. ఆరిపోయిన కన్నీటి చారలు చెంపలమీద ఇంకా అలాగే వున్నాయి. పెంటాలు కళ్లకి ఒక మహాకాళిలా అనిపించింది అతని

భార్య. వణికిపోయాడు. ఆమె మొహంలో దుఃఖవుందో, కోపంవుందో పెంటాలు గుర్తించలేక పోయాడు. ఆమె ముందు చినిగిపోయిన చాపమీద కొడుకు అరమోడ్పు కన్నులతో పడివున్నాడు. పొట్ట ఎగరవేస్తూ గురక పెడుతున్నాడు. ఆ అరమోడ్పు కళ్లు బాధా పూరితంగా, అతి దైన్యం వెళ్లబోస్తూ, తల్లి మొహంలోకి చూస్తున్నవి. పెంటాలు బరువుగా నిట్టూర్చాడు. వాడి స్థితి చూసి జాలి వేసింది. తను చేసిన పని ఎంత నిర్దాక్షిణ్యమైనదో పెంటాలుకు అప్పుడు తెలిసివచ్చింది. తన చర్యకి పశ్చాత్తపించాడు. "తను సంపాదించిన మూడు రోజుల డబ్బు ఖర్చు చెయ్యకపోతే మందుకు సరిపోయేవి. అప్పుడు ఇంతబాధ పడేవాడు కాడుగా" అని చింతించాడు. మరు క్షణంలోనే తాను ఎవరిని గురించి జాలిపడుతున్నాడో, అతడు తన జీవితానికి కంటక ప్రాయమైన తన కొడుకు అని తెలియగానే పెంటాలు హృదయంలో ద్రవించిన జాలిని రాక్షసత్వం నాకివేసింది. అప్పటికి పెంటాలు ఒంటిమీది బట్టలు వర్షానికి తడిసిపోయినయ్. ఇంకా చినుకులు పడుతూనే వున్నయ్. తిరిగి ఊళ్లోకి వెళ్లిపోదామని నిశ్చయించాడు. ఒక అడుగు వెనక్కి వేసేసరికి కాలికిందపడిన తాటాకు గలగల మోగింది. ఈ శబ్దానికి తన పెళ్లాం బయటికి వస్తుందేమోనని భయపడి పరుగెత్త మొదలెట్టాడు. రెండు ఫర్లాంగుల దూరం ఆగకుండా పరుగెత్తి అప్పుడు వెనక్కి తిరిగి చూశాడు. తను భయపడటమేగాని వెనక ఎవరూ వస్తున్న అలికిడి వినిపించలేదు. మెల్లిగా నడక ప్రారంభించాడు. పరుగెత్తిన అలసట ఇంకా తీరలేదు. దారి చీకటిగా వుంది. వున్నట్టుండి ధనధనమని శబ్దంచేసుకుంటూ ఎక్కడో పడింది పిడుగు. ఈ ధ్వనికి పెంటాలు గుండె గతుక్కుమంది. పోతూ పోతూ హఠాత్తుగా పల్లపు గుంటలోకి పడి లేచిన బండివలె అయింది అతని మన స్థితి. హృదయాన్ని చేత్తో తట్టి "ఫరవాలేదు" అని ధైర్యం చెప్పాడు. దారికూడా సరిగా కనపడటం లేదు. వర్షతీవ్రత మరీ హెచ్చింది. కుండపోతగా కుమ్మరిస్తుంది. తడిసి ముద్దయిపోయాడు పెంటాలు. "ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా లాభంలేదు. ఈవేళప్పుడు సత్రాలలోకి ఎవర్నీ రానియ్యరు" అనుకుంటూనే రాయితగిలి బోర్లపడ్డాడు. రోడ్డుకి బలంగా గుద్దుకుంది మొహం. లేవబోయి దెబ్బతగిలిన కాలు నిలుపుకోలేక మళ్లా పడిపోయాడు. తన కాలికి తగిలింది ఏదో పెద్దగానే వుంది వస్తువు. చూట్టూ చేతికందినవరకు తడిమి చూశాడు. అది ఒక పెద్దరాయిలా వుంది. ఆ చీకట్లో అంతకన్నా ఎక్కువ తెలియలేదు. మొహమంతా దోక్కుపోయి మంట పెడుతూ వుంది. బలాన్నంతా కూడ తీసుకుని, అతి ప్రయత్నంతో రెండడుగులు వేసి ఒక షాపు ముందు అరుగుమీద వెల్లకిలా పడిపోయాడు. వర్షం కురుస్తూనే వుంది. చలికి పెంటాలు నరాలు ఎక్కడి కక్కడ బిగిసిపోయినవి. తన దీనావస్థకి అమితమైన దుఃఖం వచ్చింది. "ఎంత గతిలేని బ్రతుకు" అనిర్దిష్టంగా తనలో తను గొణిగాడు పెంటాలు. "ఇప్పుడు పెళ్లాం తన దగ్గర వుంటే, ఎలాగైనా బ్రతికించుకోకుండా వదిలి పెడుతుందా? ఈ విషయం దానికెలా తెలుస్తుందిప్పుడు?" అనుకున్నాడు. ఈ వర్షానికి తన పెళ్లాం, కొడుకు ఎక్కడ అవస్తపడుతున్నారో? తనలాగే పిల్లవాడు అమిత బాధపడుతూ వుంటాడు! "అయ్యో పాపం!" పెంటాలు నోటినుంచి స్పష్టంగా వెలువడినయ్ మాటలు. గుడిసె వెనకనించి చాటుగా చూసినప్పుడు పిల్లవాడి గురక, పెంటాలు గుండెలు కదిలించింది. బాధంటే ఏమిటో ప్రత్యక్షంగా అనుభవిస్తున్న పెంటాలు అప్పుడు గ్రహించాడు, తన కొడుకు బాధని. ఇప్పుడా పసిబిడ్డ తనకన్నా ఎక్కువబాధ పడుతూవుంటాడు. తను ఎంత దుర్మార్గుడు! అంత చీకటిలో కూడా పెంటాలుకు తన క్రౌర్యం, వికృత రూపం ధరించి, కోరలు చాచుతూ భయంకరంగా నట్యటం కనిపించింది. తెల్లవారగానే గుడిసెకి వెళ్లి తన కొడుకుని గుండెకి హత్తుకోవాలి. "ఇంతజబ్బులో వున్న పసివాడు ఈ వానలో తడిసి ఇంకా బతుకుతాడా?" అని అనుమానం వేసింది పెంటాలుకు. వెక్కి వెక్కి ఏడ్చాడు "భగవంతుడా! నా కొడుకుని బ్రతికించు" అని ప్రార్థించాడు. ఇకనించి బిడ్డకు ఎంత చిన్న జబ్బు వచ్చినా, తను పస్తుండి అయినా సరే మందు తెప్పించాలి. పెంటాలుకు, ఇన్నాళ్ళుగా అసహ్యించుకొంటున్న కొడుకుమీద ఉప్పెనలా పొంగింది ప్రేమ. ఇన్నాళ్లుగా మానవత్వాన్ని అణిచిపెడుతూ వచ్చిన ఏదో విషహస్తం తొలిగిపోయింది.

ప్రపంచాన్ని తేజోవంతంచేస్తూ బ్రహ్మాండమైన మెరుపు ప్రకాశించి అంతరించింది. తను పడటానికి కారణమైన వస్తువేదో ఇప్పుడు స్పష్టంగా కనిపించింది. అది ఒక మైలురాయి. భూమిలోంచి పెళ్లగిలి ఒరిగిపడివుంది. ఆ మైలురాయి తనకాలు గుద్దుకున్నప్పుడు పడిపోయి వుంటుంది. దీనికి సాక్ష్యం తను అనుభవిస్తున్న బాధ. ఇంతకన్నా వేరే ఏమీ అవసరంలేదు. బాధ జాస్తిఅవుతోంది. పెంటాలుకు అకస్మాత్తుగా ఒక ఆలోచన బుర్రలో మెదిలింది. "నేను నా కొడుకుని పెట్టిన బాధకి ప్రతీకారంగా భగవంతుడు నాకీ శిక్ష విధించాడా? నా పాపమే నన్నీ స్థితికి తీసుకొచ్చి, దిక్కుమాలిన చావుకు గురిచెయ్యబోతోందా?"

"ప్రపంచంలో తిండికి కరువాచి, వారాల తరబడి పస్తులతో, అలమటిస్తూ అనేకమంది చస్తున్నారు—వీళ్లంతా పాపాత్ములేనా? అయితే పాపాత్ములమీద కక్షగట్టి వారిని యమయాతనలతో హింసించి చంపే దేవుడు మాత్రం ఏమి ఘనుడు?" దేవుడిమీద రోత పుట్టింది పెంటాలుకు.

గాలి ఒక్క విసురు విసిరింది. షాపు ముందు పెద్దపెద్ద అక్షరాలతో తగిలించి ఉన్న ఇనపబోర్డు, తీగ తెగి పెంటాలు మీద పడింది. "అబ్బ!" అని అరిచాడు.

పెంటాలు ఆలోచించటం మానేశాడు. శరీరంలో ఆలోచించేశక్తి అయిపోయింది. ఖాళీదేహం విశ్రాంతిగా గచ్చు అరుగుమీద పడివుంది.

ఇంకా వర్షం కురుస్తూనే వుంది! ఆకాశం మెరుస్తూనే వుంది!! పిడుగులు ఉరుస్తూనే వున్నయ్!!!

నాకొక అనుమానం. "పత్రికల్లో, విలేఖరులు పెంటాలుని గురించి ఏమి రాస్తారా?" అని. ★

భర్త ఇంటికిరాగానే భార్య చెప్పింది:

"చూశారా, ఇవ్వాళేం జరిగిందో? మనగోడ గడియారం క్రిందపడింది. ఒక సెకండు ముందుపడివుంటే నా తలపగిలేది."

"ఆ వెధవ గడియారం ఎప్పుడూ 'స్లో' గానే వుంటుందిలే."

సినిమాలలో బాల[illegible]

పిల్లలు జీవితానికి ఎంత జీవం ఇస్తారో కళలకు కూడా అంతే. ఏ నాడో భాసుడూ, షేక్స్పియరూ తమ నాటకాలలో పిల్లల పాత్రలను ప్రవేశపెట్టారు. ఒక్క నాటకాలలోనే కాదు, చిత్రలేఖనంలోనూ, కథలలోనూ, సంగీతంలోనూ, నృత్యంవగైరా కళలలోనూ పిల్లల కుండేస్థానం వారికున్నది. ఈ నాడు పిల్లలకు వేరే పత్రిక లుండటం కూడా మనం చూస్తూనే ఉన్నాం.

కళాకారులుగా పిల్లల్ని ప్రదర్శించటానికి, కళలలో పిల్లల్ని చిత్రించటానికి తేడా ఉన్నమాట నిజమే. దీక్షితులు గారి "నారీ, సీతా, వెంకి" కథలలో ఉండే ఆనందం వేరు, చిన్న పిల్లలు రాసేకథల్లో ఉండే ఆనందం వేరు. చిన్న పిల్లలు కలం పట్టి కథ రాస్తే అందులో ఆనందం ఉండక పోవచ్చు. కాని రచన మినహాగా ఇతర కళలలో ప్రతిభ ప్రదర్శించేపిల్లలు లేకపోలేదు. ఉదాహరణకు బ్రిటన్‌లోని రాయల్ ఎకాడమీలో 14 ఏళ్లలోపు బాల బాలికలు రచించిన చిత్రాలున్నాయి. అందులో కొన్ని చాలా బాగున్నాయి కూడానూ. అట్లాగే గానంలో అసమాన ప్రతిభ కనబరచిన ప్రాడిజీలున్నారు. మనకు తెలిసినంతలో మాస్టర్ మనహర్ బర్వే, మాస్టర్ రాజేశ్వర రావు, బాలమురళీకృష్ణ, కుమార్ గంధర్వ మొదలైనవారు మంచి నిదర్శనం. నృత్యంలో ఇదేవిధంగా కల్పకం, జేబీకమల మొదలైన వారిని చూశాం.

తెలుగు నాటకరంగం మీద నటులుగా వెలిగిన బాలకులు చాలా మంది ఉండేవారు. కాకినాడలో ఒక పిల్లల నాటకసమాజమూ, గుంటూరులో మరొక పిల్లల నాటక సమాజమూ ఉండేవి. ఈ బాల నటులలో చాలా మంది కాలక్రమాన సినిమారంగంలోకి కూడా వచ్చారు.


హాలీవుడ్ చిత్రాలద్వారా చాలామంది పిల్లలు సినిమానటులుగా ప్రపంచ ఖ్యాతి సంపాదించారు. 1925లో చార్లీ చాప్లిన్ వెంట జాకీకూగన్ అనే కుర్రవాడు "కిడ్" అనే చిత్రంలో నటించాడు. అప్పట్లో జాకీ కూగన్‌ను ప్రపంచమంతా ప్రేమించింది. ఆటు తరవాత జాకీకూపర్, బొనిటా గ్రాన్విల్; షర్లీటెంపిల్, మార్గరెట్ ఓబ్రీన్, మిక్కీరూనీ, ఫ్రెడీ బార్థలోమియో జూడీగార్లండ్ మొదలైన పిల్లలు ఎన్ని డజన్ల మందో హాలీవుడ్ చిత్రాలలో కనిపించారు ఇంకా కనిపిస్తున్నారు.

తెలుగు చిత్రాలలోకి బాల నటులను అధిక సంఖ్యలో ప్రవేశపెట్టిన ఖ్యాతి సి. పుల్లయ్య గారికి దక్కుతుంది. ఆయన "అనసూయ", "ధ్రువ విజయం" అనే చిత్రాలు అచ్చంగా పిల్లలతో తీయటమే గాక, ఆనాడాయన తెరమీది కెక్కించిన వారిలో కొందరింకా సినిమా రంగంలో ఉండి ఉన్నారు. తరువాత రామబ్రహ్మం గారు మరికొందరు పిల్లల్ని సినిమాలో ప్రవేశపెట్టారు. ఈ నాటి తారలలో కృష్ణవేణి, జి. వరలక్ష్మి, ఎస్. వరలక్ష్మి, బాలసరస్వతి మొదలైనవాళ్లు పిల్లలుగా తెర ఎక్కినవాళ్లే.

ఇటీవల విడుదలైన చిత్రాలలో కూడా మనకు బాలనటులు కొందరు కనిపిస్తున్నారు. "దీక్ష"లో రామగోపాల్, కుందూ కనిపించారు. "నిర్దోషి"లో మధు కనిపించాడు. "దీక్ష" లోనూ, "సౌదామిని" లోనూ సుధాకర్ కనిపించాడు. "రూపవతి"లో పాప కనిపించింది. వీళ్లంతా ఉత్తమతరగతి



ఆర్. పద్మనాభన్ ప్రొడక్షన్స్‌వారి "రాజేశ్వరి"లో
శ్రీరామమూర్తి, సూర్యనారాయణ రావు



అరుణాఫిలిమ్స్‌వారి "రాజాంబాళ్" తమిళచిత్రంలో మాధురీ దేవి.

నటులనిపించక పోవచ్చు. కనీసం రామగోపాల్, సుధా ప్రజలను ప్రబలంగా ఆకర్షించారు. ఇకముందు రాబోయే చిత్రాలలో మరి కొంతమంది కొత్తపిల్లలూ, పాత పిల్లలూ కూడా విరివిగా కనిపించ బోతున్నారు.

సినిమా నటులుగా వచ్చే పిల్లలు ఎంతవరకు వాస్తవ కళాకారులన్నది చెప్పటం చాలా కష్టం. కళాస్రష్ట అనిపించుకోవటానికి స్టేజి నటుడికుండే సౌకర్యాలు సినిమా నటుడికి ఎన్నడూ లేవు. తెరవెనక జరిగే సినిమా భాగోతం చూస్తే చాలా మంది తారలలో కూడా నటనా శక్తి పరిమితంగానే ఉన్న సంగతి మనకు తెలుస్తుంది. కాని సినిమా ప్రేక్షకులు వారిని గొప్ప కళాకారులుగా స్వీకరిస్తూనే ఉన్నారు. మామూలు సినిమా ప్రేక్షకుడి కన్న డైరెక్టరు మొదలైన వారు ఎక్కువ విమర్శనా జ్ఞానం కలిగి ఉంటారు. అటువంటి డైరెక్టర్లు ఒక్కొక్క నటీమణిచేత కొన్ని కొన్ని మాటలు సరిగా పాత్రకు తగ్గట్టు అనిపించటానికీ, కొన్ని సందర్భాలలో పాత్రకు తగ్గట్టు భావ ప్రకటన చేయించటానికీ ఎన్ని తిప్పలు పడేది ప్రేక్షకులకు తెలిసే అవకాశం లేదు. ఇంత శ్రమ పడినా తారలు చేసే పొరపాట్లను కప్పిపెట్టడానికి కూడా వారు చాలా శ్రమిస్తారు. అందుచేత సినిమా చిత్రాలలో నిజమైన కళాకారుడు డైరెక్టరవుతాడు. సినిమాలలో కుక్కలూ, పశువులూ, పక్షులూ కూడా బాగానే తమ పాత్రలు నిర్వహిస్తాయి. అంత మాత్రానికే వాటికి కళా సృష్టి చాతనవునా అన్న ప్రశ్న కలగనవసరం లేదు.

కాని ఉన్నంతలో నే పిల్లలైన నటులు బాగా చెయ్యటమూ, ఇంకొ బాగా చెయ్యటమూ ఉంటుంది. పిల్లనటులు వస్తుతహా గొప్పనటులైనా కాకపోయినా కూడా సరి అయిన డైరెక్షనుతో వారిని ఆకర్షవంతంగా ప్రదర్శించవచ్చు.

అయితే ఈ బాల నటులతో ఒక చిక్కు కనిపిస్తున్నది. వీళ్లు బాల్యంలో చూపే ప్రతిభ బాల్యం దాటినాక ప్రదర్శించలేక పోతున్నారు. అనేకమంది హాలీవుడ్ బాల నటుల గతి ఏమయిందీ మనకీనాడు తెలియదు. ఒకరూ ఇద్దరూ డియానా డర్బిన్ లాగా మిగిలినా వారికి పూర్వం ఉన్న అంతస్తు ఈనాడు లేదు. ఈ కారణం చేత బాలనటులలో ప్రజాదరణ సంపాదించుకున్న వారికి సినిమారంగంలో కాకపోయినా భావి జీవితంలో మంచి స్థాయి చిక్కేటట్టు చూడటం చిత్రనిర్మాతల విధి. వారికి మంచి వేతనాలివ్వాలి, వారికొరకు మంచి పాత్రలు సృష్టించాలి. చిత్రనిర్మాతలు బాలనటుల విషయమై తగు శ్రద్ధ వహించినట్లయితే, మన చిత్రాలు ఇంకా ఆకర్షవంతంగా తయారు కావటానికీ, ప్రేక్షకులకు-ముఖ్యంగా స్త్రీలకు-సినిమా చిత్రాలపై ఆదరం హెచ్చటానికీ అవకాశం ఉంది ★

సినిమా వార్తలు:


“పెళ్ళి చేసి చూడు”

విజయావారి “పెళ్లి చేసి చూడు” దాదాపు పూర్తిఅయింది. దీనికి కథా, సంభాషణలు వ్రాసినవారు చక్రపాణి గారు. నాగిరెడ్డి, చక్రపాణి గార్లు నిర్మాతలు. ప్రసాద్ గారు డైరెక్టరు. ఘంటసాలవారు సంగీతదర్శకులు. ఇందులో జోగారావు, ఎన్. టి. రామారావు, రంగారావు, జి. వరలక్ష్మి, సావిత్రి, కుంకు, కుమారిగిరిజ, దొరస్వామి, సూర్యకాంతం, వెంకయ్య, పుష్పలత మొదలైనవాళ్లు నటిస్తున్నారు. అస్టు డైరెక్టరు గోఖలే గారు. ఇది మంచి హాస్యచిత్రమవుతుందని తెలుస్తున్నది.



భారతలక్ష్మీవారి “ప్రియురాలు”లో లక్ష్మీకాంత రేలంగిని భయపెడుతోంది.


మాడర్న్ థియేటర్స్‌వారి
సర్వాధికారి
తెలుగు
నాగయ్య
అంజలిదేవి
రామచంద్రన్
నంబియార్
పులిమూటై
నటించినది
పూర్ణా రిలీస్....
BAKTHA.
అక్టోబర్ 5వ తేది విడుదల



రామచంద్రపురం శ్రీ లక్ష్మీ టాకీస్‌లో "పాతాళభైరవి" శత దినోత్సవ సందర్భమున తీసిన ఛాయాచిత్రము. శ్రీ యన్. టి. రామారావు; శ్రీ యస్. వి. రంగారావు శ్రీ రేలంగి వెంకట్రామయ్య; శ్రీమతి మాలతిగార్లు ఉన్నారు.

"టింగురంగా"

యువపిక్చర్సువారు తీస్తున్న "టింగు రంగా" సగంపైగా పూర్తిఅయింది. డిసెంబరు నెలలో విడుదల కావచ్చు. దీనికి తాపీ వారు పాటలూ, మాటలూ రాశారు. ఇందులో ఎస్. వరలక్ష్మి, రామమూర్తి రేలంగి, ఆశాలత, కనకం, రామ్మూర్తి, సీతారాం, సూరిబాబు మొదలైనవారు నటిస్తున్నారు. బి. ఏ. సుబ్బారావుగారు డైరెక్టు చేస్తున్నారు. రాజు, దివకర్ గార్లు సంగీతదర్శకులు. చిత్రనిర్మాత పి. ఎస్. శేషాచలంగారు, నృత్యదర్శకులు పసుమర్తి కృష్ణమూర్తి. ఇది వాహినీ స్టూడియోలో తెలుగు తమిళ భాషలలో తయారవుతున్నది.

"పాలేరు"

టి. కె. ప్రొడక్షన్స్—శోభనాచల వారి "పాలేరు" చిత్రం శోభనాచల స్టూడియోలో చురుకుగా తయారవుతున్నది. డైరెక్టరు, గోపీచంద్ గారు. ఇందులో కృష్ణవేణి, జగ్గయ్య, జానకి, సుమిత్ర, రామ్మూర్తి, కోడూరు అచ్చయ్య, మిక్కిలినేని మొదలైనవారు నటిస్తున్నారు. సంక్రాంతినాటికి చిత్రం విడుదల అవుతుందని తెలుస్తున్నది.

"మానవతి"

సర్వోదయావారి "మానవతి" దీపావళికి విడుదల అవుతున్నది. దీనిని తెలుగు తమిళ భాషలలో నిర్మిస్తున్నవారు ఏ. శంకరరెడ్డి గారు. డైరెక్టరు వై. వి. రావుగారు. ఇందులో జి. వరలక్ష్మి, శ్రీరంజని, నారాయణరావు, ముక్కామల, సి. యస్. ఆర్, రేలంగి, శివరావు, కనకం, రమణారెడ్డి మొదలైనవారు నటిస్తున్నారు. ★

కౌంట్ ఆఫ్ మాంటె క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

64

క్రమక్రమంగా అతిథు లందరూ వెళ్ళిపో నారంభించారు. హెర్మినా డాంగ్లర్ విల్‌ఫర్ట్ దంపతులతో కలిసి వారి బగ్గీలోనే వెళ్ళింది. డాంగ్లర్ చూసీ చూడనట్లు ఊరుకున్నాడు. మాక్సిమిలియన్, చాతో-రీనా, డిబ్రే గుర్రాలపైన బయలు దేరారు. డాంగ్లర్ మేజర్ కావల్కాంటీతో చనువు చేసుకుని తన బగ్గీలో కూర్చోపెట్టుకున్నాడు. మేజర్ చేతి వేలి నున్న ఉంగరాన్ని డాంగ్లర్ కౌతుకంతో చూడనారంభించాడు. మేజర్ కావల్కాంటీ అకస్మాత్తుగా లభించిన ధనం దొంగలపాలు కాగలదనే భయంతో, ఉంగరంవంటి విలువైన వస్తువులకొనేశాడు. "రేపు తమర్ని కలుసుకుని వ్యాపారవిషయం ఒకటి మాట్లాడాలండి" అన్నాడు మేజర్ కావల్కాంటీ.

"మిమ్మల్ని హృదయపూర్వకంగా నా యింటికి ఆహ్వానిస్తున్నాను" అన్నాడు డాంగ్లర్. కుమారునికి ఏడాదికి ఏభైవేల ఫ్రాంకు లిస్తున్న కావాల్కాంటీ కోటీశ్వరుడై ఉంటాడని డాంగ్లర్ ఊహించాడు.

ఆండ్రీ కావల్కాంటీకోసం ప్రత్యేకం ఒక బగ్గివేచి ఉంది. గుర్రాలూ బగ్గీలూ బయలుదేరాయి. ఆండ్రీ ఆఖరున బగ్గి ఎక్కబోతుండగా, అతని భుజంపైన చెయ్యివేసి ఎవరో వెనక్కు లాగారు. ఆండ్రీ వెనుతిరిగి చూశాడు. ఎండ కొట్టుకుపోయిన ఒక ముసలిముఖం కనపడింది. గడ్డం దట్టంగా పెరిగిఉంది. కళ్ళుముందుకుబికి ఉన్నాయి. ఆ నూతన వ్యక్తి చిరునవ్వుతో కోరలవంటి తెల్లని పలువరుస కనపడింది. నెరిసిన తలకు ఎర్రని రుమాలు చుట్టుకున్నాడు. దుస్తులు బొత్తిగా చినిగి దుమ్ముకొట్టి ఉన్నాయి. తన భుజంపైన పడిన బలిష్ఠమైన హస్తాన్ని చూసి ఆండ్రీ గజగజలాడాడు.

"నాతో నీకేంపని?" అన్నాడు ఆండ్రీ.

"క్షమించాలి నన్ను. కాని నీతో కొంత మాట్లాడాలి."

"ఏమిటది? ఏం మాట్లాడాలో వేగం చెప్పు."

"అయితే, నీ బగ్గీలో నన్ను తీసుకు వెళ్ళు."

ఆండ్రీ ముఖం పాలిపోయింది. నోట మాట రాలేదు. నూతన వ్యక్తి నిర్లక్ష్యంగా యువకునివంక చూస్తూ, "అవును. నాకా దుర్బుద్ధి పుట్టింది. తెలిసిందా బెనెడెట్టో." అన్నాడు.

చివరిపేరు విని ఆండ్రీ కొంత ఆలోచించాడు. "ఆగు. నీకోసం అద్దెబండి ఒకటి పిలిపిస్తాను అన్నాడు.

"అబ్బెబ్బె! వొద్దు. నీ బగ్గీలో ఊరేగాలని నాకు కోరికుందనుకుంటున్నావేమో లేదు. కాని నేను బాగా అలిసిపోయున్నాను. అదీకాక నీతో జరూరుగా మాట్లాడవలసిన పనుంది."

"సరే. రా." అన్నాడు ఆండ్రీ. బగ్గీ ఆటివ్‌ల్ గ్రామం దాటిపోగానే ఆండ్రీ చుట్టు జాగ్రత్తగా పరికించాడు. దగ్గరలో ఎవరూ లేరని చూసి "ఊ! చెప్పు! నేను సుఖంగా ఉంటే చెడగొట్టడానికే వచ్చావా?"

"నే నడిగే దానికి జవాబు చెప్పు" అన్నాడు నూతన వ్యక్తి. "నన్నెందుకు మోసం చేశావు?"

"నేనేం మోసం చేశాను?"

"ఏం మోసంచేశానని అడుగుతున్నావా? మనిద్దరం విడిపోయినప్పుడు టస్కనీకి వెడతానని చెప్పావు. కాని పారిస్ వచ్చావు."

"దానివల్ల నీకేం నష్టం?"

"నష్టమేమీ లేదు. లాభమే ఉందిలే."

"ఓహో! అయితే నన్ను అడ్డుపెట్టి ధనం సంపాదించాలని చూస్తున్నావా?"

"ఆహా! ఏమి సొగసైనమాటలు నేర్చావు!"

"కాని నువ్వు పొరపడుతున్నావు కాడరూస్."

నీ కొక బగ్గీ, ఒక నౌకరూ, చక్కని దుస్తులూ! ఆహా! నీ కెక్కడో పాతరదొరికుండాలి. లేదా డాంగ్లర్ మాదిరిగా ధనవ్యాపారం మొదలెట్టి ఉంటావు."

"అయితే నీ కసూయ కలుగుతోందన్న మాట."

"లేదు. నాకు ఆనందం కలుగుతోంది. నిన్ను వెంటనే అభినందించా లనుకున్నాను. కాని నాకు మంచి బట్టలు లేకపోయాయి. అందువల్ల సమయంకోసం బయట కాసుకుని కూర్చున్నాను. లేకపోతే నీ పరువు బయటపడేది."

"సరే. నీకేం కావాలో చెప్పరాదూ?"

"ఎందుకా కోపం. నీకు నేనంటే స్నేహం, ఆపేక్ష లేనట్లున్నాయి. బెనెడెట్టో! ఇది మంచిదికాదు. జాగ్రత్త సుమా! లేకపోతే నిన్ను తిప్పలు పెట్టగలనని మరిచిపోకు."

దీనితో ఆండ్రీ బెట్టువిడిపోయింది. మెల్లిగా ఇలా అన్నాడు: "నువ్వు నీ పాతస్నేహితుని ఇలాగేనా ఆదరించేది? నీ ముసలి సాధింపూ, తిక్కాపోనిచ్చుకున్నావు కాదు. మనవంటి స్నేహితులలో ఇలాంటి బెదిరింపులూ కలహాలూ ఉంటాయా? ఏదైనా ఉంటే మనలోమనం సరిపుచ్చుకోవాలి. అదృష్టదేవత నిన్ను చిన్నచూపు చూసి నన్ను ఆదరిస్తే అది నా తప్పా?"

"అది అన్యాయంకాదూ బెనెడెట్టో! పాతస్నేహితుడవు మళ్ళీ కనపడ్డావు. ఇంక నేను కూడా మంచిబట్టలు కొనుక్కుని సుఖంగా గడపడానికి అడ్డేముంది చెప్పు? నీది ఎంత ఉదారబుద్ధో నాకు తెలుసు కాబట్టి ఇలా చనువు తీసుకుంటున్నాను. నీకు రెండుకోట్లు ఉన్నాయనుకో. నా కొకటిస్తావు. నువ్వు ఆకలితో బాధపడుతున్న రోజుల్లో నేను నాపులుసూ రొట్టీ కూరా నీకు పంచి ఇవ్వలేదా?"

"నిజమే."

"అయితే ఆ కోటీశ్వరుడి ఇంట్లో విందుకి ఎలా వెళ్ళావు?"

"ఆయన ఒక కౌంట్. కాని నువ్వు ఆయనతో ఎప్పుడూ మాట్లాడకుసుమా. అంతేంటే మంచివాడు కాడు, కోపిష్ఠి."

"అబ్బే ఆయనతో నే నెందుకు మాట్లాడతానూ? ఆయనతో వ్యవహారాలు నువ్వే చూసుకో. కాని అందుకు నువ్వు పరి

అనువాదం: సీతారామ్

హోర మివ్వవలసి ఉంటుంది నాకు. అర్థమయిందా?" అన్నాడు కొడరూస్.

"సరే ఏం కావాలి నీకు?"

"నెలకి నూరు ఫ్రాంకులైతే......"

"ఇదిగో రెండువందలు." అంటూ ఆంఢ్రీ డబ్బుతీసి కొడరూస్ చేతిలో పెట్టాడు. "ప్రతి నెలా మొదటి రోజుని నా గుమాస్తాని కలుసుకో. రెండువందలు చొప్పున ఇస్తాడు."

"అదిగో. మళ్ళీ నన్ను అవమానం చేస్తున్నావు."

"ఎలాగ?"

"నీ ఒక్కడితోనే గుంభనగా వ్యవహరిద్దామనుకుంటే, నీ నౌకరు దగ్గిరకి వెళ్లి చెయ్యి చాచమంటున్నావు."

"అయితే నీయిష్టప్రకారమే కానియ్యి. నాకు నారాబడి వస్తున్నంతకాలం నీసొమ్ము నీకు ప్రతినెలా ముట్టుతుంది."

"అలా ఉండాలి. నువ్వు చాలా మంచివాడవని నేనెప్పుడు అంటూనే ఉంటాను. నీవంటివాడికి అదృష్టం కలిసివస్తే అందరికీ మంచిది. కాని నీకీ డబ్బెలావచ్చిందో అదంతా చెప్పు."

"నిజమేమిటంటే, నేను నాతండ్రిని కనుక్కున్నాను."

"ఆయన పేరు?"

"మేజర్ కావల్కాంటి."

"ఎలా కనుక్కున్నావు?"

"కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో సహాయం చేశారు."

"నాకుకూడా నీతాతననో మరొకటనో ఒక ఉద్యోగం ఇప్పించరాదూ.?"

"నీమాట ఆయనతో చెప్తాలే. ఈలోగా నువ్వేంచేస్తావు?"

"ఎక్కడో మర్యాదస్తులుండే చోట ఒక గది అద్దికి తీసుకుంటాను. మంచిబట్టలు కొనుక్కుని, నీటుగా ముస్తాబై హోటళ్ళకి వెళ్లి పత్రికలు చదువుతూ కూచుంటాను. రాత్రివేళ నాటకాలు చూస్తాను. వ్యాపారం చేసి విరమించుకున్న వాళ్లమాదిరిగా సుఖంగా వెళ్ళబుచ్చాలని కోరిక."

"సరే నువ్వు కోరుకున్నవన్నీ లభిస్తున్నాయి. మనిద్దరిమధ్యా వ్యవహారంకూడా తేలిపోయింది. కాబట్టి ఇంక నువ్వు బండిదిగి వెళ్లు."

"అబ్బే, అదెల్లాగ? నువ్వే ఆలోచించు. తలకీ ఎర్రరుమాలూ ఈ చిరిగిపోయిన బట్టలూ నన్నూ చూసి నా జేబులో రెండువందల ఫ్రాంకులున్నాయంటే పారిస్ పొలిమేరలో నన్ను పట్టుకుని జైలులోకి తోస్తారు. ఇంక మళ్లీ బైటపడలేను. అందువల్ల నేనూ పారిస్ నగరానికే వస్తాను."

ఆంఢ్రీ ముఖం జేవురించింది. చెయ్యి జేబులో పిస్తోలు మీద పడింది. కాని ఇంతలోనే కొడరూస్ ఛర్రున ఒక కత్తి తీశాడు. దాంతో ఆంఢ్రీ చెయ్యి ఇవతలకి వచ్చింది. పిస్తోలు జేబులోనే ఉండిపోయింది. కొడరూస్ కత్తి ముడిచేశాడు.

"సరేండు పారిస్‌కి. కాని ఇప్పుడు మాత్రం పొలిమేరలో నిన్ను చూస్తే ఏమనుకుంటారు? పట్టుకోరా?"

"నువ్వే చూడు" అంటూ కొడరూస్ ంఢ్రీ తలపై టోపీ తీసి తాను పెట్టుకున్నాడు. ఆంఢ్రీ పెద్ద కోటుతీసి ఒళ్లంతా కప్పుకున్నాడు.

"మరి నా కోటూ టోపీ?" అన్నాడు ఆంఢ్రీ.

"లేకపోతే ఫరవాలేదు లే. గాలికి నీ టోపీ ఎగిరి పోయిందనుకుంటారు లే."

నిరాటంకంగా ఇద్దరూ బగ్గీలో పారిస్ నగరం చేరుకున్నారు. కొడరూస్ ఒక వీధిలో దిగి వెళిపోయాడు. ఆంఢ్రీ నిట్టూర్చాడు. "అమ్మో! ఎంత సుఖం అనుభవించా లనుకున్నా, ఏదో ఒక లోటుండక మానదుకదా!" ★

"భగవంతుడు మనదేశప్రజలకు మూడు అమూల్యమైన వరాలిచ్చాడు: ఒకటి వాక్స్వాతంత్ర్యం, రెండు భావస్వాతంత్ర్యం, మూడోది—ఆ రెంటినీ ఉపయోగించడం క్షేమంకాదనే వివేచనజ్ఞానం."

—మార్క్ ట్వేన్.

పజిల్ నెం. 1

గ్యారంటీ బహుమతులు -

ముగింపు తేది 13-10-51

కీ సొల్యూషను 24-10-51 ఆంధ్ర వారపత్రికలో

గెల్వండి రు. 1,000

మొదటి బహుమతి రూ 500 (ఆల్ కరెక్టు)


రెండవ బహుమతి రూ 300 (ఒక తప్పుకు)

మూడవ బహుమతి రూ 200 (రెండు తప్పులకు)

రూపాయికి 3 ఎంట్రీలు చొప్పున ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును.

—నిలువు—

1. అడవి పావురము
2. శివక్షేత్రము
4. పెద్దలు వచ్చినప్పుడు దీనిని ఏర్పాటుచేసెదరు.
7. సంపెంగచెట్టు
8. బలరాముడు
9. పెద్దవారు స్వర్గస్తులైనప్పుడు వారికి శాంతి కలుగుగాక అని ఆశీర్వదించెదరు.
10. నిద్ర
12. మైలవన్నె ఆవు
13. మూడు రూపాయల ఎత్తుగల తూనికరాయి
15. విధి (యథా తథము)
16. ఆకాశము
17. సత్పురుషుడు మాట్లాడునది
18. అపకీర్తి
19. నీటిపై ప్రయాణమునకు ఉపయోగించునది



—అడ్డము—

1. కుబేరుడు
3. ఆహారము
5. బిక్షమెత్తుకొని జీవించు భిక్షుకుడు
6. ఇది దేమునికి ఇచ్చెదరు
7. ఇంద్రజాలము తెలిసినవారి దగ్గర ఇది తప్పక ఉండును.
8. సీరుతో డు తాటిదోనె
11. బుద్ధి
12. ఒట్టు
14. బలము (యథాతథము)
15. గాలిలో ఎగురునది
17. పుణ్య కార్యముల గురించి ఇది వసూలు చేసెదరు
20. పిల్లలకు చాల ఇష్టము
21. నీరు
22. వక్రము (కలగలుపు)

నిబంధనలు: ఎన్ని ఎంట్రీలైనా తెల్లకాగితముమీద వ్రాసి పంపవచ్చును. ముగింపు తేదీనాటికి మా ఆఫీసుకు ఎంట్రీలు చేరవలయును. ఆ తరువాత వచ్చు ఎంట్రీలు అంగీకరించబడవు. కూపనులతో బాటు, మనియార్డరు రశీదుగాని క్రాసుచేయని ఇండియన్ పోస్టల్ ఆర్డరుగాని జతచేసి పంపవలెను. ఈ పజిల్ తాలూకు గెలిచినవారి లిస్టు కావలసినయెడల ఎంట్రీలతోపాటు 0-4-0 స్టాంపులు పంపిన 16-10-51 కి పంపబడును. ఎడిటరుదే అన్ని విషయములలోను తీర్పు ఖాయము. పోటీ విషయములలో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు.

సవరణ

14. అడ్డమునకున్నూ 15 అడ్డమునకున్ను మధ్య, అనగా "ము" "వి" ఈ రెండు అక్షరములమధ్య ఒక గడి ఖాళీగా యున్నది ఆ గడి మూసివున్నది అని పోటీదార్లు భావించవలయును. బ్లాకు చెక్కడములో పొరపాటున చెక్కబడినది కావున ఈ విషయము పోటీదారులు గమనించవలయును.

LAXMI CROSS WORDS (Regd)

VIJAYAWADA-2

దొరలు!

(21-వ పేజీ తరువాయి)

ద్యావుమన్న అరపులు వినపడ్డవి. ఎల్లి భయపడి ఆ గదిలో ఒక మూలకు పరుగెత్తింది. తిరిగి అదే విధముగా ఒకసారి పిల్లుల అరపూ, ఒకసారి కుక్కల అరపూ వరుసగా అర గంటసేపు వినవచ్చినవి. ఎల్లి భయముకొద్దీ కళ్లు మూసుకొన్నది.

కాసేపటికి ఎల్లి ధైర్యము తెచ్చుకొని మెల్లగా కిటికీ దగ్గరకు వెళ్లి, కొద్దిగా తలుపులను తెరచి, ఆ శబ్దము ఎక్కడనుండి వస్తున్నదోనని అటూ ఇటూ చూడటము మొదలు పెట్టింది. ఎల్లి యింటికీ సభ్యులు సమావేశమైన లానుకూ సుమారు పదిగజాల దూరము ఉంటుంది. క్లబ్బు సభ్యులు రెండు వరుసలుగా చీలి ఎదురెదురుగా నిలబడినట్లుగా ఎల్లికి కనబడ్డది. ఆ అరపులకు వాళ్లుకూడా భయపడి లేచి నిలువబడినట్లుగా ఎల్లి భావించుకున్నది.

మరికాసేపటికి సహస్రగార్దభము లొక్కసారిగా ఓండ్ర పెట్టినట్లు ఎల్లికి వినపడ్డది. ఈసారి ఎల్లి భయపడకుండా కిటికీతలుపుల సందుగుండా చూడటము మొదలుపెట్టింది. రెండు తెగలుగా ఎదురుబడి నిలువబడిన సభ్యులు ముందుకువంగి నోరు తెరచినట్లూ, ఆ శబ్దము అక్కడినుండే బయలుదేరి వస్తున్నట్లు ఎల్లి అర్థము చేసుకొన్నది. ఈ అరపుల వలన కలిగిన ఆశ్చర్యము ఎల్లి ముఖము మీద అట్లా ఉండగానే, అందరూ కలిసి ఒక్కసారి గొల్లుమన్న శబ్దము వినవచ్చింది. ఎల్లి కిటికీ తలుపులను మరికొంచెము తెరచి చూసి నిర్ఘాంతపోతూ ఉండగా "ఇంకా పడుకోలేదూ ?" అంటూ వీరన్న లోపలికి వచ్చాడు.

"అదేమిటి...అటు చూడు !...అటు చూడు!" అని ఎల్లి వీరన్నను గట్టిగా పట్టుకొన్నది.

వీరన్న కిటికీలో తలపెట్టి చూశాడు. ఆ క్లబ్బులో నౌకరీచేస్తున్న వీరన్న అటువంటి దృశ్యాలను అనేకము నిశ్చలముగా చూడటము నేర్చుకున్నాడు. చేతులనూ కాళ్లను నేల కాన్చి, తల పైకెత్తి గాడిదలు ఓండ్ర పెట్టుతున్నట్లు సభ్యులు చూపుతున్న ప్రదర్శన మది !

"అదేమిటి ? వాళ్లు అట్లా చేస్తున్నారు? అని ఎల్లి వీరన్న ఎదలో తల దాచుకున్నది.

"అవి దొరల ఆటలే ఎల్లీ! నీవు భయపడబోకు ! వాళ్లు దొరలు కదూ మరి! ఇక్కడున్నంతసేపూ అట్లా ఆడుకుంటారు." అంటూ వీరన్న ఎల్లి వీపు నిమిరాడు ! ★

గ్రంథస్వీకారం


1. శ్రీశాయిబాబా చరిత్రము (యక్ష గానము)
రచయిత : విద్వాన్ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యము. వెల : 6 అణాలు.

2. జయభేరి (ఖండకావ్యము) కర్తలు : ఉభయభాషా ప్రవీణ జాస్తి వెంకటనరసయ్య, విద్వాన్ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యం వెల. 10 అణాలు.

3 శ్రీ త్రినాథవ్రతకల్పము. కర్త : డా. పోంగాకి శ్రీనివాసరావు. వెల. 6 అణాలు.

పై మూడు పుస్తకాలూ ప్రచురించిన వారు : సుందరరాం అండ్ సన్స్, తెనాలి

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madra



శ్రీ కళా వెంకట్రావుగారు

—ఫొటో : శ్రీ చావలి నాగేశ్వరరావుగారు.

శ్రీమదాంధ్ర

మహాభారతము

ఉద్యోగ పర్వము

వెల ఒకరూపాయ

త్వరలో వచ్చుచున్నది.

టామ్ సాయర్

(పిల్లల నవల)

రచన:

మార్క్ ట్వేన్

అనువాదం:

నండూరి రామమోహనరావు

వెల రు. 2/- పోస్టుఖర్చులు ప్రత్యేకం

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికనుండి పునర్ముద్రితము.

కాపీలకు:

ఆంధ్రగ్రంథమాల,

నెం. 7 తంబుచెట్టివీధి, మద్రాసు 1.